అమ్మతో
క్షణక్షణం అనుక్షణం



ఎ.యస్. చక్రవర్తి

కుసుమా చక్రవర్తి

అమ్మతో

క్షణక్షణం అనుక్షణం



శ్రీ ఎ.యస్.చక్రవర్తి

శ్రీమతి కుసుమా చక్రవర్తి

ప్రథమ ముద్రణ : ఆగష్టు 2011

ప్రతులు : 1000

ప్రతులకు : **శ్రీమతి ఎ. కుసుమాచక్రవర్తి**
రిగార్డియా ఫార్మాసుటికల్స్
ఎ2 బాబా టవర్స్,
ఆంధ్రాయూనివర్శిటీ ఔట్‌గేట్స్ ఎదురుగా
విశాఖపట్నం -17. ఫోన్ : 2742318

మాతృశ్రీ పబ్లికేషన్స్
జిల్లెళ్ళమూడి - 522 113.
బాపట్ల మండలం, గుంటూరు జిల్లా.

వెల : **రూ. 60/-**

డి.టి.పి. : **క్రియేషన్ గ్రాఫిక్స్,**
5/4, అరండల్‌పేట
గుంటూరు. ఫోన్: 2250885

ముద్రణ : **శ్రీ లక్ష్మీగణపతి ఆర్ట్‌ప్రింటర్స్,**
2/4, బ్రాడీపేట,
గుంటూరు.ఫోన్: 2235036



His Holiness - Jagadguru

SRI SIDDHESWARANANDA BHARATISWAMY

Siddheswari Peethadhipati - Courtallam

Mounaswamy Mutt,
Courtallam - 627 802
(Via Tenkasi),
Thirunelveli (Dt.)
TAMILNADU
Ph:04633-283707

పరమహంస, పరివ్రాజకాచార్య, జగద్గురు
శ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి
సిద్ధేశ్వరీ పీఠాధిపతి - కుర్తాళం

Camp Office :
B1-C40,
Kaalipeetham Street,
4th Line,
Ravindra Nagar,
GUNTUR-522 006
Ph : 0862-2231625
2256666

ఆశీర్వాద శ్రీముఖము

శ్రీ ఎ.యస్.చక్రవర్తిగారు వారి శ్రీమతి కుసుమాదేవి జిల్లెళ్ళమూడి అమ్మ భక్తులు. ఆమె పదపద్మాలను నమ్ముకొని అనన్యనిష్ఠతో కొలుస్తూ ఉంటారు. వారి జీవితంలో క్షణక్షణము ఆమె లీలలను దర్శిస్తుంటారు. ఆ అనుభూతులను చక్రవర్తి గారు వాగ్రూపంలోనికి తెచ్చి ప్రచురించిన గ్రంథమిది. కుసుమాచక్రవర్తి గారు రచించిన వచన కవితలు కూడా ఇందులో చేర్చారు.

అనుభూతిపరమైన అంశాలు విశ్వాసానికి సంబంధించినవి. స్వతః ప్రమాణములు. చెప్పిన వారియందు నమ్మకమున్నవారు నమ్ముతారు. భక్తుల అనుభవాల కథలే కదా పురాణములు. ఇవీ అటువంటివే. మాతృశ్రీ అనసూయాదేవి యందలి భక్తివల్ల ఇటువంటి నిదర్శనాలు, దర్శనాలు చాలామందికి కలిగినవి. నేను కూడా ఆ పట్టికలోని వాణ్ణే.

ఏదైనా చదివించే గ్రంథం. రచన సులభంగా ఆకర్షణీయంగా ఉంది. సహృదయులకు నచ్చుతుంది. రచయిత్రీ రచయితలకు అభీష్టసిద్ధిని అమ్మ ప్రసాదించునుగాక ! శుభమస్తు. నారాయణ స్మృతితో

సిద్ధేశ్వరానంద భారతీస్వామి



తొలిమాట

శ్రీ గోపాలన్నయ్య

మానవుని జీవితము బహుచిత్రమైనది. "ఆశా అసంతృప్తుల కలయికే జీవితం" అన్నది అమ్మ. ద్వందాలతో మిళితమైనదే సృష్టి. ద్వంద్వాలు లేకపోతే సృష్టే లేదు. జీవితం ఒక మహాసముద్రం. దీనిలో అనేక తరంగాలు వున్నవి. అటుపోటులు వున్నవి. రత్నరాసులు వున్నవి, తిమింగలాలు వున్నవి. అయినంత మాత్రాన జీవితాన్ని వదలి మనము బయటకు పోలేము. "మనము సంసారము లోనే వుండి మనలో సంసారం లేకుండా చేసుకోవాలి" అన్నారు అమ్మ. ఇది భగవంతుని లీల అను, ప్రకృతి విశేషం అను. జీవితంలో తాను అనుభవించిన కష్టనష్టాలను అమ్మ ప్రసాదంగా మలచుకొని వాటిని ఎట్లా అధిగమించాలో, వాటిని ఎట్లా అమ్మ కరుణగా భావించాలో, తనే కాకుండా మన సోదరీసోదరులు అమ్మ కరుణతో ఎట్లా తమ తమ జీవితాలను నడుపుకొనుచున్నదీ, కన్నులకు కట్టినట్లు వ్రాసిన అనేక వ్యాసాలు "విశ్వజనని" మాసపత్రికలో ధారావాహికంగా నెలనెలా పాఠకులను ఆకర్షిస్తున్నవని మనకు తెలిసిన విషయమే.

శ్రీ ఎ.యస్.చక్రవర్తిగారు శ్రీమతి కుసుమాచక్రవర్తి నాకు బంధువులు మీదు మిక్కిలి "తోడబుట్టినవారు". వారు అమ్మ సన్నిధిలో గడపవలసిన ఆవశ్యకత, గడిపిన విధానము, అమ్మకు వారికి వారు అర్పించుకున్న తీరు, వారి వ్యాసాలలో వారి భావాలను వెలిబుచ్చారు. ఈ వ్యాసాలను ఒక పుస్తకరూపంగా మలచి మన చేతులలో వుంచారు.

దీనికి టైటిల్ "క్షణక్షణం" అని తమ జీవితాలలో ప్రతిక్షణం అమ్మ ప్రసాదంగా స్వీకరించటం దీనికి ఒక ప్రత్యేకత. "ఆ ఒక్క క్షణమైన చాలు" అంటాడు 'రాజు'. అమ్మ సేవలో పునీతమైన ఆ ఒక్క క్షణం మధురాతి మధురం. ప్రతి క్షణం వారిని వారే పరీక్షించుకున్నారు. అట్లా అందరు తమ తమ జీవితాలను ప్రతిక్షణం పరికిస్తే అమ్మ జీవిత విధానం ఎట్లా విశిష్టమైనదో తెలుస్తుంది.

అమ్మ కరుణాకటాక్ష వీక్షణలతో ఈ దంపతులు తమ జీవితాలను సార్ధకత పరుచుకుంటారని, వారి చేతిమీదుగా అమ్మను గూర్చి అనేక గ్రంథాల వెలుగులు వెలువరిస్తారని ఆశిస్తున్నాను.



అనుభవమే అక్షరమైతే.....

ఆర్షవిద్యావిభూషణ
శ్రీమల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

అవతారమూర్తి అయిన "అమ్మ"ను దర్శించి, సేవించిన చరితార్థులు ఎందరో ఉన్నారు. వారిలో కొందరు ఆర్తితో అమ్మ సన్నిధికి చేరి తమ 'గోడు' అమ్మకు నివేదించుకుంటూ ఉంటారు. ఆ కోరికలు నెరవేరితే, అమ్మ కరుణించిందని ఉప్పొంగిపోతారు. ఆ కోరికలు తీరడంలో జాప్యం జరిగితే, అమ్మ చిన్నచూపు చూసిందని, అమ్మదయకు పాత్రులు కాలేకపోయామని ఆవేదన చెందుతారు. కోరిక తీరినతీరును, జాప్యం జరిగే తీరును కూడా పరిశీలిస్తూ, అంతర్మథనం చేసుకుంటూ, అమ్మను గురించి తెలుసుకుంటూ ఉంటారు. వారి మనస్సులో పెరిగే ఆ జిజ్ఞాస క్రమంగా జ్ఞానమార్గం వైపు వారిని మళ్ళిస్తుంది. "సర్వమున్ 'అతని' దివ్య కళామయము"నే గుర్తింపు వారి గుండెలో గుబాళిస్తుంది. అమ్మ స్మరణ వారి దైనందిన జీవితంలో భాగం అవుతుంది.

ఆనాటి నుంచి తమకు కలిగే ఆనందమైనా, ఆవేదనైనా, సుఖమైనా, దుఃఖమైనా, లాభమైనా, నష్టమైనా అంతా అమ్మ లీలావిలాసంగా అనుభవం కలుగుతుంది. అనుక్షణం అమ్మ తమను వెన్నంటే ఉన్నదనీ, తమ బ్రతుకు బాధ్యత అంతా అమ్మదేననీ, ఏ సమస్య వచ్చినా అమ్మే పరిష్కరిస్తుందనీ నమ్మకం కలుగుతుంది. తమ జీవితంలో వచ్చే ఆటుపోట్లు అమ్మ లీలల్లో భాగాలు మాత్రమే అన్న దృఢనిశ్చయం కలుగుతుంది.

తాము పొందిన ఈ అనుభవాన్ని పదిమందికీ పంచాలనిపిస్తుంది. తమ అనుభవం మరెందరో ఆర్తులకు ప్రేరణ అవుతుందని, వారి జీవితాలకు కూడా అమ్మ ప్రేమే వెలుగుదారి అవుతుందని అనిపిస్తుంది. అలా అనిపించిన వేళ, తమకు తెలియకుండానే, వారు తమ అనుభవాలను ఆవిష్కరించడం ప్రారంభిస్తారు. అలా అనుభవమే అక్షరమై అవతరించిన రచన ఈ "క్షణక్షణం అనుక్షణం". మాన్య సోదరులు శ్రీ ఎ.యస్.చక్రవర్తిగారి గుండెగుడిలో వెలుగులు నింపిన అమ్మ ప్రతివ్యాసంలోనూ ప్రత్యక్షమవుతుంది.

షిర్డీలో సాయిబాబా పాదాలమీద వాలిపోతే ఆ పాదం మృదువుగా సోకి, అమ్మపాదాన్ని తాకిన స్పర్శానుభవం. విశాఖ వస్తానని చేతిలో చేయివేసి 'ప్రామిస్'

చేసిన అమ్మ జయపూర్ నుంచి పాలరాతి విగ్రహమై తరలి వచ్చినప్పుడు కలిగిన ఆనందపారవశ్యం, మొండివ్యాధులు అమ్మ అనుగ్రహవీక్షణంతో ఉపశమించిన సందర్భాలలో కలిగిన ఆశ్చర్యంతో కూడిన సంతృప్తి, విగ్రహంలో నుండి అమ్మ దివ్యమైన "ఓంకార"నాదం వినిపించిన వేళ కలిగిన అలౌకికానుభూతి,

బొంబాయి ప్రయాణంలో అర్ధరాత్రి వేళ పిల్లవాడి రూపంలో ఇంటివరకు అమ్మే తోడుగా వచ్చినప్పుడు ఒరిస్సా అమ్మాయి పొందిన దివ్యానుభూతి, షిర్డీనుంచి, పుట్టపర్తినుంచి ప్రసాదాలు అమ్మ పంపిస్తే వచ్చాయని గుర్తించి శ్రీ చక్రవర్తి దంపతులు పొందిన అంతులేని ఆనందం, తాను నిర్వహించబోయే లయ కార్యక్రమాన్ని ముందుగానే సూచించిన 'తిరోధానకరి' అమ్మగా ప్రత్యక్షమైన వేళ కలిగిన అలౌకిక విస్మయం,

దేవీపురం పూజలోని శ్రీచక్రం అమ్మ మందిరంలో కొలువుతీరిన వేళ పొందిన ఆనందాశ్చర్యాలు- ఒకటేమిటి? కోకొల్లలుగా ఈ గ్రంథంలో వెలువడిన అనుభవాలు అన్నీ వెలుగు దివ్వెలే. తమ హృదయంలో అపురూపంగా పదిలపరచుకున్న ఈ అనుభవాలను మనకు పంచి పెట్టిన చక్రవర్తి గారికి మనం ఋణపడి ఉంటాం.

ఆ ఋణం కొంతైనా తీరాలంటే, ఈ గ్రంథాన్ని శ్రద్ధగా అధ్యయనం చేయాలి. ప్రతి అనుభవం వెనుక దాగి ఉన్న అమ్మ అభయ హస్తాన్నీ, రచయిత గుండెలో గూడుకట్టుకున్న అచంచలభక్తినీ, అడుగడుగునా లీలగా గోచరించే అమ్మ 'పాదముద్ర'లనూ తప్పక దర్శించాలి. అలాంటి దివ్యదర్శనం మనకు ప్రసాదించడానికి అనువుగా ఈ రచన సరళ సుందరంగా సాగింది. శైలి సహజ సుందరంగా జాలువారింది. చక్రవర్తిగారు మన ఎదురుగా కూర్చొని, చెబుతున్నట్లే అనిపిస్తుంది. ఏ వ్యాసం తీసినా, చదవడం ప్రారంభిస్తే, మధ్యలో ఆపటం మన తరం కాదు.

ఈ వ్యాససంపుటి శ్రీ చక్రవర్తిగారి సమర్చనం. ముక్తాయింపుగా శ్రీమతి కుసుమాచక్రవర్తిగారు సంతరించిన అందమైన కవితల సంపుటి - ఆ అర్చన చివర్లో అమ్మకు అక్కయ్య ఇచ్చే కర్పూర నీరాజనం. తమ హృదయమందిరంలో కొలువైన అమ్మ శ్రీచరణాల మ్రోల చెరోవైపునా నిలబడి ఈ దంపతులు చేసుకున్న అక్షర సుమార్చన ఈ రచన.

అభీష్ట వరదాయిని అయిన అమ్మ అండగాఉండగా వీరికి లోటేముంది? వీరిపై అమ్మఅనుగ్రహం అపారంగా వర్షించాలని అమ్మను ప్రార్థిస్తున్నాను, మరిన్ని మంచి రచనలు వీరి నుండి వెలువడాలనే స్వార్థంతో....

❖❖❖

అంతా అమ్మ అనుగ్రహ వీక్షణమే

పురుషోత్తమపుత్రభార్గవ
శ్రీ పి.యస్.ఆర్.ఆంజనేయప్రసాద్,
విశ్వజనని సంపాదకులు, శ్రీనాథపీఠ సంచాలకులు



శ్రీ చక్రంలో వర్తించేది జగదీశ్వరి అమ్మ. ఈయన, ఈ అయ్యగారు నేనూ శ్రీచక్ర వర్తినే అంటున్నాడు. ఆలోచించాను. నిజమే. అమ్మే అన్నది కదా ! నన్ను విడిచి ఎవరూ లేరని. అమ్మ ఆ చక్రంలో ఉంటే మనం మాత్రం బయట ఎక్కడ ఉంటాం ? అసలు లోపల బయట అనీ రెండు ఉంటే కదా! మరి మనమంతా చక్రవర్తులం కాలేదే ! అని మీరడగవచ్చు. మనం మాత్రం ఎందుకు కాకూడదు? కాకపోతే ఆయన గుర్తించాడు. "క్షణక్షణం" ఆ గుర్తింపులోనే ఉన్నాడు. అది అమ్మ ఆ బిడ్డకిచ్చిన అనుగ్రహ వీక్షణం.

విశాఖపట్టణంలో కేశవశర్మగారు తయారు చేసిన బ్రిగేడియర్స్‌లో (సేనాపతులు) శ్రీ చక్రవర్తిగారు కూడా ఒకరు. ఒకనాడు కారుషెడ్డులో కాపురం చేయించిన అమ్మ యీనాడు కార్లల్లో త్రిప్పుతున్నది. ఒకనాడు వాళ్ళ దగ్గర, వాళ్ళ దగ్గర బ్రతుకు తెరువుకోసం ఊడిగం చేసిన ఆయన, యీనాడు ఎందరి బ్రతుకులలోనో దీపాలు వెలిగిస్తున్నాడు. అనారోగ్యంతో నిరాశతో, నిస్పృహతో కునారిల్లిపోయిన ఆయన యీనాడు చేయి దిరిగిన వైద్యుడై ఎందరికో ఆరోగ్యాన్ని, ఆనందాన్ని ప్రసాదిస్తున్నాడు. మొదట్లో అమ్మ మీద ప్రత్యేకించి ఏ రకంగానూ భక్తి, విశ్వాసమూ లేని ఆయన తర్వాత తర్వాత తన గుండె గుడిలో కట్టిన ఆలయంతో పాటు, విశాఖనగర నడిబొడ్డులో నాలుగు రోడ్ల కూడలివద్ద తను తరించటానికే కాదు నలుగురూ తరించటానికి, అమ్మకు భక్తి అనే సిమెంటుతో ఇటుకలనే విశ్వాసంతో ఒక ఆలయాన్ని నిర్మించాడు. అమ్మ విశాఖ వస్తానని ప్రామిస్ చేసింది. నిలబెట్టుకొన్నది. దానికి ఎన్ని తార్కాణాలో. ఈ గ్రంథమంతా అవే. ఇదంతా అమ్మ చూపించిన వెలుగే నంటాడు. ఇదంతా అమ్మచూపించిన

కాలానుభూతుల స్రవంతిలో వెల్లువెత్తిన జ్ఞాపకాల అలలే యీ "క్షణక్షణం అనుక్షణం" అనే గ్రంథంలో నింపాడు.

ఇక ఈ గ్రంథంలోకి వెళ్ళితే యీ చక్రవర్తి చేత శ్రీ చక్రసంచారిణి, సృష్టిస్థితిలయకారిణి అయిన అమ్మ చిత్ర విచిత్రాలు చేయించింది. చచ్చిపోయిన పిచ్చుకకు ప్రాణాలు పోయించింది. కాన్సర్ వచ్చిందనుకున్న ఆయనకు ప్రాణాలు పోసింది. అక్షరాలు సరిగా పలకలేని ఆయన చేత లక్ష నామార్చనలు, లలితా సహస్రనామ మండలదీక్షలు చేయించింది. అప్పులలో మునిగిపోయిన ఆయన కష్టాలకు మార్గోపాయాలు చూపి ఒడ్డున పడేసిన అమ్మ వాత్సల్య లహరి చూస్తుంటే కొన్ని సన్నివేశాలలో హృదయం ద్రవించింది. అసంకల్పితంగా కళ్ళ వెంట నీళ్ళు తిరిగాయి. ఇది చాలు సజీవమైనరచన అనటానికి తార్కాణం.

అమ్మ అలిగిన క్షణాలు చూశాడు. అమ్మ విగ్రహంలోనుండి వెలువడే ఓంకారాలు రుచి చూశాడు. అమ్మ ప్రసాదించిన శ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి ఆశీస్సులు పొందాడు. ఆవేదనే ఆరాధనగా అంతా అమ్మే చూచుకుంటుందనే విశ్వాసంతో ఒక సంయమన జీవిగా మనగల్గుతున్నాడు. హైమవతీ మహాదేవి మంత్రం, అమ్మమంత్రం తాను చేస్తూ అందరికీ అందిస్తున్నాడు. పతిదేవునితో పునరాగమనం చేసిన అమ్మ నాన్నలను ఆహ్వానించి ఆలయ ప్రవేశం చేయించి అలంకరించి ఆరాధించుకుంటున్నాడు. అమ్మ రక్షణలో తరిస్తున్నాడు.

నేను పి.యస్.ఆర్.గారి అభిమానిని (ఫాన్ని) అని బహిరంగంగానే చెపుతుంటాడు. కాని ఈ గ్రంథం చూచి నేనే ఆయన అభిమానినౌతానేమో! మా కుర్తాళస్వామితో చెపుతుంటాను. 'స్వామీ ! నేను మీకు ఫాన్ను, కానీ నాకు కూడా ఫాన్లున్నారండి. చక్రవర్తి లాంటి వాళ్ళు, అని చనువుతో. ఏమైనా చక్రవర్తిగారు జిల్లెళ్ళమూడి శ్రీ విశ్వజననీపరిషత్ మెచ్చుకొనే సోదరులలో ఒకడు. అమ్మ అనుగ్రహామృతాన్ని ఆకంఠం త్రావినవాళ్లలో ప్రముఖుడు.

ఇక "కుసుమపరాగం" లోని కవితా కుసుమాలు దాదాపు అన్నీ అమ్మ పాదాలపై సమర్పింపబడ్డవే - అనురాగమూర్తి అయిన ఆ రసదేవత ఆనందబంధువు, అమృత సింధువు. ఆమమతానురాగాలను, ఆ రూపలావణ్యాన్ని, ఆ వాత్సల్య వీచికలను అక్షరబద్ధం చేయగల శక్తి ఎవరికుంటుంది ? ఆ

మాతృమహోదధిలో ఎవరు ఎంత పాత్ర తీసుకెళ్ళితే అంత పాత్రతో అందుతాయి. ఆ ఆనందనందనవనంలో పెరిగిన పారిజాతాలు, నవమల్లికాలు, అశోకాలు, సౌగంధికాలు ఎన్నో ఎన్నో రాగరంజితాలు, కుసుమపరాగాలు. ఆ అమ్మ ఇచ్చిన అక్షర కుసుమాలను గుదిగుచ్చి, క్షణక్షణం అపరశబరిలా ఆ మాధుర్యాన్నీ అనుభూతులను ఆస్వాదిస్తూ మనకందిస్తున్నది శ్రీమతి కుసుమాచక్రవర్తి - వారి శ్రీవారు శ్రీ చక్రవర్తి. ఈమె ఆయనను ఆవరించిన కుసుమాచక్రవర్తి. ఇద్దరూ మాతృశ్రీ చక్రంలో అద్వైతసిద్ధిని పొందేవారే -

ఒకటో రెండో శ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి స్తుతులు - ఆ స్వామీ వారికి అమ్మ ప్రసాదమే. ఆ స్వామి చిన్నప్పుడే సహస్రాక్షర సుమాలతో, సహస్రశ్లోక కుసుమాలతో అమ్మను అర్చించిన మహనీయులే -

ఏదైనా ఇదంతా అమ్మ అమ్నాయం. హైమజయం - ఆదర్శ దంపతుల అనురాగమయం. ఇక అందుకోండి "క్షణక్షణం - అనుక్షణం" అంతా అమ్మ అనుగ్రహ వీక్షణమే.



విశాఖ అమ్మ ఆలయంలో మూలవిరాట్టు

గ్రంథమంతా అమ్మ చేసిన అద్భుతాలే

శ్రీ నాదెండ్ల లక్ష్మణరావు



"క్షణక్షణం - అనుక్షణం" చక్రవర్తి అన్నయ్యగారి రచనలో సదా అమ్మ దివ్యమహిమాన్వితానుభూతులు దివ్వెలై వెలుగొందుచున్నవి. అనుక్షణం అమ్మ స్మరణే. అన్నింటిలో అమ్మ స్మృతులే. వారు రమణాశ్రమం వెళ్ళినప్పుడు - అమ్మ బాల్యంలో ఎక్కడైతే కూర్చున్నదో అక్కడే 'మాతృభూతేశ్వరాలయం' నిర్మించారని గుర్తుకు వస్తుంది. కన్యాకుమారిలో వేలమంది జనం ఉన్న ఆలయంలో అమ్మవారి దర్శనం హాయిగా జరిగిందట. అచ్చటి అమ్మవారి విగ్రహం చూచి 'ఆ విగ్రహం అచ్చు మన హైమలాగా ఉంటుంది నాన్నా' అన్న అమ్మ మాటలు వారి చెవులలో మారు మ్రోగుతాయి. మరి అక్కడ కూడ అమ్మవారిని హైమగానే దర్శించారు.

అచంచలమైన విశ్వాసం వారిది. జిల్లెళ్ళమూడిలో అంతకు క్రితం ఎన్నిసార్లు తీసినా రాని ఫోటోలు - హైమక్క నామం చేసి మళ్ళీ ఫోటోలు తీస్తారు. అద్భుతం ఈసారి ఫోటోలు బాగా వచ్చినాయి. అమ్మ ఎప్పుడూ వారితోటే ఉంటుందనే దానికి అనేక నిదర్శనాలు అడుగడుగునా వారి రచనలో మనకు దర్శనమిస్తాయి.

1976 సంవత్సరంలో బ్యాంకు ఆఫ్ బరోడాలో పనిచేస్తున్న నాకు గుంటూరు నుండి విశాఖపట్టణం ట్రాన్స్ఫర్ అయింది. ఆ సమయంలో అమ్మ చెప్పారు "విశాఖ పట్టణంలో 'కుసుమ' ఉంది నాన్నా, చూడండి" అని. అప్పటి నుంచీ ఆ దంపతులతో సుపరిచయం, స్నేహం, ఆత్మీయత. అమ్మ కలిపిన బంధం అది. చక్రవర్తి అన్నయ్య గారి పలకరింపు ఒక పులకరింపే. వారి సున్నిత హాస్యం మనసుకు గిలిగింతలు పెడుతుంది. ఆయన రచనా వ్యాసంగం కూడా మన హృదయాలను ప్రేమతో తాకుతుంది.

విశాఖపట్టణంలో వారు నిర్మించిన మందిరంలో అనేక అద్భుతాలు జరుగుతున్నవని తెలుపుతారు. అమ్మ అనుగ్రహం, ప్రేమ ఏమని వర్ణించగలమని అంటారు. మందిరంలో అమ్మ ప్రేమను వారు పంచటమే కాదు వారు

అనారోగ్యముతో ఉన్నవారికి హోమియో మందులు కూడా పంచి స్వస్థత చేకూరుస్తారు. చూపు తగ్గి, కాలు విరిగి బాధపడుతున్న 'మారుతీబొమ్మ' గారికి మందిరంతో తీసికొన్న మందే పనిచేసేది. మాటలు సరిగా రాని డ్రైవరు కుమార్తెకు వీరిచ్చిన మందులతో మాటలు వస్తే, హైమ నామం చేసుకున్న అమ్మాయి ఎమ్.యస్.సి. పాసయి సాఫ్టువేరు కంపెనీలో జాబుచేస్తోందిట. 'గిటారు' క్లాసులు చెప్పుకుంటూ అమ్మ మందిరంలో ఎనలేని సేవలు చేస్తుంటాడు రాజేష్.

శ్రీచక్రవర్తి భార్యాభర్తలది ఒకే జన్మ నక్షత్ర మట. జాతకరీత్యా కష్టసుఖాలు ఒకేసారి వస్తవట. అయితేనేం కరుణామయి అమ్మ వారి వెంట జంట ఉండి కాపాడుతున్న సన్నివేశాలు - నిదర్శనాలు అనేకం వారి వ్యాసాల్లో కాంతులు వెదజల్లుతుంటాయి.

కుసుమక్కయ్య వచనరచనలే కాక, ఛచనకవితలు కూడా వ్రాస్తున్నందుకు సంతోషంగా ఉన్నది.

పరమపావని, ప్రేమైకమూర్తి శ్రీమాత అనసూయాదేవి అనుక్షణం మనలను చేయి పట్టుకొని నడిపిస్తోంది. మనమంతా ఎంతో అదృష్టవంతులము. వారు అందిస్తున్న దివ్యానుభూతులు సుగంధభరిత దివ్యకుసుమాలు, విశ్వజననికి పూజా పుష్పాలు. అక్షరసత్యాలు. మాతృచరణపంకజ సేవానురక్తులకు మందార మకరందాలు.

❖❖❖



మా మాట

శ్రీ అయ్యగారి రామూర్తిపంతులుగారు మా తండ్రిగారు. తల్లి శ్రీమతి రోహిణిదేవిగారు. మాతండ్రిగారు స్కూలు టీచర్‌గా వుంటూ "ఆంధ్రా సైంటిఫిక్ కంపెనీని మచిలీపట్నంలో ప్రారంభించి అత్యున్నతస్థాయికి చేరుకున్నారు. భారతదేశంలోనే మొట్టమొదటి సైంటిఫిక్ కంపెనీని ప్రారంభించిన మహానుభావులు. తరువాత నేషనల్ కెమికల్స్, గ్లాస్‌ఫ్యాక్టరీ దానికి అనుబంధంగా స్థాపించారు. 50 సం॥లు రాకుండానే హఠాత్తుగా కాలం చేసారు.

డాక్టర్ ఎ.యన్.రావుగారు మా తండ్రిగారి సోదరులలో ఒకరు. మా నాన్నగారు రాముడు, ఈయన లక్ష్మణస్వామి. మా బాబాయిగారికి "A.N.Rao & Co" అని పెద్ద మందులషాపు ఉండేది. వారు E.D.Co అని ఒక మందుల ఫ్యాక్టరీని కూడా ప్రారంభించారు. మేము ముగ్గురు సోదరులం. మా అన్నగారు శ్రీ రాధాకృష్ణగారు "ఓరియంటల్ ఇన్సూరెన్సులో మన రాష్ట్రంలో అత్యున్నత స్థాయిలో రిటైరయ్యారు. మా తమ్ముడు ప్రొఫెసర్ ప్రసన్నకుమార్. ఆంధ్రా యూనివర్శిటీలో పొలిటికల్ సైన్సెస్‌లో ప్రొఫెసర్‌గా చేసి ఆంధ్రా యూనివర్శిటీలో రెక్టారుగా పదవీ విరమణ చేసాడు. మంచివక్త. దేశ విదేశాలలో మంచిపేరు గడించాడు. క్రికెట్, టెన్నీస్ కామెంట్రీలలో పేరు సంపాదించాడు. రామభక్తుడు.

మా బాబాయిగారి పిల్లల్లో మంచిఖ్యాతి గడించినవాడు డాక్టర్ అశ్వనీకుమార్. డాక్టర్‌గా అనేక బిరుదులను సంపాదించాడు. జీవితం అంతా ప్రజాసేవకి అంకితం చేసిన అసలు సిసలైన డాక్టరు. ఆయన సత్యసాయిభక్తుడు. ప్రతి నెల సేవకు పుట్టపర్తి వెళ్తుంటారు.

ఆ రోజుల్లో మాది ఉమ్మడి కుటుంబం. చాలా హాయిగా అందరం కలిసే వుండేవాళ్ళం. నాకు క్రికెట్ అంటే పిచ్చి. ఎక్కువ సమయం గ్రౌండ్‌లోనే గడిపేవాడిని. బి.యస్.సి అయిన తరువాత ఢిల్లీలో వున్న మా మేనమామ గారు శ్రీ కుందూరి ఈశ్వరదత్తుగారి దగ్గరకు వెళ్ళాను. మా మేనమామగారు హిందుస్థాన్ టైమ్స్‌లో ఛీఫ్ ఎడిటర్‌గా వుండేవారు. 1955 సంవత్సరం అతి కష్టం మీద కాబినెట్ సెక్రటేరియట్‌లో నాకు చిన్న ఉద్యోగం దొరికింది.

భారతదేశంలోని పాత్రికేయులలో, రచయితలలో మా మేనమామ శ్రీ కుందూరి ఈశ్వరదత్తుగారు అగ్రశ్రేణిలో ఒకరు. ఢిల్లీలో వున్న ఆంధ్రామంత్రులు, సుప్రీంకోర్టు జడ్జీలు, ఆంధ్రా నుంచీ వచ్చే పెద్దలతో ఆయన ఇల్లు నిత్యం కళకళలాడేది. ఆయన భార్య కుందూరి అనసూయమ్మగారు. అన్నపూర్ణే దిగివచ్చిందని ప్రశంసించేవారు. అలా ఇంట్లో, ఆఫీసులో కాలం గడిచిపోయేది.

ఒకసారి ఢిల్లీలో ఒక ఎస్ట్రాలజర్‌ను కలిశాను. ఎప్పటికైనా రూ. 1000/- సంపాదిస్తానా అని అడిగాను. 1970 సంవత్సరం తరువాత నీ జీవితంలో ఒక స్త్రీ ప్రవేశంతో నీ జీవితమే మారిపోతుందని చెప్పాడు. నాకు దాని అర్థమేమిటో బోధపడలేదు. 1955 నుంచి 1960 వరకూ ఢిల్లీలో వున్నాను.

1960 లో వివాహం కావటం, ఢిల్లీ నుంచి తిరిగి బందరు వచ్చాను. మా బాబాయిగారి మందుల షాపులో ఉన్నాను. మళ్ళీ సరిగా 5 సంవత్సరాల అనంతరం విశాఖపట్టణం వచ్చి డాబా గార్డెన్సులో మందులషాపు పెట్టాను. 5 సంవత్సరాల అద్భుతంగా నడచింది. 1970 సంవత్సరంలో ఏలినాటి శని ప్రారంభం. నాది నా భార్యది ఒకే నక్షత్రం. మా అమ్మ రోహిణీదేవి గారిది, మా షాపులో పనిచేసే అతనిది అందరిది ఒకటే రాశి. దాని ప్రభావంతో అనేక బాధలు, ఊహించలేని పరిణామాలు. షాపు అప్పుల పాలైంది. ఆ టెన్షన్‌లో ఏకా అంజన్‌కుమార్ ఆత్రేయ పెళ్ళికి జిల్లెళ్ళమూడి వెళ్ళటం జరిగింది.

అమ్మ చూపుల శక్తి నన్ను వివశుణ్ణి చేసింది. అమ్మ చెప్పనే చెప్పింది కదా! "మీరంతా నా అవయవాలేనని'. నేను కూడా అమ్మ అవయవాలలో ఒకడినైపోయాను. అప్పటి నుంచీ నా జీవితాన్ని క్షణక్షణం అనుక్షణం అమ్మే నడిపిస్తోంది. నా జీవితంలో జరుగుతున్న మార్పుల కథనమే ఈ గ్రంథం.

అమ్మ మందిరంలో కూర్చొని పారాయణ చేసుకుంటుంటే జరగబోయేవి ఎన్నెన్నో చూపించేది. అలాగే ఒకరోజు పారాయణ చేస్తుంటే శ్రీ ప్రసాదరాయ కులపతిగారు కాషాయ వస్త్రాలు ధరించి అమ్మకు హారతిస్తున్నట్లు కనిపించింది. అలా ఒక మారు కాదు, రెండు మార్లు కనిపించింది.

పి.యస్.ఆర్. అన్నయ్యకు ఫోను చేసి కులపతిగారు కాషాయ వస్త్రాలు ధరించి అమ్మకు హారతి ఇస్తున్నట్లు 2 సార్లు దర్శనం ఇచ్చారు. నాకేమీ బోధపడక నిన్ను అడుగుతున్నాను అన్నాను. దానికి పి.యస్.ఆర్. అన్నయ్య 'మా అన్నగారు సన్యసించారు ఇప్పుడు ఆయన నామధేయం శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి' అని చెప్పారు.

విశాఖపీఠంకు వచ్చినప్పుడు స్వామివారిని పాదపూజకు ఆహ్వానించాము. ఆయన వస్తూనే అమ్మ మందిరంలో హారతి ఇచ్చారు. ఇదే దృశ్యాన్ని అమ్మ నాకు ముందుగానే సూచించింది. అమ్మ మనకు అండగా వుండటానికి మన సమస్యల పరిష్కారానికి శ్రీస్వామివారిని అమ్మ మనకు ప్రసాదించింది అనిపించింది.

ఇది నామాట

ఇక ఇదిగో ఇది
మా "కుసుమ మాట" వినండి

మాతృశ్రీ అనసూయ మహాదేవి మా జీవితాలలో పడుగుపేకలా అల్లుకు పోయింది. ఏది జరిగినా అమ్మ కరుణే అని మా విశ్వాసము. ఇంతకు ముందు అమ్మ సిరాగా, నేను పైకి కనిపించే కలముగా దివ్యానుభూతులు, మధురస్మృతులు, అనసూయావ్రత కల్పం, అమ్మ సచ్చరిత్ర ప్రథమ, ద్వితీయ, తృతీయ భాగాలను వెలువరించటం జరిగింది.

2004 సంవత్సరంలో నేను ఇథోపియాలో ఉన్న మా చిన్నఅమ్మాయి మాధవి దగ్గరకు వెళ్ళాను. అప్పుడు మా అల్లుడుగారు ఆదిత్య గంజూ "మీ శైలి బాగుంటుంది. ఎప్పుడూ వ్యాసాల రూపంలోనే వ్రాస్తున్నారు. కవితలు వ్రాస్తే బాగుంటుంది కదా" అని సూచించారు. అప్పటికే మన పత్రికలవారు సాహిత్యంలో వచనకవితలకు పెద్దపీట వేస్తున్నారు. సరే ఆయన అన్నారు కదా ! అని ప్రయత్నించాను. దానికి అమ్మ, స్వామివారి ఆశీస్సులు తోడుకాగా దాదాపు 50 కవితలు వ్రాయటం జరిగింది. ఇందులో కొన్ని విశ్వజనని, మౌనప్రభ, మదర్ఆఫ్ ఆల్ సంచికలలో ప్రచురింపబడ్డాయి. చింతా ప్రభాకరరావుగారు నడుపుతున్న విధివిలాసంలో "చల్లనితల్లి జిల్లెళ్ళమూడిఅమ్మ" ప్రచురింపబడినది. లలితాపీఠంలో ఎప్పుడు కవితాగోష్ఠి జరిగినా, మేనేజర్ శ్రీ వాడరేవు సుబ్బారావుగారు ప్రోత్సహిస్తుంటారు. వారందరికీ కృతజ్ఞతలు. మావారు కూడా 2007లో క్షణక్షణం అనుక్షణం వ్రాయటం మొదలైంది. నా గ్రంథాలిన్ని వచ్చాయి. వారి వ్యాసాలు కూడా ఒక గ్రంథంగా వస్తే బాగుంటుందనుకున్నాను.

ఇద్దరి జీవితాలలోనూ క్షణక్షణం అనుక్షణం అమ్మ లీలలే కనుక వారి వ్యాసాలతో నా కవితలు కూడా జతచేశాను.

ఈ రకంగా ఈ గ్రంథం వెలుగుచూడటానికి కార్యభారాన్ని నెత్తిన వేసుకోవటమేకాక గ్రంథసమీక్షములు కూడా చేసిన శ్రీ పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్ అన్నయ్యకు, శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తిగారికి సదా కృతజ్ఞులము.

"ఆశీర్వాదశ్రీముఖము"ను అందించిన శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి" వారికి మనః పూర్వక నమస్సుమాంజలులు. శ్రీ గోపాలన్నయ్య, శ్రీ నాదెండ్ల లక్ష్మణరావు అన్నయ్యలు ఈ గ్రంథాన్ని గూర్చి, మమ్మల్ని గూర్చి నాలుగు మంచి మాటలు పలికారు. వారికి కృతజ్ఞతాభివందనములు. అంతా అమ్మ దయ - హైమ కరుణ.

అమ్మసేవలో

అయ్యగారి శ్రీ చక్రవర్తి

కుసుమాచక్రవర్తి



విశాఖలో అమ్మ ఆలయంలో ఉత్సవ విగ్రహం

విషయసూచిక

అభిప్రాయాలు

క్షణక్షణం అనుక్షణం

1. సృష్టిస్థితి లయకారిణి

నిత్యం అమ్మబిడ్డలందరూ అమ్మ స్మరణ, పూజలతోనే కాలం గడుపుతాము. 'అమ్మ' ఎప్పుడూ మనల్ని అంటిపెట్టుకునే వుంటుందనుకుంటూనే విస్మరిస్తుంటాము. ఏదైనా పని సానుకూలపడితే మన ప్రజ్ఞే అని మురిసిపోతాం. పని జరగకపోతే అమ్మ ఇలా ఎందుకు చేస్తోందో అని బాధపడ్తాం. ప్రతి పనికి, సంఘటనకి తానే ప్రత్యక్ష సాక్షిగా గుర్తు చేస్తుంటుంది అమ్మ.

అవసరమనుకుంటే చేయూతనిస్తుంది. లేకపోతే మొట్టికాయ మొద్తుంది. ఈ మధ్య ఒక విచిత్ర సంఘటన జరిగింది. వైజాగ్ బాటా కంపెనీలో మేనేజర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణచేసిన వి. రామారావుగారు మా ఆప్తమిత్రుడు. వారి స్వస్థలం విజయనగరం. గొప్పగాయకుడు. పి. సుశీలగారితో, ఆంధ్రా యూనివర్శిటీలో మ్యూజిక్ ప్రొఫెసర్ మండపాక శారద (వారి మేనకోడలు)తో కలిసి అనేక కచేరీలు చేశారు.

రామారావుగారిని "అపరఘంటసాల" అని పిలుస్తుంటారు. విశాఖలో ఆయన ప్రార్థన లేకుండా సాధారణంగా ఫంక్షన్ జరగదు. దసరాపండుగల్లో ఆయన కచేరీని శ్రీలలితాపీఠం మేనేజర్ శ్రీవాడరేవు సుబ్బారావుగారు ఏర్పాటు చేసారు.

అమ్మ సినిమాలో ఘంటసాల పాడిన పద్యాలు "కుర్తాళం పీఠాధిపతులు" పూర్వాశ్రమంలో "ప్రసాదరాయకులపతి గారు" వ్రాసినవి వున్నాయి. ఆ పద్యాలు వారి పీఠంలో, వారి సమక్షంలో పాడగలగటం అదృష్టం కదా ! అని వాటిని ఎంచుకున్నారు.

రెండు రోజుల ముందుగా ఆపాటలు వినటానికి మా ఇంటికి వచ్చారు. సి.డి.ఆన్ చేయగానే "ఐంద్రీ మహావిద్య" అన్న పద్యం వచ్చింది. ఉదయం 11.30 ని.లకు కిటికీ లోంచి ఒక పిచ్చుక వచ్చి చెక్కర్లు తిరిగింది. ఫాన్ తిరుగుతోంది. అటూ ఇటూ తిరుగుతున్నప్పుడు ఫాను రెక్కకు తగిలి కిటికీలోంచి మాయమయింది. రెండోసారి పాట మొదలు పెట్టగానే మళ్ళీ వచ్చింది. మళ్ళీ అదే కథ. మూడోసారి పాడుతుంటే సగంలో వచ్చింది. "నడచిరావోయి నిండు

మనస్సుతోడ" అని మైమరచిపాడుతున్నారు. ఆ సమయంలో పిచ్చుక ఫాన్‌కు కొట్టుకొని కిందపడింది. కనుగుడ్డు బయటకు వచ్చింది. రక్తం కారింది. చలనం లేదు. నిర్ఘాంతపోయాను.

రామారావు గారు కళ్ళుమూసుకొని అలా పాడుతూనే వున్నారు. ఆయన్ని డిస్ట్రబ్ చేయకూడదని వూరుకున్నాను. పాట అయిన వెంటనే కళ్ళు తెరచి పిచ్చుకని చూచి విస్తు పోయారు. ఇద్దరం జరిగినదానికి చాలా బాధపడ్డాం. "రెస్క్యూరెమిడీ" అనే ఫ్లవర్ రెమిడీ ద్రవాన్ని పిచ్చుక మీద వొంచాను. మళ్ళీ కొద్దిసేపు ఆగి ఇంకొంచెం పోశాను. అది సంజీవిని లాంటిదే. పిచ్చుకలో చలనం లేదు.

పనిఅమ్మాయిని పిలిచి చేటలోకి ఎత్తి బయటపడేయ మన్నాను. ఆ అమ్మాయి చీపురుతో పైకి ఎత్తింది. పిచ్చుకలో కొంచెం కదలిక వచ్చింది. దాన్ని జాగ్రత్తగా "అమ్మ మందిరం" వెనుక చెట్టు దగ్గర పెట్టి ఒక్క నిమిషం అలా చూస్తూ వుందిట. ఇంతలో దానంతట అదే లేచి ఎగిరిపోయింది. మాయగా వుందని" ఆ అమ్మాయి చెప్పింది. మాకు షాక్,. ఆశ్చర్యం నుంచి తేరుకోవటానికి కొంతసమయం పట్టింది. జరిగిం దానికి అంతమటుకూ ఎంతో బాధపడ్డాంగాని మనశ్శాంతి కలిగింది.

అమ్మ తన పాట ఎందుకు పాడించుకుంది. ఎందుకు ఆ పిచ్చుకకు పునర్జన్మ ప్రసాదించింది. మీతోనే వుంటానని మనకు తెలియచేయటానికో సృష్టికి నేనే ఆధారం అని మనకు తెలియచేయటానికో,

అమ్మ సృష్టి, స్థితి లయకారిణి కదా ! *జనవరి 2007*

2. మునగండిరా! ఒడ్డున పడేస్తాను

శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీమహాస్వామి వారు ప్రస్తుత కుర్తాళపీఠాధిపతి. వారు పూర్వాశ్రమంలో డాక్టర్ ప్రసాదరాయకులపతిగా అమ్మబిడ్డలందరికీ పరిచయమే. వైజాగ్ లలితపీఠం కూడా వారి ఆధిపత్యంలోనే వుంది. స్వామివారు తరుచూ ఈ పీఠానికి వస్తుంటారు. ఈ పీఠం ఎల్లప్పుడూ భక్తులతో రద్దీగా వుంటుంది. స్వామివారికి శిష్యులు కూడా చాలా ఎక్కువ.

ఇది శ్రీస్వామి వారు పీఠాధిపతులయిన సంవత్సరం నాటి సంఘటన. స్వామి వారు వాడరేవు సుబ్బారావుగారిని మేనేజరుగా నియమించారు. వారు

గుంటూరు వాస్తవ్యులు. అమ్మ దగ్గరకు తరచూ వస్తూ వుండేవారు. అమ్మ పూజను లలితాపీఠంలో ప్రతివారం ఏర్పాటు చేశారు.

ఒకరోజు సుబ్బారావు గారు నన్ను పిలిచి ఆ పీఠంలో స్వామివారి పెద్ద ఫోటో ఒకటి ఏర్పాటు చేయమని ఆ భారం నా మీద వేశారు. స్వామివారిని అతి కష్టంమీద ఒప్పించటం జరిగింది. ఒక రోజు సాయంత్రం 5 గంటలకు పదినిమిషాలు కేటాయించారు. అవి పండుగరోజులు. విపరీతమైన జనం. మంచి ఫోటోగ్రాఫర్‌ను ఏర్పాటు చేశాం. ఆయన దొరకటమే కష్టం. సంగతి చెప్పి సాయంత్రం నాలుగుగంటలకు మా ఆఫీసుకు రమ్మన్నాను.

ఆ రోజు 4.30 అయినా ఆయన రాలేదు. ఫోను చేశాను. దారిలో వున్నానన్నాడు. ఈ లోగా సుబ్బారావుగారు ఫోటో గ్రాఫర్‌కు ఫోను చేస్తే స్కూటర్ టైర్ పంచరైనందున తాను రాలేకపోతున్నానని జవాబిచ్చాడు. నాకు టెన్షన్ పెరిగిపోయింది. నా స్నేహితుణ్ణి తీసుకుని వేరే ఫోటోగ్రాఫర్ వేటలో పడ్డాను. పండుగ రోజులు కాబట్టి ఎవ్వరూ దొరకలేదు. అమ్మను ప్రార్థిస్తూనే వున్నాను. అందరూ ఖాళీలేదన్న సమాధానమే. నిస్సహాయత, నీరసం వచ్చింది. చివరిగా స్వామివారిని క్షమాపణ చెప్పుకుందామని మా స్నేహితుని స్కూటర్ మీద బయలుదేరాము.ఆ టెన్షన్‌కి కారు కాని, స్కూటర్ కానీ డ్రైవ్ చేయలేని పరిస్థితి.

దారిలో ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయాము. ఆర్.టి.సి. కాంప్లెక్సు దగ్గర జంక్షన్. స్కూటర్ దిగి ఏమిటమ్మా ఇలా చేశావని బాధపడ్తున్నాను. ఈ లోపల ఏమండీ గురువుగారు బాగున్నారా అన్న పలకరింపుకు పక్కన చూచాను. మా పాత పరిచయస్తుడు. బాగున్నాను మీరేం చేస్తున్నారు ? అని అడిగానూ ఆ జంక్షన్‌లో వున్న ఫోటోస్టూడియో చూపించి అది నాదే నన్నాడు. నాకు పెద్ద షాకు. దేవుడిలా కనిపించాడని నాగోడు వినిపించాను.

వెంటనే స్కూటర్ తీసుకొని కెమేరా భుజాన వేసుకొని బయలుదేరాడు. అమ్మా ! అని నిట్టూర్పు. సంతోషం. అమ్మకు కోటి ప్రణామాలర్పించి గుడికి చేరాం. సమయం 5.15 ని.లు. స్వామివారు ఏమంటారో నని భయం మమ్మల్ని వారు నవ్వుతూ ఆహ్వానించారు. సంతోషం పట్టలేకపోయాను. కళ్ళవెంట జలజలా ఆనంద బాష్పాలు. అమ్మ ఎంత దయామయి. "మునగండిరా, మునిగాక తీసి

ఒడ్డున పడేస్తానని" చెప్పిందిగా మరి. ఫోటోల కార్యక్రమం సవ్యంగా అయిపోయింది. అందరూ చాలా సంతోషించాము.

ఆ పీఠానికి వెళ్ళినప్పుడల్లా స్వామి వారి ఫోటో చూడగానే ఆనాటి సంఘటన గుర్తుకు వస్తూనే వుంటుంది. ప్రతిక్షణం - అనుక్షణం మావెంటే వున్నానని అమ్మ గుర్తుచేస్తూనే వుంటుంది. ఎంతప్రేమా, ఎంత దయా... మార్చి-*2007*

3. కాళీదేవి

1972 సంవత్సరము ఆగష్టులో ఏకా అంజన్ పెళ్ళికి జిల్లెళ్ళమూడికి వెళ్ళటం జరిగింది. మొదటిసారి అమ్మ దర్శనం అయింది. నెమ్మదిగా అమ్మకు దగ్గర కావటం మొదలయింది. మొదటి దర్శనంలోనే అమ్మ ఒక మహాశక్తిగా, కాళికాదేవిలా అనుభూతి కలిగింది. నా భార్య కుసుమ, మిగతా మిత్రులు అమ్మతో సరదాగా జోక్సువేస్తూ మాట్లాడేవారు. నేను మాత్రం దూరంగానే వుంటూ ఆ కాళికాదేవి సన్నిధిలో వున్నట్లే ఎప్పుడూ మెలుగుతుండేవాడిని. అమ్మ మాత్రం అందరినీ పలకరించినట్లే నన్ను కూడా చాలా ప్రేమగా దగ్గరకు తీసింది.

ఆ రోజుల్లో వ్యాపార నిమిత్తం రాత్రింబవళ్ళు ప్రయాణం చేస్తుండేవాడిని. ఆరోగ్యం దెబ్బతిన్నది. జీర్ణశక్తినశించిపోయింది. దుర్భరస్థితి. రోజూ మందులు మ్రింగుతూ బ్రతికే వాడిని. చూపు మందగించింది. చిక్కిపోయాను. శరీరం నల్లబడి పోయింది. మాతండ్రిగారు, మా మేనమామగారు కూడా కాన్సర్‌తో పోయారు. నాక్కూడా కాన్సర్ వచ్చిందని నిర్ధారణ చేసుకున్నాను. చావుకి సిద్ధపడ్డాను. నిస్పృహ, విరక్తి. అలాగే మనసురాయి చేసుకొని తిరుగుతుండేవాడిని.

నా భార్య మాత్రం డాక్టరు గారికి చూపించుకోమని పోరు పెట్టేది. ఈ జబ్బుకి చికిత్సలేదు. ఎందుకు నలుగురికీ చెప్పుకోవటమని మొండికేశాను. చివరికి నా భార్య మనశ్శాంతికి ఒప్పుకోక తప్పలేదు. బందరులో మా తమ్ముడు డాక్టర్ అశ్వనీ కుమార్ ఎమ్.డి.; అతను వైద్యవృత్తికే ఆణిముత్యం. వైద్యానికి అంకితమయిన వ్యక్తి. ఎంతమంది ప్రాణాలనో కాపాడిన వ్యక్తి. వైద్యపరీక్ష అయింది. ఏవిషయమూ తేల్చలేదు. పదిరోజులకు మందులు తెప్పించి ఇచ్చాడు. కానీ నమ్మకం కుదరలేదు. తమ్ముడు మందులిచ్చాడు కదా ! అని తీసుకున్నాను.

బందరు నుండి జిల్లెళ్ళమూడికి చేరాము సాయంత్రంవేళ. బోలెడు జనం. అమ్మ మేడమీద తన గది ముందు కూర్చుని దర్శనం ఇస్తోంది. అందర్నీ తప్పించుకొని ఎన్నడూ లేని విధంగా, ధైర్యంగా అమ్మ ప్రక్కనే నేలమీద కూర్చున్నాను. అటు రామకృష్ణఅన్నయ్య, ఇటు నేను, అమ్మ నా వంక చూడలేదు జనాన్ని చూస్తూ అలా వున్నావేమిటి ? అని అడిగింది. వొంట్లో బాగాలేదు. ఏమి వేసుకోమంటావని అడిగాను. నాకు హోమియోపతి నమ్మకం నాన్నా! అన్నది. నా జబ్బు తెలుసుకోకుండా హోమియోపతి వేసుకోమంటే నాకు అర్థం కాలేదు. నమ్మకం లేదు. నేను ఆలోచనలో పడ్డాను. ఒక్క నిమిషం ఆగి "పదిరోజులు ఇంగ్లీషు మందులు వాడమని" అమ్మ చెప్పింది.

నా జేబులో 10 రోజులకు వాడాల్సిన ఇంగ్లీషు మందులున్నాయని అమ్మకు ఎలా తెలుసు. నన్ను ఓదార్చటానికి అన్నదా ? అర్థం కాలేదు. వెనక్కి వెళ్ళి కూర్చున్నాను. రాత్రి పొద్దు పోయింది. మళ్ళీ పొద్దున్నేగది ముందు తయారు. పాపం రామకృష్ణ అన్నయ్య ఎంతమంది వున్నా నేను ఎప్పుడూ బాధపడకుండా అమ్మతో మాట్లాడు కోవటానికి ఏర్పాటు చేసేవాడు. గదిలో అమ్మ ముందు నేను, నా భార్య. అలవాటు ప్రకారం అమ్మ పాదం పట్టుకున్నాను. నా చేయి తీసి అమ్మ ముద్దు పెట్టుకోవటం జరిగింది. నా ఒళ్ళు నాకు తెలియదు. ఈ లోకంలో లేను. నా పరిస్థితి మీరు ఊహించగలరు. సాక్షాత్తు లలితాపరమేశ్వరి నా చెయ్యి ముద్దుపెట్టుకోవటం. నెమ్మదిగా అమ్మ మాటలు వినిపించాయి. "కాన్సర్ వచ్చిందని భయపడ్డావుగా నాన్నా! ఈ ముసలితాత ఒంటి మీద వుండగా నీకు కాన్సర్ రానిస్తాడా ? "నాకు అర్థం కాలేదు? అన్నది. అమ్మ నా వేలికి వున్న షిర్డీబాబా వున్న ఉంగరాన్ని చూపించింది. 'అమ్మాయి, నువ్వు షిర్డీ వెళ్ళండ'ని ఆదేశం. నాకు అయోమయం. నేను అమ్మ దగ్గరకు వస్తే షిర్డీ వెళ్ళమన్న సూచన ఏమిటి? ఏమీ భయం లేదని ఓదార్చింది. షిర్డీ వెళ్ళటానికి దారి తెలియదు. డబ్బు లేదు. ఉత్సాహం లేదు. విశాఖపట్నం తిరిగి వచ్చాము.

వారం గడిచిపోయింది. ఒక రోజు మా తమ్ముడు ప్రసన్న కుమార్. మంచి క్రికెట్, టెన్నిసు కామెంటేటర్. ఆంధ్రా యూనివర్శిటీలో ప్రొఫెసర్. ఏషియన్

గేమ్సు వస్తున్నాయి. ప్రతిసారీ మద్రాసుకానీ, హైద్రాబాద్‌గానీ రమ్మంటారు. కానీ ఈ మాటు 'పూనే' రమ్మని దూరదర్శన్ నుంచి పిలుపు వచ్చింది. ఫస్టుక్లాసు ట్రైనుఫెయిర్ ఇస్తారు. అమ్మ షిర్డీ వెళ్ళమందని చెప్పావు కదా! పూనేలోపని అయ్యాక షిర్డీ వెళ్దాం రమ్మని సలహా. 'ఇదీ అమ్మ ప్లాన్' అని మొత్తం నలుగురం బయలుదేరాము.

పూనేలో పనిపూర్తవగానే షిర్డీ చేరాం. టికెట్టు తీసుకొని లైనులో నుంచున్నాం. పైన ఆసనం మీద ఫకీరు, క్రింద వేల మంది వజ్రవైడూర్యాలు వేసుకొని ఆడా మగా అద్భుత దృశ్యం. లైన్‌లో పైకి చేరగానే ముందుకు ఒంగి పాదం పట్టుకునే ప్రయత్నం. జావ్ జావ్ అని పెద్ద కేక. ఉలిక్కిపడ్డాను. పూజారి కోపంగా నిప్పులు కక్కుతున్నాడు. బిక్క చచ్చిపోయిన నా ముఖం చూశాడు. వెనక్కి చూస్తూ రెండు అడుగులు ముందుకు వేశాను. 'ఠైరో' అని మళ్ళీ వినిపించింది. ఆగాను. రమ్మని పూజారి పిలుపు. హిందీలో సంభాషణ. ఏమి కావాలని ప్రశ్న. బాబా పాదం పట్టుకుంటానని చెప్పాను. సరేనన్నాడు. బాబా పాదం మీద వాలిపోయాను. మెత్తగా, మృదువైన అమ్మ పాదం. అంతా మాయగా వుంది. మళ్ళీ కదలమని ఆదేశం. లేచాను. బాబా మెడలోని పూదండని పూజారి నా చేతికిచ్చాడు. 'అమ్మా! ప్రతిచోట ప్రతి క్షణం. అనుక్షణం మా వెంట నువ్వే. ఎంత దయా ! ఎంతకరుణ ప్రాణభిక్ష పెట్టావా! అని ఆనందబాష్పాలు. కొత్తజన్మ.

కొంతకాలం తరువాత జిల్లెళ్ళమూడి వెళ్ళినప్పుడు మళ్ళీ అమ్మ పాదంపట్టుకోవటం. అమ్మ నవ్వులవర్షం కురిపించడం జరిగింది. అమ్మా ! ఎల్లవేళలా మా వెంట వుండి రక్షిస్తున్నావా తల్లీ ! *ఏప్రియల్, 2007*

4. ఒడ్డున పడేసింది

1972 సంవత్సరం నుంచి అమ్మ దగ్గరకు రావటం మొదలైంది. తరచూ వైజాగ్ వాళ్ళందరితో కలసి అమ్మ దగ్గరకు వెళ్ళేవాడిని. దానితో అమ్మకు దగ్గరకావటం జరిగింది. ఆ సమయంలో ఏలిననాటి శనిప్రభావం ఉధృతంగా వుండేది. నాకు, నా భార్యకు మా అమ్మకు మా షాపులో పార్టనర్‌గా వున్న మా దొడ్డమ్మ గారి అబ్బాయికి అందరికీ ఏలిననాటి శనిదశ.

బాధలు సహించటం దుర్భరంగా వుండేది ఇంటా బయట ఒకటే పోరు. ఆరోగ్యరీత్యా, వ్యాపారరీత్యా ఇది అది అనేమిటి ఒకటే కష్టాలు. ఆ సమయంలో అమ్మ ప్రాణభిక్ష పెట్టింది. క్రిందటి సంచికలో రాసుకున్నాను. మరి డబ్బో ? వ్యాపారమో ? అన్నింటికీ అమ్మే ఆధారం. జిల్లెళ్ళమూడికి వెళ్ళటం రెండు రోజులుండటం, అమ్మ దగ్గర ఏడవటం, తిరిగి వెళ్ళటం. షాపు అద్దె బాకీపడ్డాను. 400 రూపాయిలు మాత్రమే. దానికి మా షాపు ఓనరు-ఖాళీ చేయించటానికి కోర్టులో దావావేశారు. మొత్తం ఖర్చులతో సహా 3 వేలు అయింది, కాళ్ళు అరిగేలా అందరి చుట్టూ తిరిగాను. నిష్ప్రయోజనం, కోర్టువారు ఖాళీచేయటానికి నెలరోజులు టైమ్ ఇచ్చారు.

సమయం దగ్గరపడింది. ఏ సహాయం దొరకలేదు. సరిగా ఖాళీ చేయాల్సిన రోజుకు అమ్మ జన్మదిన వేడుక జరుగుతోంది. కోర్టు అమీనా వస్తే సామాను బయటపడేస్తారు. పిల్లలకు ధైర్యంగా వుండమని చెప్పి నేను నా భార్య వైజాగ్ వాళ్ళతో కలసి జిల్లెళ్ళమూడి వచ్చేశాము. అన్నింటికీ సిద్ధమై పోయాము. అమ్మ నా భార్యతో "వాడు జిల్లెళ్ళమూడిలో మెడికల్‌షాపు పెట్టుకుంటాడని" అంటుండేది. ఆ సమయం వచ్చిందని నిర్ణయించుకున్నాను. కానీ వైజాగ్‌లో నా పరువు ప్రతిష్ఠ? కోర్టు అమీనా వచ్చి సామాను బయట పడవేస్తే? మానసిక బాధ తట్టుకోలేని పరిస్థితి. నేను జిల్లెళ్ళమూడిలో వున్నానన్న మాటే కాని నా ఆలోచనలన్నీ వైజాగ్‌లో పరిస్థితి గురించే. ఏ ముఖంతో తిరిగి వెళ్ళాలి.

అమ్మ దగ్గర వేలమంది జనం. అమ్మతో చెప్పుకునే అవకాశం లేదు. ఆ రోజు రాత్రి అమ్మ చేత బొట్టు పెట్టించుకొని చాలా మంది తిరుగుప్రయాణం అవుతున్నారు. నేనూ తిరిగి వచ్చేయాలి. నా భార్య రెండు రోజులు అమ్మ దగ్గర వుండి వస్తానంది. అమ్మ దగ్గరకు వెళ్ళలేకపోయాను. వైజాగ్‌లో పరిస్థితి ఏమిటి? అమ్మకే పరీక్ష పెట్టాలని నిర్ణయించుకున్నాను. అమ్మ దగ్గర ఒకరోజు వుండాలని వుందని నా భార్యను చెప్పమన్నాను. అమ్మ వుండమంటే నా ప్రాబ్లమ్ తీరినట్లు లేదా మునిగిపోయినట్లు.

అమ్మకు తెలియంది ఏముంది ? ఆవిడ శ్రీకృష్ణునిలా మాయావి. "వాడికి వుండాలని ఉంటే వుండమను, అత్యవసర పరిస్థితి అయితే వెళ్ళమని జవాబు. నా

టెన్షన్స్ పెరిగిపోయింది. అమ్మకు పూర్తిగా సరెండర్ అయి, నాకు వుండాలని వుందని మళ్ళీ నా భార్య చేత కబరుపెట్టాను. ఈసారి అమ్మ వుండమని అనుమతి ఇచ్చింది. కొండంత బలం వచ్చింది. మరుసటిరోజు అమ్మతో చెప్పుకునే అవకాశం దొరకలేదు. అమ్మ దగ్గర బొట్టు పెట్టించుకొని తిరుగు ప్రయాణం.

రైలు వైజాగ్ దగ్గరకు వస్తున్న కొద్దీ గుండెల్లో రైళ్ళు మరీ వేగంగా పరుగెత్తటం మొదలెట్టాయి.

విపరీతమైన టెన్షన్‌లో ఇల్లు చేరాను. మా బాబు ఎదురొచ్చాడు. శుభవార్త. నా స్నేహితుడు లాయరు ద్వారా ఆ డబ్బు కట్టించారని ఆ బాధ తప్పిందని చెప్పాడు. నా సంతోషం చెప్పలేను. 'అమ్మే' ఆ రూపంలో వచ్చి నన్ను ఒడ్డున పడేసింది. ఆనందబాష్పాలు. తన బిడ్డలమీద అమ్మకు ఎంత అపారమైన ప్రేమ, వాత్సల్యం, లలిత ఎవరో, రాజరాజేశ్వరి ఎవరో తెలియదు మాకు. అన్నీ అమ్మే. అంతా అమ్మే. అంతటా అమ్మే. **మే -2007**

5. మార్గోపాయం

కోర్టు బాధలనుంచీ విముక్తి అయింది. ఇంతలోనే బ్యాంకు వాళ్లు వెంట పడ్డారు. 25 వేలు అప్పు ఉంది. దానితో బ్యాంకు వత్తిడి ఎక్కువైంది. బ్యాంకు వాళ్ళు డబ్బు కట్టమనటంతో మళ్ళీ ఆందోళన. మూడు నెలలు టైమ్ ఇచ్చారు. కథ మొదలు. ఏమి చేయాలో తెలియక తికమకపడ్డాను. అమ్మ మీదే భారం. జిల్లెళ్ళమూడి వెళ్ళి ఆవరణలో అడుగు పెట్టగానే ఆకునూరి శ్యామ్ ('లలితాంబక్కయ్య తమ్ముడు') ఎదురొచ్చాడు. 'ఏం ? బావా ! షాపు బావుందిట కదా !' అని ప్రశ్న. నాకు మతిపోయింది. ఎగతాళి చేస్తున్నాడా ? అని అనుమానం. అలా అనే మనిషి కాదే! ఆశ్చర్యంతో ఎవరు చెప్పార"ని ప్రశ్నించాను" అమ్మ చెప్పారని సమాధానం. మతి పోయింది అయోమయం.

అకునూరి కుటుంబం గురించి రెండు ముక్కలు చెప్పాలి. వాళ్ళది మావూరే. మచిలీపట్నం. లలితాంబక్కయ్య వాళ్ళ నాన్నగారు దొరల పరిపాలనా కాలంలో ఎస్.పి. ఆఫీసులో సూపరెంటెండ్‌గా పనిచేసేవారు. అందరూ నాయుడుగారని పిలిచేవారు. పోలీసు డిపార్టుమెంట్ అంతా ఆయన చేతిలో వుండేది. బందరులో పేరు పొందిన కుటుంబాలలో వాళ్ళది ఒకటి. లలితాంబక్కయ్య, ఇనజ కుమారి

ఆయన కూతుళ్ళు. చంద్రమౌళిగారు పెద్దకొడుకు సబ్‌జడ్జీగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకొని వైజాగ్‌లోనే రిటైర్ అయ్యారు. కాంతారావు, శ్యామ్ షిప్‌యార్డులో పనిచేసేవారు. మిగిలిన బ్రదర్స్ వేరు వేరు ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కాంతారావు, శ్యామ్‌లతో నాకు స్నేహం ఎక్కువ. బావా ! బావా ! అనుకునేవాళ్ళం. అటువంటి శ్యామ్ నోటి నుంచి వచ్చిందంటే ! నాకు ధైర్యం వచ్చింది.

యధావిధిగా అమ్మ దగ్గర మొరపెట్టుకున్నాను. అమ్మ ఓదార్చింది. వైజాగ్ వచ్చేశాను. షాపులో మందులే లేకపోతే సేల్సు ఏమంటాయి. స్నేహితులు ఎక్కువ. అప్పులు ఎక్కువే. బిక్కు బిక్కుమంటూ కూర్చునేవాణ్ణి. ఒక సాయంత్రం కాంతారావు వచ్చాడు. నా పరిస్థితి వాడికి తెలుసు. ఇలా వచ్చావేమిటని ప్రశ్నించాను. పెద్ద బ్రదర్ చంద్రమౌళి గారు వైజాగ్‌కు సీనియర్ సబ్‌జడ్జీగా వచ్చారని శుభవార్త చెప్పాడు. ఆయన్ని చూడటానికి వెళ్తూ దారిలో పలకరించి వెళ్దామని వచ్చానన్నాడు. కాంతారావు తరచు షాపుకు రావటం పెరిగింది. నా బాధలు చూస్తూ తనూ బాధపడేవాడు.

కాంతారావు వాళ్ళ చుట్టాల దగ్గర నుంచీ పదివేలు సర్దాడు. చంద్రమౌళి గారి చేత బ్యాంక్‌లో మేనేజర్‌కు చెప్పించాడు. బ్యాంకు మేనేజర్ నన్ను పిలిచి 'అంత పెద్దమనిషి హామీ ఇస్తున్నారు కనుక నమ్మకం వచ్చింది. నెమ్మదిగా తీర్చుకోవటానికి టైమ్' ఇచ్చారు. "అమ్మా! నెమ్మదిగా తీర్చుకోవటానికి టైమ్ ఇచ్చారు. అమ్మా ! మళ్ళీ చక్రం తిప్పావా తల్లీ ! నా కోసమే చంద్రమౌళి గారిని వైజాగ్ తీసుకు వచ్చావా ! శ్యామ్ చేత చెప్పించావా ? కాంతారావు చేత డబ్బు సహాయం చేయించావా ! ఎంత దయ తల్లీ ! అనుకున్నాను – ఆకునూరి కుటుంబానికి ఎంతో ఋణపడి వున్నాను. కాంతారావుకి ఆ డబ్బు తిరిగి ఇవ్వలేదు. అతను రిటైర్ అయ్యాక రాజమండ్రీ వెళ్ళిపోయాడు. శ్యామ్ జిల్లెళ్ళమూడిలో, జడ్జిగారు బాపట్లలో స్థిరపడ్డారు.

అమ్మ దయవల్ల కష్టాలు తొలుగుతూ వచ్చాయి. ఈ కలసిరాని వ్యాపారాన్ని ఎలా వదిలించుకోవాలో తెలియలేదు.

ఇలా బాధపడుతూ మద్రాసు కంపెనీకి కమీషన్ మీద పనిచేస్తూ సంపాదన పెంచుకోవటానికి కష్టపడేవాడిని. షాపులో మా కజిన్ పార్టనర్. షాపు ఎలాగైనా అమ్మేయాలని నిర్ణయించుకున్నాము. నేను బయట డాక్టర్సుని కలుస్తూ వుండేవాడిని.

అందరికీ చెప్పాను. షాపు అమ్ముతున్నానని. ఒకరోజు సడన్‌గా మా ఫ్రెండ్ డాక్టరు నందివాడ శ్రీనివాసరావు కె.జి. హెచ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్. బందరు వాస్తవ్యుడు. నాకు కబురు పంపాడు. వెళ్ళాను. ఒక పెద్ద మనిషిని పరిచయం చేశాడు. వారిది గుడివాడ. మా కుటుంబం గురించి బాగా తెలుసు. వాళ్ళ అబ్బాయితో వైజాగ్‌లో మందులషాపు పెట్టించాలని వచ్చాడు. మా షాపు చూశాడు. బేరం కుదిరింది. మర్నాడు కాగితాలు వ్రాసుకొని షాపు అప్ప చెప్పాలి.

నేను జిల్లెళ్ళమూడి అమ్మతో చెప్పి ఫైనల్ మాట ఇస్తానని చెప్పాను. మా స్నేహితుడు చాలా ఫీల్ అయ్యాడు. వచ్చిన ఛాన్సు పోగొట్టుకోవద్దని హెచ్చరించాడు. సమయం సాయంత్రం 7 గంటలకు అరగంట టైమ్ అడిగాను. సరే అన్నారు. తిన్నగా టెలిఫోను ఎక్చేంజ్‌కు వెళ్ళి అమ్మకు కబురు అందజేయాలన్నదే నా ధ్యేయం. ఫోను చేశాను. ఎవరో ఫోను తీసారు. 'వైజాగ్ నుంచీ చక్రవర్తిని ఫోను చేస్తున్నాను. అమ్మకు ఒక కబురు అందచేయాల'ని చెప్పాను. అటు నుంచీ 'అమ్మ మీతో మాట్లాడుతార'ని సమాధానం. అమ్మ ఆ సమయంలో ఫోను దగ్గర వుండటం, మాట్లాడతానంటం ఎంత ఆశ్చర్యం! పెద్ద షాకు తగిలినట్లయింది.

'అమ్మ' "ఏం నాన్నా ! బాగున్నావా ?" అని ప్రశ్న. "అమ్మా ! ఒక శుభవార్త". షాపు అమ్మేస్తున్నానని చెప్పాను. "ఇప్పుడు షాపు అమ్మటం ఎందుకు ? ఇంకో మార్గం లేదా ? షాపు మంచి సెంటర్లో వుంది. మంచి పేరుంది. అంత కొంప మునిగేది ఏముంది ?" అని ఎదురు ప్రశ్న. అమ్మకు నేను షాపు అమ్మటం ఇష్టం లేదని అర్థమైపోయింది. నేను మాత్రం ఎలాగైనా వదిలించుకోవాలని నిశ్చయించు కున్నాను. నాకు వేరే దిక్కులేదమ్మా !" అన్నాను. వెంటనే "దిక్కు లేనివాడికి దేముడే దిక్కు అంటారు" అన్నది. "సరే నీ ఇష్టం" అన్నది అమ్మది సరే మంత్రం కదా !

వెంటనే డాక్టరు ఫ్రెండ్‌కు ఫోను చేశాను. అమ్మ ఒప్పుకున్నదని. ఎనలేని ఆనందం. అంతా చాలా సంతోషంగా కబుర్లు చెప్పుకున్నాం. అప్పులు తీరిపోతాయి. సంపాదన పెంచటానికి కొత్త ప్లాను. కొత్త ఉత్సాహం. మర్నాడు ప్రొద్దునే షాపు తెరిచి ఎకౌంట్సు అన్నీ సెటిల్ చేయటం మొదలు పెట్టాను. అన్ని పేపర్లు రెడీ అయ్యాయి. 10 గంటలయింది. ఎవరూ రాలేదు. 12 అయింది. ఇంతలో మా డాక్టరు ఫ్రెండ్ నుంచీ ఫోను. గుడివాడ నుంచీ వచ్చినవాళ్ళ అత్యవసరమైన

పని వుందని వెళ్ళిపోయారని కబురు. ఒక్కసారి పెద్ద షాకు తగిలి మూర్ఛవచ్చినంత పని అయింది. మళ్ళీ గుర్తుకొచ్చింది. రాత్రి అమ్మతో జరిగిన సంభాషణ. అమ్మ ప్లాను ఏమిటో మనకు తెలియదు. అనుక్షణం వెంట వుండి రక్షిస్తోంది. ఎందుకు ఇలా జరిగిందో తమాయించుకున్నాను.

మళ్ళీ నా పని మామూలే. రెండు రోజులు గడవకుండానే ఇంకో ఆశ్చర్య సంఘటన. మా షాపు దగ్గర డాక్టర్ సదాశివరావుగారి క్లినిక్ వుంది. ఆయన దగ్గరికి సగటున రోజుకి 300 మంది వైద్యానికి వస్తూ వుంటారు. ఆయన వద్దకు వ్యాపారరీత్యా వెళ్ళాను. నేను వచ్చే ముందు ఆయన ఒక్క మాట చెప్పారు. ఆయన క్లినిక్ ఎదురుగా వారి బావగారి మందుల షాపు వుంది. ఆయన రోజుకి 10 వేల రూపాయల వ్యాపారం చేస్తారని. ఆయన పిల్లల వద్దకు అమెరికా వెళ్తున్నారని, నన్ను ఆషాపు తీసుకోమని, శ్రమవుండదని సలహా ఇచ్చారు.

వెంటనే కళ్ళు తిరిగినంత పని అయింది. ఏమిటో ఈ తుఫానులు, తట్టుకోగలనా ? చీకటి మబ్బులు విడిపోయాయి. అక్కడ ఖాళీ చేసి ఇక్కడకు వచ్చాను. వ్యాపారం చక్కగా నడవటం మొదలయింది. మనస్సు తేలికపడింది. సంపాదన పెరుగుతోంది. "అమ్మా ! ఈ సృష్టిలో నిన్ను మించిన శక్తి గాని, కరుణామూర్తి గానీ వుందా ?! తల్లీ. "క్షణక్షణం అనుక్షణం. ప్రతిక్షణం ఎలా కాపాడుతున్నావో" !

జూన్, ***2007***

6. లలితా మండలదీక్ష

అమ్మ దయవల్ల షాపు మార్చాక ధైర్యం వచ్చింది. ఆత్మ విశ్వాసం పెరిగింది. కానీ ఈ బాధల నుండీ బయట పడటానికి సమయం పడుతుంది. అప్పులు లక్షల్లో వున్నా "నీవు తీర్చుకుంటావు నాన్నా !" అని అమ్మ అభయం ఇస్తూనే వుంది. ఎలా? ఎంత సంపాదిస్తే తీర్చుకోగలను ? అంతా అయోమయం. ఒకటే ఆలోచనలు. అమ్మ దగ్గరికి వీలున్నప్పు డల్లా పరిగెత్తి కష్టాలు చెప్పుకోవటం తిరిగి రాగానే ఏదో ఒక వింత జరగటం మామూలు అయిపోయింది. బాధలు పెట్టి దగ్గరకు తీసుకుంది. అమ్మ "బాధల భగవంతుడు" కదా! బాధలు లేకపోతే అమ్మకు అంత దగ్గర అయ్యేవాణ్ణి కాదేమో!

ఎందుకు మనమీద అమ్మకు అంత ప్రేమ - దయ ? బ్యాంకులోనే కాకుండా చిన్న చిన్న అప్పులు చాలావుండేవి. ఒక మార్వాడీ షావుకారు వద్ద 5వేలు అప్పు చేశాను. అదీ ఒక పెద్ద ఆఫీసర్ ఇప్పించారు. ఆ భయంతో ఆ మార్వాడీ కాళ్ళు అరిగేలా తిరిగేవాడే కానీ నన్ను ఏ విధంగా బాధ పెట్టలేదు. వ్రాయించుకున్న ప్రామిసరీ నోటు కాలదోషం పట్టింది. ఒక రోజు సాయంత్రం చాలాబిజీగా వున్న సమయంలో షాపుకు వచ్చి విచారంగా నిల్చున్నాడు. ప్రక్కకు పిలిచి ఏమిటి? అని అడిగాను. ఆయన బాధ చెప్పుకున్నాడు. ఆయన కోటీశ్వరుడు. అందరూ ఆయన చుట్టూ తిరుగుతుంటారు. అలాంటిది ఆయన నా చుట్టూ తిరగటం అందరికీ ఆశ్చర్యం. ఆ నోటు తిరగరాసివ్వటంతో ఆయన ఆశ్చర్య పోయాడు. అంత తేలికగా పని అవుతుందని ఊహించలేదు. నేను ఎగ్గొట్టేస్తానని భయపడ్డాడు. మళ్ళీ కొంత కాలం గడిచింది. ఒక రోజు నేను జిల్లెళ్ళమూడిలో వుండగా షాపుకువచ్చి పెద్ద రభస చేసి వెళ్ళాడుట. రాగానే మా వాళ్ళు చెప్పారు. అమ్మ అభయమిచ్చిందిగా భయమెందుకు ? వెంటనే ఆయన దగ్గరకు వెళ్ళాను. ఆయన ఆఫీసు నిండా జనం. ఆయన పర్సనల్ రూములోకి తీసుకువెళ్ళి కాఫీ ఇచ్చి ఎంతో మర్యాదచేశాడు. భయం లేకుండా చెప్పేశాను. అసలు 5వేలు ఇవ్వగలను. కానీ వడ్డీతో సహా అయితే నావల్ల కాదని చెప్పాను. ఆయన కూడా వెంటనే "నాకు గుండె నొప్పి వచ్చింది ఈ వడ్డీలు లెక్కపెడితే టెన్షన్ పెరిగిపోతుందని" అసలు తీసుకోవటానికి సరేనన్నాడు.

నాకు వ్యాపారంలో కమీషన్ ప్రతినెలా 2వవారంలో వస్తుంది. పోష్టు డేటెడ్ చెక్ ఇస్తానని ఇచ్చాను. ప్రతినెలా రెండవ వారంలో వచ్చేది ఆ నెల 3వవారంలో కాని రాలేదు. బ్యాంక్ చుట్టూ రోజూ తిరిగి మొత్తానికి వసూలు చేసుకున్నాడు. ఈ విధంగా అమ్మ ఈ సమస్యను తీర్చి పరువు కాపాడింది.

ఆ సమయంలో తంగిరాల కేశవశర్మగారితో పరిచయం ఏర్పడింది. 'అమ్మ' ఆయన్ను విశాఖలో 'అమ్మ పీఠం' స్థాపించటానికి పంపించిందని చెప్పటానికి ఏ సందేహం అవసరం లేదు. మొదట గంటి వెంకట్రావుగారింట్లో సమావేశం అయి అమ్మ పూజలు జరిపే వాళ్ళం. కేశవశర్మ గారితో పరిచయం అయ్యాక పూజలు ఎక్కువ అయ్యాయి.

ఆయనకుఅమ్మ ధ్యాస తప్పితే మరొకటి లేదు. మా సభ్యులందరి ఇళ్ళకీ

తిరిగి పీడించి డబ్బు పోగు చేసి అమ్మకు పూజలు జరిపేవాడు. ఆయనతో చాలామంది ఏకీభవించే వాళ్ళం కాదు. కానీ అంతభక్తి అంకితభావం చాలా అరుదు అని చెప్పాలి. చాలాసార్లు మూర్ఖత్వం అనిపించేది, కానీ అంత నిస్వార్థ జీవిని ఊహించలేము. ఇంట్లో నిత్యావసరాలను కూడా పట్టించుకోకుండా అమ్మసేవకి ఖర్చుపెట్టేవాడు. నా దృష్టిలో ఆయన ఒక యోగిపుంగవుడు. విశ్వామిత్రుడి కున్నంత కోపం. అంత మంచితనం.•

1979 లో జిల్లెళ్ళమూడిలో కోటి నామపారాయణ ఉందని మమ్మల్నందర్నీ తీసుకువెళ్ళాడు. చాలామందిమి వెళ్ళాం. ఏర్పాట్లు చాలా అద్భుతంగా చేశారు. శక్తి పూజలంటే సాధారణంగా అందరికీ భయం. మరి అక్కడ జనం వేలమీద వున్నారు. అంతా గందరగోళంగా వుంది. నేను చూసి ఆనందించవచ్చని వెళ్ళాను. మా విశాఖసభ్యుల్లో భిన్నాభి ప్రాయాలు. నేను దూరంగా కూర్చున్నాను. అంతలో అమ్మ స్టేజి మీదకు వచ్చింది. ప్రక్కన శ్రీ లక్ష్మణయతీంద్రుల ప్రసంగం. లలితాసహస్రనామాల గురించి, వాటిలో వున్న శక్తి గురించి వివరించారు. నేను పెద్దగా పట్టించుకోలేదు.

కానీ ప్రసంగం చివర ఆయన పలుకులు "నా శిష్యుల చేత ఈ స్తోత్రం పారాయణ చేయించను, ఎందుకంటే ప్రతినామం ఒక మంత్రం, ప్రతి అక్షరం ఒక బీజాక్షరం. తప్పుచదివితే పరిణామాలు భరించటం కష్టం. కానీ సాక్షాత్తూ రాజరాజేశ్వరి అయిన ఈ అమ్మ మీ తప్పొప్పుల భారం భరించేటప్పుడు భయం లేదు" అని ప్రసంగసారాంశం. నా గుండె ఆగిపోయింది. అసలే బాధల్లో వున్నాను. ఈ కొత్త చిక్కులు నాకెందు కనుకున్నాను. జనాన్ని గ్రూపులుగా విభజించి కూర్చోపెట్టారు.

ఎక్కడనుంచి వచ్చారో గాని శ్రీ పన్నాల రాధాకృష్ణ శర్మగారు, శ్రీ కొమరవోలు గోపాలరావుగారు పారాయణ చేయమన్నారు. నిజంగా నాకు తెలుగు సరిగారాదు. నా నిస్సహాయతను చెప్పాను. ఫర్వాలేదు. ఖడ్గమాల అయినా పారాయణ చేయమని బలవంతంగా మా విశాఖ సోదరుల దగ్గరకు త్రోశారు. నా పక్కన చాగంటి శరభలింగం, రెండవ వ్యక్తి కృష్ణమాచార్యులు గారి శిష్యుడు. అందరూ స్నేహితులే. నోరు మెదపకుండా కూర్చున్నాను. పుస్తకాలు ఇచ్చారు. తెరిచి పారాయణ ప్రారంభించాను. అన్నింటికి సంసిద్ధుడనైనాను. మొదటి నామం శ్రీమాతా చదివాను.

రెండో నామం శ్రీమహారాజ్ఞి. రాణి అని చదువుకున్నాం గాని మహారాజ్ఞి ఏమిటి? మనకెందుకని ఆపేశాను. శరభలింగం గారు మిగతా వాళ్ళు చక్కగా చదువుతున్నారు. ఒక ప్రక్క భయం, మరో ప్రక్క ఆనందం ఈ లోపల ఎవరో వచ్చి "భండసైన్యవధోద్యుక్త" నామం వెనకా ముందూ పడింది దిద్దుకోమని ఆదేశం. శ్రీ లక్ష్మణయతీంద్రులు తప్పు చదివితే కొంప మునుగుతుందని చెప్పారు. మరి ఈ క్రొత్త బాధ ఏమిటి ? నా పని అయిందని నిశ్చయించుకుని, ఏది జరిగితే జరిగిందని అమ్మమీదభారం వేసి మొదలు పెట్టాను. తడుముకుంటూ తిప్పలు పడుతున్నాను.

ఈలోగా బిగ్గరగా "వాసుదేవ, వాసుదేవ, వాసుదేవ" అంటూ యతీంద్రుల వారు ప్రత్యక్షం. ఆయన వెనకే అమ్మ నడుచుకుంటూ వస్తోంది. నా వంక ఒక ఓరచూపు చూచి ఒక చిరునవ్వు నవ్వింది. దానితో ఎక్కడలేని శక్తి, ధైర్యం వచ్చాయి. నిర్భయంగా చదవటం మొదలు పెట్టాను. ఆ రోజంతా ఐదో ఆరో చదివుంటాను. అందరూ 20 సార్లు చదివితే నాకు అదే గగనమయింది.

ఆరోజూ నుంచీ నా జీవితక్రమమే మారింది. అదొక క్రొత్తదశ. కొత్తశక్తి వచ్చింది. విశాఖ తిరిగివచ్చాక సాధన మొదలు పెట్టాను. కానీ ఏమి చేస్తున్నానో, ఎలా చేస్తున్నానో అర్థం కావటం లేదు. వీలున్నప్పుడల్లా పారాయణ. కానీ ఒక ప్రక్క భయం. కష్టాలు మామూలే. పిల్లల చదువులు. వ్యాపారంలో రోజూ ఏదో ప్రాబ్లమ్. ఏలిననాటి శని దశలో ఎన్నో ఇళ్ళు మారాము, నేను దిగాక ఎవరో ఒకరు వచ్చి వాస్తు దోషం అని చెప్పేవారు. ఎలా మారటం. మంచి ఇంటికి వెళ్ళాలంటే అద్దె ఎక్కువ. డబ్బు లేదు. ఆ సమయంలోనే కోటి పారాయణకు వెళ్ళివచ్చాము.

నెల తిరగకుండానే మరో వింత. ఒక రోజు వున్నట్లుండి జిల్లెళ్ళమూడి నుండి రావూరి ప్రసాద్ వచ్చాడు. అమ్మ పాటలు అద్భుతంగా పాడతాడు. జిల్లెళ్ళమూడిలో అతని పాటలేకుండా ఏ వేడుకా జరిగేది కాదు. అమ్మ గురించి మాట్లాడు కుంటున్నాము. ఆ సందర్భంలో అమ్మ "రోజుకు 11 మార్లు 40 రోజులు లలితాసహస్రనామపారాయణ చేస్తే మంచిది" అన్నదని చెప్పారు. జిల్లెళ్ళమూడిలో చాలామంది అలా చేస్తూ అనేక సమస్యలు నివృత్తి చేసుకుంటున్నారని" తెలియ చేశాడు.

నేనుకూడా చేయాలని నిశ్చయించుకున్నాను. ప్రతిరోజూ రెండు పూటలా వీలుచేసికొని రోజుకు 11 సార్లు పూర్తి చేసేవాడిని. సరిగా 39వరోజున మధ్యాహ్నం 4 గంటలకు పారాయణ చేస్తున్నాను. ఎవరో తలుపుతట్టారు. పిల్లలు తలుపు తెరిచారు. మాటలు వినపడుతున్నాయి. ఎవరో స్త్రీ గొంతుక. "నా పేరు లీల. నేను కుసుమగారు కలిసి కుట్టు నేర్చుకున్నాము. ఆమె అద్దెకు ఇల్లు వెతుక్కుంటున్నారని తెలిసింది. పెద్ద ఇల్లు. కొత్తగా కట్టి గృహప్రవేశం అయి మూడురోజులైంది. మా ఇంట్లో వుంటే సంతోషంగా వుంటుంది. వచ్చి ఇల్లు చూసుకోమని" వెళ్ళిపోయారు.

మర్నాడు వెళ్ళి ఇల్లు చూచి వచ్చాం. అద్దె 800. పెద్ద ఇల్లు. అద్భుతంగా వుంది. ఇక్కడ 300 ఇవ్వటమే కష్టంగా వుంది. వెళ్ళాలని వుంది. అమ్మతో ఇంటి గురించి చెప్పు కున్నప్పుడు" ఇప్పటి దాకా అమ్మాయి చూచింది. ఇంక నువ్వు పెద్ద ఇల్లు చూసుకో" అన్నది. "అమ్మా ! నీదే భారం." ఇక ముందు నువ్వే ఇవ్వమని అమ్మ ఆదేశం ఇచ్చింది కదా ! అమ్మకే వదిలేశాం.

ఆ మరుసటిరోజు వున్నట్లుండి అన్నంరాజు రామకృష్ణరావు గారి ఆఖరి తమ్ముడు సీతాపతి ప్రత్యక్ష మయ్యాడు. అతను బొంబాయిలో ట్రాన్స్‌పోర్టు కంపెనీలో పనిచేస్తున్నాడు. అతనికి వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయ్యిందని, అద్దెకింద 600/- కంపెనీ ఇస్తుందని అర్జంటుగా ఇల్లు చూసి పెట్టమని కోరాడు. మేము చూచిన ఇల్లు గురించి చెప్పాం. అతని భార్య మా మరదలు వసంత కూతురు సాయిలక్ష్మి. అతను మాపెదమామ గారి కొడుకు. అద్భుతం మనందరం కలిసి వుండవచ్చు. మళ్ళీ మాకో ఇల్లు, మీకో ఇల్లు ఎందుకు? నాకు కొండంత అండ, ఎంత అదృష్టం! అని పొంగిపోయాడు. మేము మామూలుగా కట్టే 300 మిగిలిన 500 అతను కట్టాడు. పెద్ద ఇంటికి మారాము. జిల్లెళ్ళమూడిలో ఆ మంచంమీద కూర్చుని చక్రం ఎలా త్రిప్పావమ్మా ! ఎక్కడో వున్న పిల్లలందరి బాగోగులు చూస్తున్నావా? అని పరవశించిపోయాము.

అమ్మ నీవు పెద్ద ఇల్లు చూసుకో!" అన్నమాట ఈ రకంగా నెరవేరింది. ప్రతిక్షణం. అనుక్షణం మన వెంట ... జీవితంలో ఇంకో మెట్టుపైకి ఎక్కించింది. మళ్ళీ కొత్తదశ ప్రారంభం. అమ్మా ఎంత కరుణ!

జులై, 2007

7. టూ ఇన్ వన్

అమ్మదయవల్ల పెద్ద ఇంట్లో చేరాము. పెద్దగదులు, హాలు, పెద్దవంటఇంట్లో ఓ మూల ఫోటోలు పెట్టుకొని చక్కగా పూజలు, బయట ఖాళీస్థళంలో పూలమొక్కలు, కూరగాయలు పండించుకునే వాళ్ళం. జిల్లెళ్ళమూడి వెళ్ళినప్పుడు కొమరవోలు గోపాలరావుగారి పెద్దకొడుకు సదాశివను కలవటం జరిగింది. అన్ని భాషలు చక్కగా మాట్లాడటం, మంచివాక్చాతుర్యం కలవాడు. నా వ్యాపారంలో బాగా రాణిస్తాడని తోచింది. వాళ్ళను నెమ్మదిగా ఒప్పించి వైజాగ్ నాతో తీసుకు వచ్చాను.

ఇద్దరం కలిసి పనిచేసేవాళ్ళం. వ్యాపారం బాగా పెరగటం మొదలయింది. ఇద్దరం స్కూటర్ మీద డాక్టర్ల దగ్గరికి మందుల షాపుకి వెళ్ళేవాళ్ళం. అతను స్కూటరు నడుపుతూంటే నేను లలితా సహస్రం నిరంతరం పారాయణ చేస్తుండేవాడిని. హాయిగా కొంతకాలం గడిచింది. ఉన్నట్లుండి సీతాపతికి హైద్రాబాదుకి ట్రాన్స్ఫర్ అయింది. ఇంటికి 200 అద్దె పెంచమన్నారు. నెలకు 1000/- రూ. అదే పెద్దభారం. చిన్న ఇల్లు వెతుక్కోవటం ప్రారంభించాం. 600/- చక్కటి ఇల్లు దొరికింది. భారం అవుతుందేమోనని అధైర్యపడ్డాను. కానీ సదాశివుడు చాలా ప్రోత్సహించాడు. అమ్మ అండవుండగా మనకు భయమెందుకని చక్కటి ధైర్యం ఇచ్చాడు. మళ్ళీ కొత్త ఇల్లు. చిన్న పూజగది కూడా వున్నది. అన్నీ బాగున్నాయి. మరల కొత్త జీవితం. కష్టం పెరిగింది. వ్యాపారం పెరిగింది.

అమ్మ పూజలు పెరిగాయి. ఎక్కువ సమయం పారాయణలతో గడిపేవాడిని. మాకు ఒక పాతస్కూటర్ తప్పించి ఏమీ లేదు. ఎలాగైనా ఆర్థికంగా పెరగాలి. పేరు ప్రఖ్యాతులు సంపాదించాలి. ఆర్థికస్తోమతలేని వారికి ఎవరు సహాయం చేస్తారు ? ఒక్కటే మార్గం. అమ్మ లలితా సహస్రనామం అనే ఆయుధాన్ని ప్రసాదించింది. ఇదే కాకుండా విష్ణు సహస్రనామాలు, రుద్ర పారాయణ మొదలు పెట్టాను. ఏ మంత్రంలో ఏముందో తెలుసుకోవాలి. లలిత, విష్ణు సహస్రనామాలు సంపుటితో ఎక్కువ సాధన దీక్షలు మొదలు పెట్టాను. మండల దీక్ష మా ఇంటి ప్రక్కనే ఆంధ్రా యూనివర్శిటీలో పనిచేసే వెంకటేశ్వరరావు గారు వుండేవారు. ఆయనకీ మాకు పరిచయం పెరిగింది.

ఆయన వద్ద కొత్త బజాజ్ స్కూటర్ వుంది. నాది పాత వెస్పా స్కూటర్.

సరిగా పారాయణ దీక్ష 40 రోజులు పూర్తి అయింది. వెంకటేశ్వరరావు గారు 'ఇంకో కొత్త స్కూటర్ వచ్చింది అది కొనుక్కొంటాను నా స్కూటర్ తీసుకుంటారా?' అని అడిగారు. దాని ఖరీదు 5వేలు. వాయిదాల పద్ధతిలో తీసుకున్నాను. మంత్రాల మీద నమ్మకం పెరిగింది. పారాయణలు, దీక్షలు పెరిగాయి.

ఆ సమయంలో చాగంటి శరభలింగం గారితో స్నేహం పెరిగింది. ఆయన సౌందర్యలహరి మొదలు పెట్టించారు. ఆయన వీటిల్లో బాగా సాధనచేసిన వ్యక్తి. ఆయనా నేను అనేక దీక్షలు, సంపుటీకరణలు చేశా. ఇది అంతా అమ్మ అనుగ్రహం. వ్యాపారం పెరిగింది. ఆదాయం పెరిగింది. మారుతీ వాన్ మీదకు దృష్టి మళ్ళింది. ఎలా !

మా ఆడిటర్‌కు చెప్పుకున్నాను. అన్ని బ్యాంకులకు ఆడిట్‌కు ఆయన వెళ్తుంటారు. అందువల్ల అన్ని బ్యాంకులతో పరిచయం బాగా వుంది. మారుతీవ్యాన్ కోసం లోను అప్లికేషన్ తయారు చేసి 4 బ్యాంకుల్లో ఇప్పించారు.

నేను మాత్రం లలితాసహస్రనామ స్తోత్రంలో 55వ శ్లోకం "మహాభోగా, మహైశ్వర్యా, మహావీర్యా, మహాబలా"సంపుటి ప్రారంభించాను, అమ్మ కళ్యాణం రోజు మే 5కు పూర్తి అయ్యేలా మొదలు పెట్టాను. వారం రోజులు గడిచింది. ఒక రోజు ఉదయం హాయిగా గొంతెత్తి పారాయణ చేసుకుంటున్నాను. అమ్మ స్మరణతో పారాయణ జరుగుతోంది. ఈ లోగా పక్క ఇంటిరేడియోలో భక్తి గీతాలు వినిపిస్తున్నాయి. భక్తప్రహ్లాదలోని పద్యం "మందారమకరంద మాధుర్యమున దేలు మధుపంబు బోవునే మదనములకు" అన్న పాట మొదలైంది.

సుశీల అతిమధురంగా పాడింది. సాలూరి రాజేశ్వరరావు గారి బాణి. నా హృదయాన్ని కదిలించేసింది. కళ్ళవెంట ధారలు. నాకు తెలియకుండానే వెక్కి వెక్కి ఏడ్చాను. ఆ పాటలంటే నాకు చాలా ఇష్టం. నా పరిస్థితి ఎవరికి చెప్పను. ఒక మంచి టేపురికార్డరు కొనుక్కొని మంచిపాటలు వినలేని జీవితం అని కుమిలిపోయాను. పూజ పూర్తిచేసుకొని తయారై సదాశివుడితో పనికి బయలుదేరాను. 'బాబాయిగారూ ! ఈ రోజు డల్‌గా వున్నారే'మని అడిగాడు. "అమ్మ వాన్ ఎప్పుడు ఇస్తుందో ఏమో ! ప్రస్తుతం చిన్న టేపురికార్డర్ కూడా పెట్టుకొని వినటానికి నోచుకోలే"దన్నాను. అతనూ చలించాడు. ఏమి చేస్తాం ? మూడ్ మార్చుకొని పనిలో పడ్డాం.

మా డిస్ట్రిబ్యూటర్ దగ్గరకు వెళ్ళి మాట్లాడి తిరిగి వస్తున్నాము. అంతలో ఒక మూల బల్ల మీద కొత్త పేనో సానిక్ టూ ఇన్ వన్ మెరిసి పోతోంది. ఇది మనకోసమే అమ్మ ఏర్పాటు చేసిందని సదాశివుడితో చెప్పాను. తన పిల్లలు అంత క్షోభిస్తే అమ్మ తట్టుకోలేదు. నేను బయటకు వచ్చి సదాశివుడిని కనుక్కోమని లోపలికి పంపాను. ఐదు నిమిషాలలో మా డిస్ట్రిబ్యూటర్ లోపలికి పిలిచి నన్ను సత్కరించినట్లు నా చేతిలో టేప్ రికార్డర్ పెట్టి డబ్బు ఉన్నప్పుడు ఇమ్మన్నాడు. నా సంతోషానికి అవధులు లేవు. మళ్ళీ ఏడ్చినంత పని అయింది. ఎన్నో మంచి భక్తిపాటలు కొనుక్కొని తన్మయంతో మురిసిపోయాను. ఇంక మరీ ధైర్యం వచ్చింది. తప్పక వాన్ ఇస్తుందనీ!

దీక్ష పూర్తి అయింది. మే 5 వచ్చేసింది. మధ్యాహ్నంకి "అనసూయా వ్రతం" పూర్తి చేసుకొని భోజనానికి కూర్చున్నాము. ఛీఫ్ కాషియర్ రాఘవరావు గారు స్టేట్‌బ్యాంకు నుంచీ లోన్ శాంక్షన్ అయిందని ఫోన్ చేశారు. సాయంత్రం లోపల తీసుకోమని. నాకు నోటమాటరాలేదు. అమ్మా! ఏమిటీ మాయ, ఎంత దయ, ప్రేమ, అనుగ్రహం. ఎక్కడికక్కడ మాయ. కొత్త సమస్య సరికొత్త పరిష్కారం కొత్త ఆనందం.

బ్యాంకులో ఆ రోజు రాత్రి 8 గంటలకు చెక్ ఇచ్చారు. ఆ చెక్ పుచ్చుకొని మారుతీవాన్ కొనుక్కుందామని మారుతీ డీలర్ దగ్గరకు వెళ్ళాను. ఇప్పుడు బుక్ చేస్తే 3 నెలల తరువాత ఇస్తామన్నారు. నీరు గారి పోయాను. ఏం చేస్తాం! మా ఆడిటర్ ఇంటికి వెళ్ళాను. ఆయన బ్యాంకు ఆఫ్ బరోడాకు ఆడిట్‌కు వెళ్ళారని చెప్పారు. ఆయన దగ్గరకు వెళ్లి నా పరిస్థితి చెప్పుకున్నాను. ఆయన వెంటనే మారుతీ డీలర్‌కు బ్యాంకు ఆఫ్ బరోడాలో లోను వుందని, ఫోన్ చేశాడు. మర్నాడు చెక్ తీసుకొని అతని దగ్గరకు రమ్మన్నారు. మర్నాడు వెళ్ళాను. అమ్మ మళ్ళీ విజృంభించింది. చాలా చర్చ జరిగిన తరువాత వాళ్ళు 2 గంటల్లో వాన్ రెడీ చేసి డెలివరీ ఇచ్చేసారు. అంతా పెద్దమాయ. అమ్మ ప్రతివిషయంలో వెనకవుండి క్షణక్షణం మా కోరికలు నెరవేరుస్తూ, సంతోష పెడుతూ అనుగ్రహ వృష్టి కురిపిస్తున్నదో! అడుగడుగునా తెలుస్తూనే ఉన్నది. జయహోమాతా. ***ఆగష్టు, 2007***

8. అమ్మే వచ్చింది

అమ్మ దయవల్ల జీవితంలో మళ్లీ కొత్త అధ్యాయం మొదలైంది. నెత్తిమీద పెద్దభారం. ఆఫీసును సవ్యంగా నడపాలి. కంపెనీకి లాభాలు రావాలి. మా సంపాదన పెంచుకోవాలి. కంపెనీ తరఫున ఎవరూ వుండరు. అన్ని బాధ్యతలూ మనవే. ఈ ఆఫీసుకు ఒక మేనేజరు కావాలి. ఎకౌంట్స్‌లో నమ్మకస్తుడు అయి వుండాలి. నా ఆలోచనలకు సరిపోవాలి. అనుభవం వుండాలి. ఈ అన్నిటికీ సరిపోయేవాడు ఒకడే దొరికాడు. కాదు అమ్మే రెడీగా ఉంచింది. ఆకునూరి శ్యామసుందర్. హిందూస్థానీ షిప్‌యార్డ్‌లో ఎకౌంట్సులో పనిచేసి వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకొని రెస్టుతీసుకుంటున్నాడు. వాడిని అడగటం భావ్యమా? ఒప్పుకోకపోతే? ఏమిచేస్తాం తప్పదు, అప్తుడు, మంచివాడు. కాదన్నా బాధపడనవసరం లేదు. ఎలాగో క్రింద మీద పడి ఒప్పించాను. ఆఫీసు పని చేయడం మొదలైంది. త్వరలోనే దారిలో పడింది.

సేల్సు బాగాపెరిగాయి. అటు కంపెనీవారు. ఇటు మేము అందరం చాలా హాయిగా, అన్యోన్యంగా పెరగటం మెదలైంది. మా సౌందర్య అపార్టుమెంట్స్ వూరి మధ్యలో చాలా ముఖ్యమైన జంక్షన్ లో వున్నాయి. ముందుఫ్లాట్సులో కంపెనీ, వెనుక పెద్దఫ్లాట్‌లో మేమూ, అనేక పూజా కార్యక్రమాలు జరిగేవి. వైజాగ్ లో 1982 నుంచీ ప్రతి దుర్గాష్టమికీ రంగరంగ వైభవంగా భారతీవ్యాఖ్య, తొలిమాట ప్రచురణ మొదలగు కార్యక్రమాలు జరిగాయి.

అమ్మగుడి నిర్మించుకోవాలని అనేక ప్రయత్నాలు చేశాం. కేశవశర్మగారు వున్నపుడు సీతమ్మధార కొండదగ్గర స్థలం ఇస్తున్నారని కార్తీక మాసంలో ఆ స్థలంలో దాదాపు వందమంది వెళ్ళి లలితా లక్ష నామార్చన చేసి వచ్చారు. గవర్నమెంటే మారడంతో ఆ స్థలం మాకు ఇవ్వలేదు.

ఒక రోజు అనుకోకుండా మా పాతమిత్రులు శ్రీ తిలక్‌గారు ఆంధ్రా యూనివర్శిటీ ప్రొఫెసర్‌గా పదవీవిరమణ చేసి లాసన్స్ బే కాలనీ లో వుంటున్నారు. వారిని కలిసినపుడు వారు ఒక ప్రక్కన ఇల్లు కట్టుకోగా 400 గజాల స్థలం వున్నదని దానిని అమ్మేస్తానని చెప్పారు. మా కంపెనీ వాళ్ళు మార్వాడీవాళ్ళు, ఆస్తులు, డబ్బు పెంచుకోవడంలో సిద్ధహస్తులు, వాళ్ళ జీవిత ధ్యేయమే అది.

బేరం కుదిరింది. వైజాగ్ ఆఫీసులో వచ్చిన లాభాలతోనే ఆ స్థలం కొనడం జరిగింది. నెమ్మదిగా ఒక సంవత్సరం గడిచింది.

మళ్లీ అక్కడ వచ్చిన లాభాలతోనే ఆఫీసు బిల్డింగ్ ఆ స్థలంలో కట్టడం జరిగింది. ఇక్కడ వచ్చిన లాభాలతోనే 3 అంతస్థుల మేడ. ప్లాను గీయించగా నైరుతీ వైపు స్థలం కోసు వచ్చింది. ఒక చిన్నముక్క మిగిలింది. వెంటనే నాకు ఆలోచన వచ్చిందీ అక్కడ "అమ్మకు" చిన్న మందిరం కట్టుకుంటే ? మా కంపెనీవాళ్ళతో చెప్పాను. మందిరం కదా ! అందరూ సంతోషించారు.

మరి, మందిర నిర్మాణానికి కావలసిన వనరులు సమకూర్చుకోవాలి. విగ్రహం ఎక్కడ చేయించాలి? ప్రతిష్ఠ ఎలా చేయాలి ? ఇవన్నీ చర్చించుకున్నాం. విగ్రహం రాజస్థాన్ జయపూర్‌లో చేయించేందుకు ఖర్చు మా కంపెనీ వాళ్ళే ఇస్తామన్నారు. అమ్మ దయతో డబ్బు సమకూర్చుకునే ప్రయత్నంలో పడ్డాం. ఆఫీసు బిల్డింగ్ పూర్తి అవటానికి ఇంకో 6 నెలలు పడుతూంది. విగ్రహం తయారీకి జయపూర్ ఎవరు వెళ్తారని చర్చ.

అప్పటికి పదినెలలుగా మా పెద్దఅల్లుడు సీతారామ్ కుటుంబంతో జయపూర్‌లోనే వుంటున్నాడు. ఉద్యోగరీత్యా హైద్రాబాద్ నుంచి జయపూర్ వెళ్ళాడు. మా అమ్మాయికి ఫోను చేసి విగ్రహం గురించిన పూర్తి సమాచారాన్ని తెలుసు కున్నాము. నమూనా చూడటనికి నా భార్య కుసుమా, నావల్ రాజుగారి భార్య లక్ష్మిగారు ప్రయాణమయ్యారు. కావలసిన అమ్మ ఫోటోలు, మందిరం కొలతలు అన్నీ సమకూర్చుకొని వెళ్ళి విగ్రహానికి ఎడ్వాన్సు ఇచ్చి వచ్చారు. విగ్రహం తయారయే సమయానికి మా ఆఫీసు బిల్డింగ్ రెడీగా వుంటుందనుకున్నాం.

3 నెలల గడిచాయి. ఉన్నట్లుండి సంక్రాంతి పండుగ వెళ్ళి ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చిన తరువాత పూర్ణిమా శుక్రవారం నాడు జయపూర్ నుంచి పెద్ద చెక్కపెట్టెలో 3 టన్నుల విగ్రహం వచ్చింది. ఆ రోజు సెలవు కాబట్టి విగ్రహాన్ని దింపటానికి ఒక్క కూలీకూడా దొరకలేదు. అంత విగ్రహాన్ని ఎలా దించాలి ? ఎక్కడ పెట్టాలి ? అన్నీ సమస్యలే. నేను ఒక్కడినైపోయాను. నేను వుండేది ఒక చోట, ఆఫీసు బిల్డింగ్ మరొకచోట. అమ్మా ! ప్రతినిమిషం టెంక్షనేనా ? ఎందుకీ పరీక్ష. జయపూర్ నుంచి వచ్చిన జీపు వాడు తిరిగి వెళ్ళిపోవాలని గొడవ.

ఎక్కడికి వెళ్ళినా ఎవరూ దొరకలేదు. దిగులుపడి కూర్చుండి అమ్మనే వేడుకోవటం మొదలు పెట్టాను.

ఈలోగా ఒక లారీలో కరెంట్ స్తంభాలు పాతే వాళ్ళు గునపాలు, పారలతో ఎక్కడికో పనిమీద వెళ్తూ ఈ చెక్కపెట్టె చుట్టూ జనాన్ని చూచి దిగివచ్చారు. వారంతట వారే పెట్టెను దించి చూస్తున్న వారందరికి ఆశ్చర్యాన్ని కలిగించారు. అది అంతా అమ్మ లీల కాకపోతే మరి ఏమిటి ? •పెట్టె తెరిచి అమ్మ విగ్రహం చూచి ముగ్ధులై పోయాము. చక్కని నవ్వుతున్న అమ్మ పాలరాతి విగ్రహం. బిల్డింగ్ ముందరహాలులో వుంచాము. అక్కడే పూజలు మొదలయ్యాయి.

నెమ్మదిగా మందిరం పూర్తి అయింది. ఇప్పుడు అతి పెద్ద సమస్య విగ్రహ ప్రతిష్ఠ. అందరూ భయపెట్టారు. హోమాలు, పూజలు, యంత్రాలు, జలాధివాసం, ధాన్యాధివాసం అనేక కార్యక్రమాలు చేయాలి. ఎలాగో ఏమిటో తెలియలేదు. మా ఆవిడకు బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది. అమ్మను ఆదిపరాశక్తిగా సాక్షాత్కారం పొందిన హటకేశ్వరంలోని పూర్ణానంద స్వామిజీ వారి సహాయం కోరింది. వారు అప్పటికే చాలా అనారోగ్యంతో వున్నారు. వారి సెక్రటరీ బి.ఆర్.కె. గారు ఒక్క రోజు ఆగండి. స్వామి వారితో సంప్రదించి చెప్తామన్నారు.

మళ్ళీ ఏమి చెప్తారో ? ఎలా చేయాలో అని ఆ రోజంతా మధనపడ్డాం. ఆ మర్నాడు వారి దగ్గర నుంచి ఫోను "వారి ఆర్తి, ఆవేదనలకే అమ్మ వచ్చింది, కాబట్టి వారినే ప్రతిష్ఠ చేసుకోమని" స్వామీజీ చెప్పారన్నారు. అమ్మ పరిపూర్ణ కటాక్షం, అనుగ్రహంతోనే విచ్చేసిందన్నారు. మేము రోజూ చేసుకునే పారాయణలు పూజలే చేసుకోమన్నారు మా బావగారు అన్నంరాజు రామకృష్ణారావు గారు స్వామీజీ దగ్గరకు వెళితే కుసుమరాసిన ఉత్తరం స్వామిజీ, వారికి చూపించారు.

మా సంతోషానికి, ఆశ్చర్యానికి అవధులు లేవు. ఆ మందిరం వేరే కాంపౌండులో లేదు. మా ఫ్లాటులోనే వుంది. కాబట్టి జాలాధివాసం, ధాన్యాధివాసం అటువంటివి అవసరం లేదని చెప్పారు. అమ్మ విగ్రహం అని కూడా అనలేదు. అమ్మే వచ్చిందన్నారు స్వామీజీ.

నాలుగు అడుగుల సింహాసనేశ్వరి అయిన అమ్మ విగ్రహ ప్రతిష్ఠకు అమ్మే ఎంతో సహకరించింది. అంత పెద్ద విగ్రహాన్ని మందిరంలో ప్రతిష్ఠించటం అదో పెద్ద కథ

అప్పుడు గుర్తుకు వచ్చింది. అమ్మ నాచేతిలో చేయివేసి 'విశాఖ వస్తాన'ని చేసిన ప్రామిస్. ఆనందంతో తడిసిపోయాను. అమ్మా ! ఈ దీనుడి మీద ఎంతదయ నీకు!

డిసెంబరు, 2007

9. కొత్త మలుపులు

విశాఖలో అమ్మ మందిరం ఏర్పడ్డాక అందరం చాలాసుఖ సంతోషాలతో కొత్త ఉత్సాహంతో అమ్మను ఆరాధించుకోవడం మొదలయింది. మా ఫ్లాట్సు మార్పిడి జరిగింది కానీ రిజిస్ట్రేషన్ కాలేదన్న బెంగగాని, అధైర్యంగానీ మాకెవరికీ లేదు. వ్యాపారం చక్కగా సాగుతోంది. ఏది జరిగినా అమ్మే చేస్తోందనుకున్నప్పుడు చీకూచింతా ఏముంది? విజయనగరంలో 'విరాస్' ఫార్మాస్యుటికల్స్ అనే కంపెనీతో ఒక అవగాహన ఏర్పరుచుకొని కొన్ని మందులు తయారుచేయించి అమ్మకాలు మొదలయ్యాయి. ఇంకా సేల్సులో అభివృద్ధి జరిగింది.

కంపెనీవాళ్ళు సర్వాధికారాలూ నాకే ఇచ్చారు. మందులు తయారై, పేర్లనిర్ణయం మొత్తంభారం నేనే వహించేవాడిని. కొన్ని కొత్త మందులు ఆర్డరు ఇచ్చాను. తీరా తయారు అయ్యాక రెండుమందులు కంపెనీవారు నిరాకరించారు. తయారు చేసిన విరాస్ కంపెనీవారు, నేను చిక్కుల్లో ఇరుకున్నాం. ఆ కంపెనీవారు నన్నే ఏదో విధంగా అమ్మమని వొత్తిడి తెచ్చారు. వేరే మార్గం లేక నా 'శ్రీమాతా సేల్స్ ప్రమోటర్స్' తరపున ఆ రెండు మందులు మార్కెటింగ్ చేయాల్సివచ్చింది.

జీవితంలో కొత్త మలుపు, కొత్త భారం, అమ్మ ఈ మలుపు ఎందుకు తెచ్చిందో ముందు ముందుగాని అర్థం కాలేదు. ప్రతిక్షణం రక్షణ కోరటం తప్ప మనం చేయగల్గింది ఏముంది కనుక. రోజులు గడుస్తున్నాయి. కొత్తమందులు, పాత కంపెనీ సేల్స్‌కూడా పెరగటం మొదలైంది. ఈ విషయం కంపెనీ వారి దృష్టికి వెళ్ళింది. వారికి నేను వేరే చేయటం నచ్చలేదు. తప్పు వారిది. తయారైన తరువాత ఆ మందులు వద్దన్నది వారు. 40 సంవత్సరాలు ఆ కంపెనీకే పనిచేశాక మనస్పర్థలు మొదలయ్యాయి. దానికి నా దగ్గర పనిచేస్తున్న కొంతమంది వారి స్వలాభం కోసం మా మధ్యపుల్లలు వేయటం మొదలు పెట్టారు. దానితో అగ్నికి ఆజ్యం తోడయింది. వాళ్ళు నాపై కక్ష సాధింపు మొదలుపెట్టారు. ఇటువంటి సమయంలో మన్నవ కృష్ణసేన్‌గారు అమ్మ మందిరంలో పూజలకు వస్తూ దగ్గరయ్యారు. ఆయన ఇన్‌వర్టర్స్, యు.పి.యస్. వ్యాపారంలో ఉన్నాడు. మంచిపేరు

వుంది. ఒక రోజు నన్ను అడిగాడు. అతను ఉద్యోగం మానేసి సొంతవ్యాపారం ప్రారంభిస్తానని, నన్ను పార్టనర్‌గా చేరమని అడిగాడు.

నాకు ఆ వ్యాపారం గురించి ఏమీ తెలియదు. కానీ అమ్మ తాలూకు వ్యక్తి కదా! అని సరే అన్నాను. లక్షన్నర డబ్బు పెట్టాను. ఇద్దరు గుమాస్తాలు, ఒక కంప్యూటర్ మొదలైనవన్నీ అమర్చుకున్నాం. వ్యాపారం అంతా ఆయన చూసేవాడు. నాకు ఇక్కడ కంపెనీలో పని అయ్యాక సాయంత్రం ఒక గంట వెళ్ళి కూర్చొనేవాడిని. మొదటి సంవత్సరం యు.పి.యస్.లు అమ్మేవాళ్ళం. 30 వేలు లాభం వచ్చింది. రెండో సంవత్సరం ఒక పెద్ద కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని అమ్ముదామని ఎగ్రిమెంట్ వ్రాసుకోవాలని సేన్‌గారు చెప్పారు. నాకు సమర్థవంతంగా చేయగలమని నమ్మకం కుదరలేదు. నేను సంతకం పెట్టనన్నాను. ఆయనే సంతకం చేసి వ్యాపారం ప్రారంభించారు.

2వ సంవత్సరం 44 లక్షలు వ్యాపారం జరిగింది. అయినా నష్టం వచ్చింది. ఏమి చేయాలి ? ఇక్కడ అద్దె 6 వేలు ప్రతి నెలా కట్టాలి. మా స్వంత ఫ్లాట్స్ సౌందర్యాలోకి మార్చుదామన్నాడు. ఆ తరువాత ఆయన విడిపోతానన్నాడు. నేను చేయగల్గింది ఏమీ లేదు. 'అమ్మా! ఇన్నేళ్ళ తరువాత నాకెందుకీ పరీక్షలు ? అంతా నీ దయ' అని ఈ వ్యాపారం వొదిలేసి నా సొంత మందుల కంపెనీ సౌందర్యలో మొదలు పెట్టాను.

పాతకంపెనీవారు నన్ను ఎలాగైనా వదిలించుకోవాలని చాలా బాధలు పెట్టి అవమానించడం మొదలు పెట్టారు. ఆ అవమానం భరించలేక కంపెనీని వదిలిపెట్టేశాను. ఇటు ధననష్టం, అటు 40 ఏళ్ళు పని చేసిన కంపెనీ పోయింది. నెలకు వచ్చే 30 వేలు ఆదాయం పోయింది. హఠాత్తుగా అంతా అయోమయం. కానీ అమ్మ అనుగ్రహం వల్ల నా సొంత ఇంట్లో, సొంత కంపెనీ మొదలైంది. నాకెవరూ బాసులు లేరు.

70 సంవత్సరాలు దాటాక కొత్త కంపెనీ, కొత్త జీవితం, కొత్త అనుభవం, కొండంత భారం. ఆరోగ్యం దెబ్బతిన్నది. కానీ అమ్మదయ వుండగా అన్నీ వున్నట్లే. ధైర్యంతో కొత్త జీవితం మొదలు పెట్టాను. అమ్మ ఎలా ముందు ముందు రక్షించిందో చెప్పుకుందాం. ***ఫిబ్రవరి, 2008***

10. విధి విలాసం

శ్రీసౌందర్య అపార్టుమెంట్సులో రిగాడియా ఫార్మస్యూటికల్స్ వ్యాపారం మొదలు పెట్టాం. మా అబ్బాయి రాధాకృష్ణ ఫ్లాటులో వ్యాపారం పైన మా ఫ్లాట్సులో రిప్రజెంటేటివ్స్‌తో చర్చలు అని ప్లాన్ చేశాం. ఐదు సంవత్సరాలు మేము లేకపోవటం వల్ల ఫ్లాట్సు పరిస్థితి దుర్భరంగా తయారయింది. మళ్ళీ మొదలు రిపేర్సు, పెయింటింగ్ వగైరా మొత్తం రిపేర్స్‌కు భారీగా సొమ్ము ఖర్చు అయింది. అంతా అయ్యాక వాటర్ ప్రాబ్లమ్. గత 5 ఏళ్ళుగా వర్షాలు లేకపోవటంతో బోర్ ఎండిపోయింది. మామూలుగానే మా ఏరియాలో వాటర్ ప్రాబ్లమ్ ఎప్పుడూ వుంది.

నెలకి 2 ఫ్లాట్సుకు కలిపి వెయ్యిరూపాయిల దాకా నీళ్ళకు కట్టాల్సి వచ్చింది. ఫ్లాట్సులో నీళ్ళు వాడినా వాడకపోయినా అందరూ కట్టాలి. ఇంత చక్కటి విలువైన జంక్షన్‌లో మా ఆస్తి కాపాడుకోవటానికి అమ్మే ఈ విధంగా నన్ను స్థలం మార్పులు చేసిందనిపించింది. రోజూ ఉదయం రాగానే లలితా సహస్రనామం కాసెట్ పెట్టటం, అమ్మకు పూజ చేయటం మొదలయ్యాయి. మా చుట్టుప్రక్కల వాళ్ళు చాలా సంతోషించారు. నెల గడిచిందో లేదో పెద్ద తుఫాను, భారీవర్షాలు, బోరు నీళ్ళతో నిండిపోయింది.

గత ఐదు ఏళ్ళగా ఇదే మొదటిసారి ఫ్లాట్సులో వాళ్ళంతా ఆఘనత మీదేనంటూ పొగడ్తలు. మేము వచ్చాక వర్షాలు పడ్డాయని వారి సంతోషం. ఇదంతా ఆ తల్లిదయ, అనుగ్రహం అని వాళ్ళందరి నమ్మకం. అంతా హాయిగానే నడుస్తోంది. కానీ నాకు 4 సార్లు రావటం, పోవటం కష్టంగానే వుంది. అశోక్‌హౌస్ పెద్దవాల్తేరులో ఆఫీసు వూరుమధ్యలో తిరిగి సౌందర్య అపార్టుమెంట్స్‌కి వచ్చేద్దామంటే 'అమ్మ మందిరం' పెద్ద వాల్తేరులో. రానూ పోనూ సమస్య. ఈ లోపల నేను సుఖపడుతున్నా ననుకొని అశోక్ ఫార్మస్యూటికల్స్ వాళ్ళు మేము వుంటున్న ఫ్లాట్సు ఖాళీ చేయమని వత్తిడి, హెరాస్‌మెంట్ మొదలు పెట్టారు. వాళ్ళ వాదన మా కంపెనీలో లేనప్పుడు మా ఫ్లాట్సులో ఎందుకు వుండాలి ? 'మా అబ్బాయి వాళ్ళ కంపెనీలో పనిచేస్తున్నాడు కనుక వాడితో వుంటున్నామ'ని నా వాదన. కొంతకాలం గడిచాక ఆ ఫ్లాట్సులో వారందరినీ ఖాళీ చేయమన్నారు. మా అబ్బాయి మీద కూడా వత్తిడి పెరిగి భరించలేని స్థితికి వచ్చింది.

అమ్మ మందిరంలో కూర్చుని చాలా బాధపడే వాళ్ళం. అమ్మ మందిరానికి దూరంకావటం ఇష్టం లేక. నా భార్య కుసుమ సలహా ఇచ్చింది. కుర్తాళం శ్రీస్వామి శ్రీసిద్ధేశ్వరానంద భారతీస్వామి వారిని సంప్రదించమని, సహాయం కోరమని. వారికి నా గోడు చెప్పుకోవటానికి టైమ్ ఎలా దొరుకుతుంది. వారి దర్శనమే కష్టమయ్యేది. సరేనని పి.యస్.ఆర్.అన్నయ్యకు ఫోన్ చేసి అంతా చెప్పుకున్నాను. ఆ సమయానికి స్వామివారు కుర్తాళంలో ఉన్నారు. రాత్రి 12 గంటలకు వారితో మాట్లాడే అవకాశం కలిగింది. చాలా ఆప్యాయతతో టెలిఫోనులోనే మంత్రోపదేశం చేసారు. 15 రోజులలోనే చాలా రిలీఫ్ వచ్చింది. మనస్సుకి ప్రశాంతత చేకూరింది. వారిని వైజాగ్ వచ్చినప్పుడు కలిశాను. హోమం చేయమన్నారు. ప్రయత్నించాను. కానీ వీలుపడలేదు.

స్వామివారు తరచు లలితాపీఠానికి వస్తారు. వచ్చినప్పుడల్లా వారి ఆశీస్సులను తీసుకొనేవాడిని. వారితో విన్నవించుకున్నాను. ఎక్కువ చేయలేకపోతున్నానని వారు ఎంత చేయగల్గితే అంతే చేయమన్నారు. త్వరలోనే చాలా విషయాలు పరిష్కారమయ్యాయి. ఆరోగ్యం చికాకుల వల్ల దెబ్బతిన్నది. మందులు మింగుతూ కాలక్షేపం. ఒకరోజు ఆస్థాఛానల్‌లో "బాబారామ్‌దేవ్" గారి యోగ శిబిరం ప్రత్యక్ష ప్రసారం చూస్తున్నాను. దీర్ఘకాల వ్యాధులతో బాధపడ్తున్న వారికి తగ్గిపోయాయని చెప్పటం విని ఆశ్చర్య పోయాను. యోగా, ప్రాణాయామం మీద ఆసక్తి పెరిగింది. రోజూ ప్రసారాలు చూడటం ప్రాక్టీసు చేయటం మొదలు పెట్టాను. అనేక పుస్తకాలు చదివాను. అనేకమంది గురువుల పద్ధతులను అధ్యయనం చేశాను.

మనుషుల వయస్సును బట్టి యోగాలో కొన్ని మార్పులు చేర్పులతో పాటు హోమియోపతి వైద్యం చేస్తూ అనేకమందికి సహాయం చేయటం మొదలుపెట్టాను. నా ఆరోగ్యం కూడా అనూహ్యరీతిలో బాగయింది. ప్రాణాయామం, ఆయుర్వేద, హోమియో మందులు చాలా వ్యాధులకు ఉపశమనం కలిగించవచ్చు అని తెలుసుకున్నాను. అవలంబిస్తున్నాను. అమ్మ చెప్పనే చెప్పిందిగా, "మునగండిరా, మునిగాక ఒడ్డున పడేస్తానని" అమ్మ అన్ని విధాల ఎల్లప్పుడూ కాపాడుతూనే వుంది. ఒకప్రక్క 'స్వామివారి'ని చూపింది. రెండో పక్క "బాబారామ్‌దేవ్"గారిని చూపించింది. ఆరోగ్యంవుంటే ఏ బాధనైనా సునాయాసంగా నివారించుకోవచ్చు.

ప్రతిరోజూ సాయంత్రం 'అమ్మ మందిరం'లో పూజలు, ప్రాణాయామం, యోగా ఉధృతంగా జరుగుతున్నాయి. మా ఫ్లాటు ఖాళీ చేయవలసిన సమయం దగ్గరపడుతోంది. అమ్మనే అహర్నిశం వేడుకోవటం తప్ప ఏమి చేయగలం? రోజులు గడుస్తున్నాయి. ఒక రోజు సడన్‌గా కంపెనీ ప్రొప్రయిటర్‌గారి భార్య పోయింది. వాళ్ళు మార్వాడీలు. ఆవిడ పేరిట చాలా ఆస్తులున్నాయి. త్వరలోనే వాళ్ళు ఆస్తులు పంచుకున్నప్పుడు కొన్ని మార్పులు రాకతప్పదు కదా ! మేము వుంటున్న బిల్డింగ్‌లో ఏమి మార్పులు వస్తాయో ?

మళ్ళీ అంతా అయోమయం. రెండు నెలలు అయ్యిందో లేదో వాళ్ళు వైజాగ్ వచ్చారు. అందరూ అమ్మ మందిరానికి వచ్చారు. చాలా ఆప్యాయతతో మాట్లాడారు. 3 నెలలు టైమ్ ఇచ్చారు ఫ్లాట్సు ఖాళీ చేయటానికి. అమ్మ మందిరం సర్వహక్కులు మాకే వదిలేశారు. కాని నేను ఒక చోట, మా పెద్ద అమ్మాయి ఒక చోట, మా అబ్బాయి ఫ్లాటు కట్టు కుంటున్నాడు, వాడు ఒకచోట. చిన్నఅమ్మాయి మాధవి మా సౌందర్యా అపార్టుమెంట్‌లో. విధి విలాసం. అంతా అమ్మదయ. మందిరానికి దూరమయితే 3 మార్లు రావటం కష్టమని నేను, కుసుమ మందిరానికి దగ్గరలోనే 2 బెడ్‌రూమ్ ఫ్లాటులోకి వెళ్ళాము.

అమ్మ మందిరంలో పూజలకు, కార్యక్రమాలకు ఏ విధమైన ఆటంకాలు ఉండవు. చెప్పలేనంత ఆనందం. ఊహించలేనంత సంతోషం. అమ్మకు దూరం కావటం లేదని. అమ్మకు ఎంత దయ, కరుణ, చేతిలో చేయివేసి మరీ అభయమిచ్చావు తల్లీ! తోలునోరుకాదుగా తాలు మాటరావటానికి.

ఏప్రియల్-2008

11. ఆటుపోట్లు

1972 వ సంవత్సరంలో అమ్మ దర్శనభాగ్యం కలిగి, అమ్మ నన్ను తన బిడ్డగా స్వీకరించి, నన్ను దగ్గరకు తీసుకున్నప్పటి నుంచీ, అమ్మ దగ్గరకు వచ్చేవాళ్ళను గమనించేవాడిని. మనంతట మనం ఏదో చేస్తున్నాం అనే పరిస్థితి ఎప్పుడూ వుండదు. ఆమె ఆజ్ఞప్రకారమే అన్నీ జరుగుతాయి. ఏ క్షణమైనా నేనే చేస్తున్నాననుకుంటే మరుక్షణమే చెంపదెబ్బ, మొట్టికాయలు తప్పవు.

సరిగ్గా 2000 డిసెంబరు 20 తేదీన అమ్మ మందిరం వున్న అశోక్‌హౌస్‌లో

ప్రవేశించాము. డిసెంబరు 20 నా భార్య కుసుమ పుట్టినరోజు. మళ్లీ సరిగ్గా 7 సంవత్సరాల తరువాత అదే డిశెంబరు 20వ తేదీన ఆ ఇల్లు ఖాళీ చేసి అన్నపూర్ణా అపార్టుమెంట్సుకు వెళ్ళాము. అంతా ఒక తుఫాను వచ్చి కూకటి వేళ్ళతో పెకిలించినట్లు ఒకే వూరిలో ముగ్గురు పిల్లలు వుంటూ అందరం తలోచోట, ఊహకు అందని పరిణామం. ఇదీ అమ్మలీలావినోదం కాకపోతే మరేమిటి ? మేమిద్దరమే ఉంటామని ఎన్నడూ కలలో కూడా వూహించని విషయం.

ముందర మార్చి 2008 వరకూ వుండవచ్చని చెప్పిన వాళ్ళే సడన్‌గా డిసెంబరు 18న వచ్చి 20వ తారీఖులోగా ఖాళీ చేయాలన్నారు. పిడుగులాంటి వార్త. సరిగ్గా తనపుట్టినరోజు నాటికి ఖాళీ చేయమంటే నా భార్య చాలా ఆందోళన చెందింది. 20న ఎటువంటి పరిస్థితుల్లో కూడా ఆ ఇంట్లో నిద్రచేయనని పట్టుపట్టింది. మంచి ఫ్లాట్ దొరికేవరకూ ఏ హోటల్‌కి అయినా వెళ్ళిపోదామన్నది. వెంటనే ఏకా రాజేశ్వరరావుగారి కోడలు కరుణకు ఫోను చేశాను. వాళ్ళు 2 నెలలు క్రితమే ఇల్లు ఖాళీ చేసారు. ఇళ్ళ కోసం చాలా తిరిగి తిరిగి దగ్గరలోనే వున్న ఫ్లాట్‌లోకి మారిపోయారు. వాళ్ళు కూడా ఆశ్చర్యపోయారు. ఇంత అర్థంతరంగా వచ్చిన పరిణామానికి.

ఆ మర్నాడే అన్నపూర్ణ అపార్టుమెంట్స్‌లో 2 బెడ్‌రూమ్ ఫ్లాట్ ఖాళీగా వున్నది. అది మాకు అనుకూలంగా మందిరంకు దగ్గరగా వుండటంలో అది ఖాయం చేసాం. అంతే క్షణాల మీద జరిగిపోయింది. ఇది అమ్మ చేసిన పనే కదా ! ఫ్లాట్ కూడా రెడీగా వుంచింది. ఈ వయస్సులో మేమిద్దరం అయిన వాళ్ళందరకూ దూరంగా వుంటూ అమ్మ మందిరానికి దగ్గరగా వుంటున్నాం. సెటిల్ అయిపోయాం. రోజూ ఉదయం, సాయంత్రం నేను పూజకు, మధ్యాహ్నం మహా నివేదనకు నా భార్య వెళ్ళడం. అంతా చిత్రాతిచిత్రం.

అనేకమంది అనేక రకాల ఊహాగానాలు చేసారు. వ్యాపారంలో దివాళాతీసి ఇల్లు అమ్ముకొని వెళ్ళిపోయామనీ, తండ్రీకొడుకులు పోట్లాడుకుని విడిపోయామని, అత్తాకోడళ్ళు పోట్లాడుకున్నారని రకరకాల పుకార్లు వచ్చాయి. అంతా అమ్మ అనుగ్రహం. శారీరక శ్రమ ఎక్కువైంది. కానీ మిగతా అంతా బాగానే వుంది. నా వ్యాపారం బాగా అభివృద్ధిలోకి వచ్చింది. అంతా యాంత్రికంగా జరిగిపోతుంది.

పూర్వం ఎక్కువ సమయం మందిరంలో గడిపేవాళ్ళం. మందిరానికి వెళ్ళినప్పుడల్లా అమ్మమీద కోపం, జాలి అందర్నీ దూరం చేసుకొని ఒక్కతే అయిపోయిందని. కానీ అమ్మకు రెస్టు రావాలేమో ! అనుకొని వూరడిల్లటం ఏమి చేస్తాం, మరి ?

కానీ అమ్మ మందిరానికి దూరమయ్యామన్న బాధ పీడిస్తూనే వుంది. జిల్లెళ్ళమూడిలో అనసూయేశ్వరాభవన్ ఓపెనింగ్ సందర్భంగా శ్రీ సద్గురు శివానందమూర్తిగారిని కలుసుకోవటానికి వెళ్ళాము. ఆ సందర్భంలో వారు మనం ఎంత బాధలు అనుభవిస్తే అంత మన పాపం హరించి పోతుందనీ, ఎంత సుఖపడితే అంత త్వరగా మనపుణ్యం కరిగిపోతుందనీ చక్కటి వివరణ ఇచ్చారు. నా మనోవ్యధ వీరికి ఎలా తెలిసిందని ఆశ్చర్యపోయాను. మనశ్శాంతి లభించింది. ఫిబ్రవరి 7న జిల్లెళ్ళమూడి వెళ్ళాం. ఎదురుగా బానర్‌లో "బాధలు లేని జీవితం వ్యర్థం" అని అమ్మ సూక్తి కనిపించింది. అప్పుడు నిర్ధారణకిమళ్ళీ వచ్చాను. ఈ పరిణామాలకు కారకురాలు మన అమ్మేనని, ఇవి అన్నీ ఎందుకు అనుభవించా లంటే ముందు ముందు సుఖపెట్టటానికే అని.

సద్గురు శివానందమూర్తిగారి ఆశీస్సులు లభిస్తూనే వున్నాయి. మరి శ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామివారిని విశాఖ లలితాపీఠానికి వచ్చినప్పుడల్లా కలిసి ఆశీస్సులు పొందుతున్నాము. లలితాపీఠంకు వెళ్ళినప్పుడల్లా మేనేజరు వాడరేవు సుబ్బారావు గారు, అసిస్టెంట్ మేనేజర్ విస్సా రామచంద్రరావుగారు అమ్మ పూజ పెట్టమని అందరూ అడుగుతున్నారని" చెప్పేవారు.

మార్చి 28న అమ్మ జన్మదినోత్సవం, మే5న కళ్యాణోత్సవం చాలా ఘనంగా జరిపించుకుంది అమ్మ. మే7న విశాఖ లలితాపీఠంకు స్వామివారు వస్తున్నారని ఆ రోజు అమ్మ ప్రసాద వితరణ పెట్టుకోమని మేనేజరు సుబ్బారావుగారు సలహా ఇచ్చారు. ఎండతీవ్రత ఎక్కువగానే వుంది. ఈ అవకాశం మళ్ళీరాదని అందర్నీ ఆహ్వానించాము. మే5న కార్యక్రమంలో బాగా అలసిపోయాం. 6వతేదీ సాయంత్రం అమ్మదగ్గర దీపారాధన చేసి వెనక్కి తిరగ్గానే మా మిత్రుడు అమ్మ అనుంగుబిడ్డ అయిన ఎ.వి.యల్. నరసింహారావుగారి కుటుంబం ప్రత్యక్ష మయ్యారు. వాళ్ళు చాలా సంవత్సరాల తరువాత గుడికి వచ్చారు. అది కూడా కూతుళ్ళు, మనమలు, కొడుకు ఆమె రావటంతో ఆశ్చర్యపోయాను.

నరసింహారావు, కేశవశర్మ కలసి మా అధ్యయన పరిషత్‌కు ఎనలేని సేవచేసారు. నరసింహరావు ఇండియన్ ఆయిల్ కంపెనీలో పనిచేసేవారు. దాదాపు 10 సంవత్సరాల క్రితమే ఆయన అమ్మలో ఐక్యమైపోయాడు. అనుకోకుండా వారందరకీ అమ్మని చూడాలనిపించి వచ్చామని చెప్పారు. 7వ తారీఖు లలితాపీఠంలో ప్రోగామ్‌కి ఆహ్వానించాము. ఈ కార్యక్రమం గురించి తెలియచేయటానికే వాళ్ళను అమ్మ మందిరానికి రప్పించుకుంది. 7వ తారీఖు లలితాపీఠంలో శ్రీస్వామివారు అనుగ్రహభాషణ చాలా ఘనంగా జరిగింది. అమ్మ పూజలు ప్రసాదవితరణ జరిగింది. గంటి వెంకట్రావుగారు కుటుంబ సమేతంగా వచ్చి పాలుపంచుకున్నారు. మా అధ్యయన పరిషత్ పాతమెంబర్సందరం కలవటం ఆ సందడీ, అంతా జిల్లెళ్ళమూడిలో వున్నట్లుందని మురిసిపోయారు. అమ్మా! ఎంత దయా ! ఏమిటీ కరుణ ! జయహోమాతా.

(నోట్ : ఆనాటి మా ప్రోగామ్ వివరాలు జగన్నాథం రిపోర్టు చదివి తరించమని ప్రార్థన.)

జూన్, 2008

12. సంత్ సదానందగిరి

మే 5న అమ్మ కళ్యాణోత్సవ పూజలు విశాఖమందిరంలో ఘనంగా జరుపుకొన్నాం. మే7న విశాఖలలితాపీఠంలో మా పాతమెంబర్స్ అందరం కలవటం చాలా సంతోషమైనది. లలితాపీఠంకు వచ్చేవాళ్ళు కూడా అనేకమంది ఆరోజు పూజలో పాల్గొన్నారు. స్వామివారి సమక్షంలో ఇదంతా జరగటం అందరికీ తృప్తికలిగించింది. అమ్మ అనుగ్రహం గురించి మరీ మరీ చర్చించుకున్నాం. అందరూ మళ్ళీ అమ్మ పూజలు పెట్టమని పట్టుబట్టారు. పూర్వం సంవత్సరం పదినెలలు ప్రతి మంగళవారం చేసేవాళ్ళం. ప్రతి నెల 2వ బుధవారం అమ్మ పూజ జరపటానికి నిర్ణయించాం. మే నెల అయిపోయి జూన్ నెల వచ్చింది.

జూన్ 11 రెండవ బుధవారం. ఒక రోజు ముందు నుంచీ సన్నాహాలు చేసుకున్నాం. 11వ తారీఖు మధ్యాహ్నం సరిగ్గా 11 గంటలకు ఎవరో తలుపు తట్టారుట. నా భార్య కుసుమ తలుపు తీసింది. ఎదురుగా ఒక సాధువు ప్రత్యక్షం. ఆయనకి ఏమి కావాలని కుసుమ ప్రశ్న. ఆంధ్రాయూనివర్శిటీలో తెలుగు ప్రొఫెసర్‌గా చేసి రిటైర్డు అయిన శ్రీమతి మలయవాసిని గారి ఇంటికోసం

తిరుగుతున్నానని, తలుపు మీద అమ్మ ఫోటో చూసి భక్తులకు, భక్తుల గురించి తెలిసివుంటుందని సమాధానం. లోపలికి పిలిచి కూర్చున్నాక కాఫీ ఇచ్చి వివరాలు అడిగింది మా ఆవిడ.

ఆయన ఒక సాధువు. వారిది ఉత్తరాంచల్‌లోని రుద్ర ప్రయాగ కాని దేశమంతా తిరుగుతుంటానని చెప్పారుట. ఆయనకు అనేక భాషలు వచ్చు. అన్ని భాషలలోని గ్రంథాలు చదవటం, నిత్యం ఆ భగవంతుని ధ్యానంలో వుంటూ ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ భగవంతుని గురించి ప్రసంగాలు చేస్తారుట. శ్రీమతి మలయవాసిని గారు మాకు చాలా ఆప్తులు. అనేకమంది వారి వద్ద చదువుకున్నవారే. అందులో మన మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి ఒకరు. ఆవిడకు ఫోను చేసి ఆయన వస్తున్నారని చెప్పి వారికి వాళ్ళ ఇంటి గుర్తులు చెప్పింది.

ఒక గంట కాకుండానే మలయవాసినిగారు ఫోను చేశారు. ఆ సాధువు గారి ప్రసంగం లలితాపీఠంలో మా పూజాకార్యక్రమం అయిన తరువాత ఏర్పాటు చేయమని. అంతా ఒక మాయలా అనిపించింది. ఆయన ఎవరో తెలియదు. వారు వెతుక్కుంటూ అమ్మ పూజ జరిగే రోజు రావటం మన పూజ అనంతరం అనుగ్రహభాషణ అంతా ఒక వింత, సాయంత్రం పూజా కార్యక్రమం జరుగుతుండగా ఆమె, సాధువుగారు వచ్చారు. మలయవాసినిగారు ఇదంతా అమ్మ లీల అని, అమ్మ అనుగ్రహమనీ మురిసిపోయారు. ఆ సాధువు గారి పేరు సంత్‌సదానందగిరి. వారి బస మామందిరం దగ్గర వున్న రామాలయంలో. పూజా కార్యక్రమం అయిన తరువాత వారిని రామమందిరంలో దింపేముందు అమ్మ మందిరానికి తీసుకొని వచ్చాం. వారి చిన్నతనంలోనే జిల్లెళ్ళమూడిలో అమ్మను దర్శించానని, అప్పుడు హైమ చిన్నపిల్ల అని. అమ్మ మహత్వం గురించి మాట్లాడుకున్నాం. మీ చిన్నప్పుడే అమ్మను దర్శించు కుంటే ఇప్పుడు మీ వయస్సెంత ? అని ప్రశ్నించాను. ఆయన 40 ఏళ్ళు నడి వయస్సులా కనిపిస్తున్నారు. 82 సంవత్సరాలు అని చెప్పారు. ఆశ్చర్యపోయాము. ఆయన రోజూ మధ్యాహ్నం ఒక్కపూటే భోజనం, భగవన్నామస్మరణ, యోగా, ప్రాణాయామం వల్ల ఇంత ఆరోగ్యంగా వుంటానని దేశం అంతా సంచరిస్తూ వుంటానని చెప్పారు. హాయిగా అమ్మ గురించి మాట్లాడుకొని ఎవరింటికి వారు నిష్క్రమించాము.

ఇంతకీ వారిని తన పూజకు అమ్మ ఎందుకు పిలిపించుకున్నట్లు, లలితాపీఠంలో అమ్మే లలిత అనీ, చెప్పించుకోవటం, మరల మన మందిరంలో వారికి దర్శన ఇవ్వటం, అమ్మ నిత్యం మా వెంటే వున్నానని, ఎవరినీ కూడా మరువలేదని, అమ్మను కోట్లమంది దర్శించుకున్నారని మా అందరికీ తెలియచేసి ఎల్లప్పుడూ మన వెంట వుండి అన్నింటికీ తానే కారకురాలని మళ్ళీ మళ్ళీ తెలియజేయటానికా తల్లీ !

మనందరికీ అలవాటేగా, తాను స్వయంగా చెప్పకుండా, తాను ఎవరికో చెప్పటం, ఎవరిచేతో చెప్పించటం. అంటే మనం కూడా ఆహార నియమాలను పాటించటం, ప్రాణాయామం చేయటం అవసరం. మనల్ని బాధపెడుతూ మళ్ళీ మన వెంటే వుంటూ మన బాగోగులు చూసుకుంటానని తెలియజేస్తూ వుంటావు. ధన్యులమమ్మా !

ఆగష్టు, 2008

13. మరో తుఫాన్

అమ్మ మందిరం దగ్గరగా వున్న అన్నపూర్ణా అపార్టుమెంట్సులో ఫ్లాటు అమ్మే ఏర్పాటు చేసింది. అది పాఠకులకు విదితమే కదా ! ఊరిమధ్యలో వున్న సౌందర్య అపార్టుమెంట్సులో వున్న మా ఫ్లాట్‌లో మా చిన్న అమ్మాయి వుంటోంది. అందులో ఉన్న మాబాబు ఫ్లాటులో మా ఆఫీసు. అంతా అయోమయం అనిపించింది. ఇంత వయస్సు వచ్చాక జీవితంలో ఊహించని ఈ మార్పులు. కాలం గడుస్తోంది. దానికి అలవాటుపడుతున్నామనుకునేలోగా ఇంకో పరిణామం. మా సొంతఫ్లాట్ వున్న సౌందర్యా అపార్టుమెంటు ప్రక్కన 'సెవెన్‌హిల్స్' ఒక పెద్ద కార్పొరేటు హాస్పిటల్ వుంది. ఆ సౌందర్యాలో మూడువంతులు వాళ్ళ స్టాఫ్‌కోసం కొనేశారు. వాళ్లకు ఆరోగ్య శ్రీ పథకం వచ్చాక చోటు చాలక మా వెంటపడ్డారు. మా ఫ్లాట్సు వాళ్లకు అమ్మేయమని. నేను ససేమిరా అమ్మనని. అది ఒక నిత్యకృత్యంగా మారింది.

ఆ సమయంలోనే మా అబ్బాయి వాళ్ళ స్నేహితులు కలిసి గ్రూపుహౌసింగ్ కట్టుకోవడం మొదలు పెట్టారు. అది చాలా పెద్ద ప్రాజెక్టు. సౌందర్యాలో వున్నది అమ్మేస్తే వాడి భారం కొంత తగ్గుతుందని అమ్మటానికి రెడీ అయ్యాడు. ఇప్పుడు నా

పరిస్థితి ఏమిటి ? ఆ ఫ్లాట్సు అమ్మితే నా ఆఫీసు ? మళ్ళీ ఫ్లాట్సు కొనుక్కోవటానికి అన్వేషణ మొదలు పెట్టాలి. మళ్ళీ టెన్షన్ మొదలు. సడన్‌గా మా అమ్మాయికి దోహా వెళ్ళటానికి వీసా వచ్చేసింది. అంతా హైమక్క మహిమ" మా అమ్మాయి దోహ వెళ్ళిపోయింది.

నాకు నాలుగు వైపుల నుంచీ వత్తిడి ఎక్కువైంది. కొంతమంది ఇల్లు అమ్మమనీ, మరి కొందరు వద్దనీ. అందరూ తలా ఒక సలహా. ఆగితే ముందు ముందు ఎక్కువ ధర పలుకుతుందని కొందరూ. వచ్చిన ఆఫరు వదులుకోవద్దని కొంతమంది. ఒక సమయంలో ఏమి చేయాలో తోచక "సద్గురు శివానందమూర్తిగారి" సలహా తీసుకోవటానికి సిద్ధమయ్యాను. ఆ సమయంలో వారు భీమిలీలో లేనందున సరే అమ్మ మీద భారం వేసి కూర్చున్నాను.

మా అబ్బాయి తన ఫ్లాటు అమ్మటంలో, దానితో పాటు మా ఫ్లాటు అమ్మేసాం. భారీగానే పైకం వచ్చిందని చెప్పాలి. కానీ ఖాళీ చేయటానికి ఒక నెలరోజులు వ్యవధి అడిగాం. సరే అన్నారు వాళ్ళు. ఇప్పుడు మళ్ళీ అన్వేషణ. ఒకటి మా నివాసానికి, రెండోది మా ఆఫీసుకు కమర్షియల్‌ది కావాలి. అదీ మందిరానికి దూరం కాకుండా మా నివాసానికి దగ్గరగా కావాలి. మళ్ళీ టెన్షన్. అమ్మ పెట్టే టెన్షన్ భరించే శక్తి ఇవ్వటం అమ్మకే తెలుసు. నేను హైమనామం. మా ఆవిడ అనేక దీక్షలు మొదలు పెట్టాం.

మళ్ళీ అమ్మ దయవల్ల మా అబ్బాయి కట్టుకుంటున్న ఫ్లాట్సుకు దగ్గరగానే మా నివాసానికి దొరికింది. 'శ్రీజ ప్లాజా' అందులోనూ ఫస్టు ఫ్లోర్‌లో. మొత్తం 15 ఫ్లాట్సు మాత్రమే వున్నాయి. సరికొత్తగా కట్టినది. ఆంధ్రాయూనివర్శిటీ ఔట్‌గేటు ఎదురుసందులో 'బాబాటవర్స్'లో ఇదే ఫ్లాట్సు. అందులోనూ ఫస్టుఫ్లోర్‌లో కమర్షియల్‌ది దొరకటం అమ్మ అనుగ్రహమే కారణం. రెండు చోట్ల అడ్వాన్సు ఇచ్చి కూర్చున్నాం. మా ఫ్లాట్సు కొనే వాళ్ళు ఇవ్వాళా రేపు అంటూ తాత్సారం చేయటం జరిగింది. ఇటు అడ్వాన్సు తీసుకున్న వాళ్ళు తొందర చేస్తున్నారు. మళ్ళీ టెన్షన్. చివరికి ఒక నెలలో రిజిస్ట్రేషన్స్ పూర్తి అయ్యాయి.

అంతా ఒక తుఫానులా వచ్చి వూపి పారేసింది. మళ్ళీ రెండు చోట్లా సామాను సర్దుకోవటం. మా అమ్మాయి సామాను, మా ఆవిడ పుస్తకాలు, సర్దుకోవటం

ఒక సునామీ అని చెప్పాలి. ఇంత వయస్సులో ఇది తట్టుకోవటం అమ్మ కరుణా కటాక్షమే అని చెప్పాలి. "తనకున్నది తప్పదు. అనుకున్నది జరగదని" చెప్పనే చెప్పింది కదా! ప్రస్తుతానికి సెటిల్ అయ్యామనే చెప్పాలి. సరికొత్త ఫ్లాట్సు. కొత్త జీవితం.

సెప్టెంబరు, *2009*

14. అమ్మ ఇచ్చిన అవకాశం

అమ్మ మందిరానికి దూరమయ్యామన్న బాధ ఎక్కువగా వున్నా, సౌకర్యాలు, సుఖాలు ఎక్కువయ్యాయి. ఆఫీసు, ఇల్లు కూడా సరికొత్త ఫ్లాట్సు. ఇంటి దగ్గరనుంచీ మందిరానికి ప్రయాణం పదినిమిషాలు. ఇంటి నుండి ఆఫీసుకు రెండు నిమిషాలు మాత్రమే. అమ్మ మా జీవిత క్రమాన్నే మార్చేసిందని చెప్పాలి.

పొద్దున్నే 5-30 కు లేవటం, కాలకృత్యాలు తీర్చుకొని 7 గంటల కల్లా అమ్మ మందిరంకు చేరి అమ్మ మందిరం తుడుచుకోవటం, పూలు కోసుకోవటం, అలంకరణ పూజా కార్యక్రమం, శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి వారు ఇచ్చిన మంత్రం చేసుకోవటం మొదలైన కార్యక్రమాలు పూర్తిచేసుకొని, 9 గంటలకు తిరిగి ఇంటికి రావడం పిమ్మట ఆఫీసు.

12 గంటలకు నా భార్య కుసుమాచక్రవర్తి మహానైవేద్యం తీసుకొని ఆటోలో వెళ్ళి ఒక గంట గడిపి తిరిగి రావటం, మళ్ళీ సాయంత్రం 6 గంటలకు మందిరానికి వెళ్ళి ఒక గంట వైద్యసేవ, తరువాత ప్రాణాయామ కార్యక్రమం ముగించుకొని 9 గంటలకు తిరిగి ఇంటికి రావటం. ఇదే నా దినచర్య. జీవితం ఒక యంత్రంలా తయారయింది. ఈ లోపల కారుడ్రైవరు దొరికాడు. నాకు, నా భార్యకు స్ట్రెయిన్ తగ్గింది. ఒక పక్క బాధ, మళ్ళీ సుఖాలు.

సద్గురు శివానందమూర్తిగారు చెప్పినట్లు పాపం హరించుకుపోతోందని సంతోషించడం. మా చిన్న అమ్మాయి మాధవి దోహా వెళ్తూ కొత్తకారు ఇవ్వటం, కొత్త ఫ్లాటు, కొత్త ఆఫీసు ఇదో కొత్త జీవితం. అమ్మ మీద కోపం పెరిగినా అమ్మకూ, మందిరానికీ దగ్గరవుతున్నామనే చెప్పాలి. ఎప్పుడూ మందిరం ధ్యాసే. దూరమయ్యామని బాధే. మందిరంలో ఉన్నంత సేపూ చాలా నిశ్చింతగా, హాయిగా గడిచిపోతుంది.

సాయంత్రం అనేకమంది వైద్యానికి ప్రాణా యామానికి రావటం

ఎక్కువయింది. వారికి అనేక అనుభూతులు. ఉదయం నిత్యం ప్రదక్షిణలు చేసుకునేవాళ్ళు. బయట నుంచే దణ్ణం పెట్టుకునేవాళ్ళు ఎక్కువయ్యారు. అనేకమైన అనూహ్య సంఘటనలు. ఈ మాటు ఒక్కొక్కటి మీతో పంచుకుంటాను.

విశ్వజనని కవర్ పేజి ప్రింటు చేయించే భాగ్యం పి.యస్.ఆర్. అన్నయ్య ద్వారా అమ్మ మాకు అప్పజెప్పింది. గత నాలుగు సంవత్సరాలుగా విశాఖలోనే చేయించి పంపేవాళ్ళం. నా భార్య ఒక వారం, రోజూ ప్రెస్‌కు వెళ్ళి ఫోటోలు సెలక్టు చేసుకొని కవరు పేజీ తయారు చేయించి పంపించేది. ఇప్పుడు ఆ ఓపిక, సమయం లేదు కనుక పి.యస్.ఆర్. అన్నయ్యతో మీరు గుంటూరులో చేయించుకోండి. దానికి కావలసిన పైకం మేము కలెక్టు చేసి పంపిస్తామన్నాము. అన్నయ్య సరే అన్నారు.

రెండు నెలల క్రితం అన్నయ్య ఫోను చేసి కావలసిన పైకం గురించి చెప్పారు. ఆయన చెప్పిన దానికి 5 వేలు తక్కువగా వుంది. ఎవర్ని అడగాలో తోచలేదు. నేనే ఎ.టి.యమ్.లో తీసుకోవాలని నిశ్చయించుకున్నాను. ప్రొద్దున్నే మందిరంకు వెళ్ళేటప్పుడు జనం ఎక్కువగా వుండరు కదా అని మా ఇంటి దగ్గర వున్న ఎస్.బి.ఐ. ఎ.టి.యమ్.కు వెళ్ళాను. అది పనిచేయటం లేదు. బోణీ బాగా లేదని అమ్మ మందిరం దగ్గర వున్న ఎ.టి.యమ్.కి వెళ్ళాను. అక్కడ ఎప్పుడూ ఖాళీ వుండదు. పెద్ద క్యూ వుంటుంది. అలాంటిది ఆ రోజు ఎవరూ లేరు. డబ్బు తీసుకొని మెట్లు దిగుతున్నాను. అక్కడ తెలిసిన ఆయన ఒకరు కన్పించారు. ఆయన రోజూ ఆఫీసుకు వెళ్ళే ముందు అమ్మని ప్రార్థించుకుని వెళ్తారు. ఆయన నాతో తన ఇల్లు అక్కడే అని నన్ను కలవాలని మూడు రోజులుగా ప్రయత్నిస్తున్నాని చెప్పారు. ఏమిటి విశేషం? అని అడిగాను. వాళ్ళకు అనేక సమస్యలు వున్నాయని ఎప్పటికప్పుడు అమ్మ కాపాడుతూనే వుందని కొంతపైకం అమ్మ సంస్థకు ఇద్దామనుకుంటున్నామని డబ్బు చేతిలో పెట్టారు. మొత్తం లెక్కచూసుకుంటే సరిగా 5 వేలు. నాకు పెద్ద షాకు. నాకు తక్కువైనది ఐదువేలు, ఆయన నా చేతిలో పెట్టింది 5 వేలు. 'జిల్లెళ్ళమూడి మాసపత్రిక కోసం వినియోగిస్తాన'ని చెప్పాను. ఆయన 'సరే' అన్నారు.

కవరు పేజీకి కావల్సిన మొత్తం డబ్బు ఎస్.వి.జె.పి. అకౌంట్‌లో వేసి శ్యామలకు ఫోన్ చేసి హైమాలయంలో పూజ చేసి ప్రసాదం పంపమని వారి అడ్రసు చెప్పాను. శ్యామల 40 రోజులు హైమాలయంలో అభిషేకాలు చేయించి

ప్రసాదం పంపుతామని చెప్పింది. నా సంతోషానికి అవధులు లేవు. ప్రతి క్షణం మన వెనుక వుండి మన కోర్కెలను తీరుస్తుందనటానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి" అమ్మా ! నేను నీ మీద అలిగినా, నువ్వు మాత్రం వదలకు". నా పిచ్చి కానీ "మీరు మరిచినా నేను మరవనని" అమ్మ హామీ ఇచ్చింది కదా ! జయహోమాతా!

నవంబరు, *2009*

15. అమ్మ విగ్రహం నుండి ఓంకారం

అమ్మా ! అమ్మా ! అమ్మ మీద ప్రేమ, అమ్మ మీద కోపం. మనకి అనుకూలంగా ఏ పని జరగకపోయినా అమ్మ మీద కోపం. అందర్నీ దూరం చేసుకొని ఒక్కతే మా అందరికీ దూరంగా ఒక మూల మందిరంలో కూర్చుంది. అమ్మ మీద జాలి, కోపం. అమ్మకి దూరంగా వుండలేకపోవటం. ఒక్కోసారి నిజంగా ఇక్కడ అమ్మ వున్నదా? లేక విగ్రహం పెట్టుకొని భ్రమపడుతున్నామా! అన్న ఆలోచన. అమ్మ మందిరంలో వున్న అశోక్‌హౌస్‌లో వున్నప్పుడు చాలా హాయిగా సాయంత్రం ఆ ఫ్లాట్సులో వున్న ఏకా రంగారావు, అతని భార్య కరుణ, ఎల్.వి.రవిబాబు గారు ఇంకా అనేకమంది సాయంత్రం ఆ మందిరంలో చేరి అమ్మకబుర్లు, ప్రాణాయామం, ఒక పక్కన వైద్యం - చాలా హాయిగా వుండేది.

సడన్‌గా అందరం మందిరానికి దూరమయ్యామని బాధ. ప్రతిరోజూ ఒక్కొక్క కొత్త అనుభూతి కొత్త అద్భుతం. అనేక సార్లు కరెంటు పోయినా, వర్షం వచ్చినా హైమక్క నామం పదినిమిషాలు చేస్తే చాలు వెంటనే ఆ తల్లి మా ప్రాబ్లమ్ సాల్వుచేసేది. అద్భుతం. ఒక్క సాయంత్రం జరిగిన ఒక చిన్న విచిత్రం చెప్పుకుంటాను. ఆ సాయంత్రం వర్షం వచ్చి వెలిసింది. ఎక్కువ మంది లేరు. నేను, ఏకా రంగారావుగారి భార్య కరుణ, లక్ష్మిగారు ఉన్నాము. లక్ష్మిగారి భర్త వేణుగారు, సత్యసాయిమందిరంలో సేవకు అంకితమయిన మనిషి. సాయిభక్తులు. లక్ష్మిగారికి గురువు వేరు. ఆమె మహాసాధకురాలు. ఎక్కువ ధ్యానంలో గడుపుతారు. మేము ప్రాణాయామం ముగించి చివరికి 3 సార్లు ఓంకారం చేసి ముగిస్తాము. మా ఓంకారం అయిపోయాక లక్ష్మిగారు ధ్యానం ముగించి ఓంకారం చేసారు.

అందరం లేవపోతుండగా ఎక్కడ నుంచో ఓంకారం మొదలైంది. ఎటుచూచినా ఎవరూ లేరు. ఎక్కడా అని తరచి చూడగా అమ్మ విగ్రహంలో నుంచే అని నిర్ధారణ అయింది.

లక్ష్మిగారు తన్మయత్వంతో అమ్మ తన పిలుపు విన్నదని, అమ్మ తన్ను అనుగ్రహించిందని అమ్మ వచ్చి ఆ మూర్తిలో వుండి మనందరినీ అనుగ్రహిస్తోందని చెప్పింది. ఆ అనుభూతిలో ధన్యులం. అమ్మ ఎప్పుడు ఎవరు ఏ బాధతో మందిరంలోకి వచ్చినా నవ్వుతూ అనుగ్రహిస్తోంది. ఎంత అదృష్టం. జయహోమాతా! రోజుకో అనుభూతి. ఒక రోజు విగ్రహం నవ్వుతూ సంతోషంగా కనిపిస్తుంది. ఆ రోజు ఎంతో హాయిగా పనులన్నీ సంతోషంగా జరిగి పోతాయి. ఒక్కోరోజు చికాకు, బాధపడ్తున్నట్లు. ఆ రోజు ఏవో తిప్పలు. ఏ రోజు ఏం జరగబోతోందో అమ్మ నాకు పొద్దున్నే చెప్పేస్తుంది. ఎంత ప్రేమ. అప్పుడు తగు జాగ్రత్తతో నేను వుంటాను. ఒకరోజు గులాబీరంగులో దర్శనమిచ్చింది. ఎవరో వచ్చి పింక్ మార్బల్‌తో విగ్రహాన్ని తయారు చేయించారా అని అడిగారు. ఎప్పటికప్పుడు కొత్త అనుభూతి. చింత ఏల మనకు అమ్మ చెంత వున్నంత వరకూ...... *జనవరి, 2010*

16. అమ్మ ఇచ్చిన ట్రీట్‌మెంట్

సరిగ్గా 38 సంవత్సరముల క్రితం ఏలిన నాటి శని నడుస్తున్న సమయంలో అమ్మని దర్శించుకోవటం జరిగింది. అప్పట్లో అన్నీ భరించలేని బాధలే. అమ్మ అభయమొసగి, ధైర్యాన్ని ఇచ్చింది. మొదట్లో జిల్లెళ్ళమూడిలో అన్నీ వింతగానే కనిపించాయి. వయస్సుతో నిమిత్తం లేకుండా అక్కయ్యా! అన్నయ్యా అని పిలుచుకోవటం. అమ్మ తీరే వేరు. అంతా ప్రేమే! అంతా ఒక సందడి. పెళ్ళిసందడిలా ఎప్పుడూ ఎవరో ఒకరు భోజనం చేస్తూనే కన్పించేవారు. నాకు మాత్రం నిండా నీటిలో మునిగినాము. అమ్మ ఎప్పటికైనా బయట పడేస్తుందన్న నమ్మకం కలిగింది.

ఇబ్బందుల్లో నుంచి నెమ్మదిగా బయటపడుతున్నాము. అప్పుడు చిన వాల్తేరులో 2 గదులు, వంటగది వున్నా చిన్న ఇంట్లో వుండేవారము. ప్రతిరోజూ, ఏదో ఒక సమస్య, ఆ తరుణంలో కుసుమ జిల్లెళ్ళమూడి వెళ్ళినప్పుడు "లైబ్రరియన్ రమా, వాళ్ళ అమ్మగారు వాళ్ళ అన్నయ్యకు డాక్టర్ జస్వంత్‌కుమార్ దగ్గర వైద్యానికి

వస్తారు. మీ ఇంట్లో వుంటారని" అమ్మ చెప్పింది. నా భార్య కుసుమ సరే అన్నది. లలితాంబక్కయ్య "వాళ్ళు బాగా వున్నవాళ్ళే. వేరే ఎక్కడైనా వుండేవారు కదా ! మీ ఇంట్లో ఎట్లా చేయగలవని" అంటే అమ్మ చెప్పింది, ఆవిడే చూసుకుంటుందని" కుసుమ అన్నదిట.

రమావాళ్ళ అన్నయ్యకు ట్రీట్‌మెంటో లేక మానెటరీ ట్రీట్‌మెంటో నాకు అర్థం కాలేదు. వాళ్ళను ఆ సమయంలో వుంచి మా బాధలకు ట్రీట్‌మెంట్ చేసిందని చెప్పుకోవాలి. వాళ్ళు సుమారు 40 రోజులు వుండి సంతోషంగా తిరిగి వెళ్ళారు. మేము నెమ్మదిగా అమ్మ అనుగ్రహ వర్షంతో అన్నిసమస్యల నుంచీ బయటపడ్డాము. మళ్ళీ ఈ మధ్యన సరిగ్గా 30 సంవత్సరముల తరువాత వచ్చిన ఏలిననాటి శనిపీరియడ్‌లో మళ్ళీబాధలు ప్రారంభం. కొత్త సమస్యలు కొత్త బాధలు.

అమ్మ మందిరం వున్న ఫ్లాటు ఖాళీ చేసి ఏడాది పాటు అద్దెఫ్లాటులో అజ్ఞాతవాసం. శనిదశ చివరిలో వుండటానికి, ఆఫీసుకు 2 ఫ్లాట్సు కొనిపెట్టింది అమ్మ. ఆ ఫ్లాట్సులోనికి మారటం సర్దుకోవటం, కొత్త జీవితం ప్రారంభం. అంతా ఒక సునామీలా అయిపోయింది. అంతా టెన్షన్. ఆ సమయంలోనే ఒక రోజు ఒక ఫోన్ కాల్ వచ్చింది. "చక్రవర్తి అన్నయ్య గారూ! నేను జిల్లెళ్ళమూడి రమను, నేను, మా అబ్బాయి, మా అక్క సింహాచలం మొక్కు తీర్చుకోవటానికి వైజాగ్ వస్తున్నాం. మీ ఇంట్లో రెండు రోజులు వుంటాము. మీ కొత్త ఇంటి అడ్రస్ చెప్పమ"ని దాని సారాంశం.

నా గుండెల్లో పిడుగు పడింది. రెండే రెండు గదులు. చిన్న ఫ్లాటు ఇంకా పూర్తిగా సామాను సర్దుకోలేదు. ఏమిటీ సమస్య. చేసేది ఏమీ లేక ఎడ్రస్ చెప్పాను. మళ్ళీ 30 సంవత్సరముల క్రితం సంగతులన్నీ గుర్తుకు వచ్చాయి. అమ్మ మాకు వైద్యం చేయటానికి మళ్ళీ రమను మా ఇంటికి పంపించిందని, నన్ను నేను సమాధానపరుచుకున్నాను. వాళ్ళు రానే వచ్చారు. అంతా అందులోనే సర్దుకున్నాము. ఆ రెండురోజులు అమ్మ సంగతులు జ్ఞాపకం చేసుకుంటూ అమ్మని స్మరిస్తూ హాయిగా గడిపేశాం.

మర్నాడు మధ్యాహ్నం నివేదన సమయానికి రమా, కుసుమా అమ్మ మందిరానికి వెళ్ళారు. ఎవరు వస్తే వారిచేత అమ్మకు నివేదన ఇప్పిస్తుంది కుసుమ. రమ నివేదన చేస్తుండగా అమ్మ ఊపిరి తీసుకున్నట్లుగా ఉచ్ఛ్వాస,

నిశ్వాసాలు వినిపించాయి. వెంటనే కుసుమను కేకేసి వినమని చెప్పిందిట. అంతకు ముందు అమ్మ దగ్గర నుండి ఓంకారం తాను వినలేదని కుసుమ బాధపడ్డది. ఆ లోటు తీర్చటానికి, రమని సంతోషపెట్టటానికీ అమ్మ ఆరకంగా నిదర్శనం చూపించింది. మాకు ట్రీట్‌మెంట్ అయిపోయింది. రమావాళ్ళు వెళ్ళారు. మేము సెటిల్ అయ్యామా? ఇంకా రాసుకోవలసిన విశేషాలు వున్నాయి. మళ్ళీ వచ్చే సంచికలో రాసుకుంటాను.

ఫిబ్రవరి, 2010

17. అమ్మ కూడా అలిగింది

నెమ్మది నెమ్మదిగా అన్న చక్కబడుతున్నాయి. మేము సర్దుకు పోతున్నాము. అమ్మ మీద కోపం మాత్రం పోలేదు. కాని అమ్మ స్మరణ స్మరణ లేకుండా ఒక్క క్షణం గూడా వుండలేకపోతున్నాము. అమ్మ మందిరం గురించిన ఆలోచన ఎక్కువయింది. అన్ని పనులూ ముగించుకొని సాయంత్రం . ఆ మందిరంలో వున్నంత సేపు నిజంగా అమ్మ దగ్గర జిల్లెళ్ళమూడిలో వున్నంత ఆనందం. ఇక జిల్లెళ్ళమూడి వెళ్ళేపని లేదని నిర్ణయానికి వచ్చేసాను. జీవితం హాయిగా గడిచిపోతోంది.

హైమక్క జన్మదినం, కోటినామ పారాయణకు కూడా వెళ్ళలేదు. మొదటి కోటి నామ పారాయణ నుంచీ ఎప్పుడూ మానలేదు. కానీ ఇప్పటి మానసికస్థితి అక్కడకు వెళ్ళే బుద్ధిపుట్టటం లేదు. వెళ్ళలేకపోయానని బాధ. ఇదంతా నవంబరు 2009 లో జరిగినది. ఈ లోపల ఉన్నట్లుండి ధర్మసూరి గారి నుండీ రోజూ ఫోనులు. వైజాగ్ వారి శ్రీమాతా బిల్డింగ్ చాలా అధ్వాన్నస్థితిలో వుందని, మొన్న జరిగిన కోటి పారాయణకు హైద్రాబాద్ నుంచీ కొంతమంది స్త్రీలను, వయస్సులో పెద్దవారిని 'శ్రీమాతా'లో వుంచారని, వారు మా 'శ్రీమాతా'లో నీటి సదుపాయం సరిగా లేదని, దోమల బాధ విపరీతంగా వుండటంతో తట్టుకోలేకపోయారని, చాలా అసౌకర్యానికి లోనయ్యారనీ, తాను ఫస్టుఫ్లోరు అంతారిపేరు చేయించాననీ, మిగతా క్రింద ఫ్లోరులో కూడా చాలా రిపేర్లు చేయించాలని వేడుకున్నంత పని చేసాడు.

మా బిల్డింగ్‌తో సంబంధం లేని ధర్మసూరిగారు తన డబ్బుతో బాగు చేయించారంటే మన సంస్థ మీద, అమ్మ మీద వారికి వున్న భక్తికి, ఆర్తికి ఆశ్చర్యపోయాను. నిజమే ! అక్కడ చక్కటి వసతి సదుపాయాలు వుండాలి, వచ్చే అమ్మభక్తులకు ఇంకో రెండురోజులుండాలనిపించాలి. వెంటనే మాతృశ్రీ అధ్యయన పరిషత్ విశాఖపట్టణ సభ్యులను సమావేశ పరచి తెలియపరిచాను. మా సభ్యులలో ఏ ఒక్కరైనా ఏమి చెప్పినా కాదనే ప్రసక్తే లేదు. సరే, ధాన్యాభిషేకంకు వెళ్ళినప్పుడు చూచుకుందామని అనుకున్నాము.

ఈలోగా ఇంకో విచిత్రం. ఒక చక్కటి కల. నేను ఎవరింటికో వెళ్ళాను. అక్కడ హాలులో పెద్దది అమ్మ ఫోటో వుంది. నేను లోపలికి ప్రవేశించగానే అమ్మ నన్ను చూచి తలపక్కకు తిప్పేసింది. నా గుండె ఝల్లుమన్నది. కల మాయం. నేను లేచి కూర్చున్నాను. అర్థమయింది. నేను అమ్మ మీద అలగటమే కాదు అమ్మ కూడా నా మీద అలిగిందని, చాలా బాధపడ్డాను. మర్నాడు ప్రొద్దున్నే మందిరానికి వెళ్ళగానే అమ్మ కాళ్ళు పట్టుకొని క్షమించమని ప్రాధేయపడ్డాను. జిల్లెళ్ళమూడికి త్వరలోనే వస్తానని వాగ్దానం చేసి తలెత్తి చూచాను. అమ్మ సంతోషంతో నవ్వుతోంది. పరవశించిపోయాను. ఇంటికి వచ్చాక నాభార్య కుసుమతో చెప్పాను. చాలా సంతోషపడింది. ఇప్పుడుమళ్లీ తికమక. నేను జిల్లెళ్ళమూడి వెళ్ళనని అందరికీ చెప్పాను. మరి ఇప్పుడు అహంకారం చంపుకొని వెళ్ళాల్సి వచ్చింది. ఈ సంఘటన నవంబరు చివరి వారంలో జరిగింది. నా భార్య వెంటనే బయల్దేరుదామంది. ఆలోచించాను. ఒక మంచి సాకు దొరికింది. నా భార్య జన్మదినం డిసెంబరు 20 తారీఖు. పుట్టినరోజు అమ్మ సన్నిధిలో గడుపుదామని నిర్ణయించు కున్నాం.

ఈ విషయాన్నే ధర్మసూరి గారికి చెప్పాను. ఆ సమయానికి ఆయన కూడా వస్తానని ప్రామిస్ చేశారు. ఆయనకు ఎంతసేపూ జిల్లెళ్ళమూడిలో వసతి సౌకర్యాలను పెంపొందించాలని తాపత్రయం. డిశెంబరు 20కి జిల్లెళ్ళమూడికి వెళ్ళటానికి బాపట్ల చేరాం. ధర్మసూరిగారు బాపట్ల స్టేషన్‌కి కారు పంపించారు. నా భార్య పుట్టినరోజుకు ప్రెసిడెంట్ రామబ్రహ్మంగారు స్పెషల్‌గా వచ్చారు.

మా ఇద్దర్నీ అమ్మగుడిలో కూర్చో బెట్టి ఘన సత్కారం, వేదపండితుల ఆశీర్వచనాలు చాలా అనూహ్యంగా జరిగాయి. చెప్పలేని ఆనందం, ఆశ్చర్యం.

అమ్మ ఎదురుగా కూర్చుని నా బాధలు, నా ఆనందం వగైరా చెప్పుకుందా మనుకున్నాను. అంతమంది జనం మధ్య ఏమి చేయను ? వెంటనే నేను మేడమీద వాత్సల్యాలయానికి చేరుకున్నాను. ఆ గదిలో దత్తు అన్నయ్య అమ్మభక్తులకు సేవచేస్తుంటాడు. వాత్సల్యాలయం తాళం వేసి వుంది. దత్తన్నయ్యకు అస్వస్థతగా కనిపించాడు. ఆయన నిద్రపోతున్నాడు. చప్పుడు కాకుండా ఆయన దిండు క్రిందనుంచీ తాళాలు తీసుకొని అమ్మ గదికి వెళ్ళాను.

అమ్మ గదిలో హాయిగా, అమ్మ మంచం దగ్గర కూర్చుని ఎన్నెన్నో విషయాలు అమ్మకు నివేదించుకున్నాను. అమ్మ నుంచీ నిస్సందేహంగా సమాధానాలు కూడా వచ్చాయి. చెప్పలేనంత సంతోషం. కొత్తశక్తి, కొత్త ఉత్సాహం. మళ్ళీ కొత్త జీవితం ప్రారంభం. ఇప్పుడు నేను కొత్తమనిషి నయిపోయాను. కొత్త వ్యక్తిగా విశాఖకు వచ్చాను. రాగానే శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి వారి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నాను. ఆ తరువాత మా అన్నదమ్ములతో కలిసి దక్షిణాది యాత్రలకు వెళ్ళాను. ఆ యాత్రలో అనేక వింతలు,. విశేషాలు.

(మార్చి, 2010)

18. శాంతి యాత్ర అశాంతి ఫినిషింగ్

జిల్లెళ్ళమూడి నుండీ రాగానే విశాఖలో శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి వారి 74వ జన్మదినోత్సవాలు. నన్ను, నా భార్య కుసుమను కూడా కమిటీలో వేశారు. 23 నుంచి 25 వరకూ వైజాగ్ చాలా పెద్ద సెంటర్లో వున్న గురజాడ కళాక్షేత్రంలో సాయంత్రం 6 గంటల నుంచీ 8 గంటల వరకూ ఎంతో వైభవంగా జరిగాయి. మొదటిరోజు సభాధ్యక్షులుగా సద్గురు శ్రీ శివానందమూర్తిగారు, ఆహ్వానపత్రికలు తీసుకొని గురువుగారిని ఆహ్వానించడానికి పెద్దలు శ్రీవాడరేవు సుబ్బారావుగారు (విశాఖ లలితాపీఠ మేనేజరు) శ్రీ సి.యస్.రావు గారు మొదలైన వారు బయల్దేరారు. నేను ఆఫీసులో పని వుండడం వల్ల వెళ్ళలేకపోయాను. నా భార్య కుసుమను వెళ్ళి గురువుగారి ఆశీస్సులు అడగమన్నాను. గురువుగారికి వివరాలు చెప్పి సెలవు తీసుకునే ముందు గురువుగారే కుసుమను అడిగారట. "ఆయన బాగున్నారా" అని. గురువుగారి ఆశీస్సులు అడిగారని చెప్పిందట.

వారు ఒక పెద్ద ఆపిల్ పండు స్పెషల్‌గా పంపారు. నా ఆనందానికి అవధులు లేవు. ఇదంతా అమ్మ అనుగ్రహం.

అటు లలితపీఠం వెళ్ళినా అంతే. స్వామివారితో స్వయంగా బాధలు చెప్పుకోవటానికి వందలాది వస్తుంటారు. స్వామివారు చాలా మందికి బాధ నివృత్తికి మంత్రం జపం చేసి హోమం వగైరా చేసుకోమని చెప్తుంటారు. అక్కడకూడా అమ్మ అనుగ్రహమే. వెళ్ళగానే మేనేజర్ సుబ్బారావుగారు కానీ, అసిస్టెంట్ మేనేజర్ వి.రామచంద్రరావు గారు కానీ వెంటనే దర్శనం చేయిస్తుంటారు. అందరికీ అమ్మ దయవల్ల మా మీద ఎనలేని ప్రేమ. అద్భుతంగా, వైభవంగా సభలు జయప్రదంగా జరిగిపోయాయి. చివరి రోజున వచ్చిన ప్రతివారికీ స్వామివారు స్వహస్తాలతో ప్రసాదం అమ్మ ఇచ్చినట్లుగానే ఇచ్చారు. అద్భుతమైన దృశ్యం.

ఆ మరుసటి దినమే అనగా 28 మధ్యాహ్నం మేము అంటే మా అన్నదమ్ములం ముగ్గురము, ఇంకో ఇద్దరు స్నేహితులు కలిసి ప్రతి ఏటా ఒక వారం దక్షిణాదియాత్ర చేస్తాము. మా తమ్ముడు అశ్వనీ కుమారు ఎప్పుడూ బిజీ. ప్రతి గురువారం ఏలూరు నుంచీ బందరు వెళ్ళి ఫ్రీ డయాబిటిక్ క్లినిక్ నడుపుతాడు. 300 మంది దాకా పేషెంట్లుకు మందులు కూడా ఫ్రీగా ఇస్తూ సేవ చేస్తున్నాడు. అదీకాక వీలు దొరికినప్పుడల్లా పుట్టపర్తి వెళ్ళి సేవచేస్తుంటాడు. మా రెండో తమ్ముడు ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ ఆంధ్రా యూనివర్శిటీలో 'రెక్టార్'గా పని చేసి రిటైర్ అయ్యాడు. ఆయన మాజీ టెన్నిసు కామెంటేటర్. ఆయన ఉపన్యాసం లేని సభ వైజాగ్‌లో వుండదంటే అతిశయోక్తి కాదు. మంచిపేరు ప్రఖ్యాతులు సంపాదించిన వ్యక్తి. రామభక్తుడు. బందర్లో మా ఇంట్లో రామమందిరం కట్టుకొని 50 సంవత్సరాలుగా పూజించు కుంటున్న వ్యక్తి. 4వ ఆయన బ్రహ్మయ్య అండ్ కంపెనీలో ఆడిటర్. చాలా గొప్ప వ్యక్తి. ఐ.ఒ.సి. రిటైర్డుమేనేజర్. నెలరోజులు ముందుగానే రిజర్వేషన్లు అన్నీ చేయించుకొని జాగ్రత్త పడ్డాము. మొదట గురువాయూర్‌లోని కృష్ణ దర్శనం. చాలా పురాతనమైన క్షేత్రం. నిత్యం వేల మంది భక్తులు. కేరళలోని గురువాయూర్‌కు మేము 15 సంవత్సరాలుగా వెళ్తున్నాం. తిరుపతిలో లాగానే తోసేస్తుంటారు. గుడిలో దూరంగా చిన్న విగ్రహం. పూర్తి అలంకరణతో చాలా అద్భుతంగా వుంటుంది. ఈ సారి కూడా బయట చాలామంది జనం. నేను నిత్యం లలిత పారాయణ చేస్తుంటాను. ఏ దేవుడైనా సరే. నాకు

తెలిసింది అది ఒక్కటే. ఈ సారి గుడిలో పది మందికూడా లేరు. నిండు విగ్రహం. మనసారా చూడగల్గాము. 2 నిమిషాలు దర్శన భాగ్యంతో పులకరించిపోయాము. ఎంత అదృష్టం. ఈ జన్మకి ఈ దర్శనం చాలు అనిపించింది.

మర్నాడు తిన్నగా కన్యాకుమారి వెళ్ళాము. అక్కడ వివేకానంద ఆశ్రమంలో 2 రోజులు వున్నాం. అది వేరే ప్రపంచం. ఎంతో హాయి మనశ్శాంతి. సాయంత్రం కన్యాకుమారి మందిరానికి వెళ్ళాం. ఆ రోజు ఆదివారం. బీచ్ ముందే అమ్మవారి ఆలయం. వేలమంది జనం. భయం వేసింది ఈ రోజు దర్శనం అవుతుందా అని. అమ్మవారిని చూస్తే హైమక్కే గుర్తుకు వస్తుంది. ఏమీ తేడాలేదు. ఆ రోజు కూడా లోపల ఎవరూ లేరు. చక్కటి దర్శనం. హైమక్కను చూస్తున్న భావన. నా అదృష్టం, వెళ్ళిన ప్రతిచోటా అమ్మ దయ కనిపిస్తూనే వుంది.

మర్నాడు అరుణాచలం. రమణాశ్రమంలో కూడా హాయిగా చక్కగా దర్శనాలు. ఆ మర్నాడు పాండిచ్చేరి అరవిందాశ్రమము అక్కడ నుంచీ అరోవిల్లి. ఆ ప్రదేశమంతా ఒక స్వర్గం లాగా అనిపించింది. ఒక ఫ్రెంచి వనిత అంతటి అద్భుతం సృష్టించిందంటే! అనూహ్యం. దైవం గిరి గీసుకొని ఒక చోటే లేదు. సర్వత్రా నిండిఉన్నాడు. మన సాధన, సంకల్పం లోపమే కాని, అనుమానం అక్కరలేదు.

ఆ రోజు సాయంత్రం పాండిచేరిలో గణపతి కోవెల చాలా ప్రసిద్ధి చెందిన దేవాలయం. అదే మా యాత్రలో చివరి దర్శనం. ఆ స్వామి ఏదో బాధపడుతున్నట్లు అనిపించింది. చివరిలో ఏమిటిది అని మనస్సు కొంత కలవరపడింది. తమాయించుకున్నాను. సాయంత్రం 7 గంటకు రైలు ఎక్కి తిరుగు ప్రయాణం కోసం. ఈ వారం రోజులు ఆరోగ్యం గురించి ఏ జాగ్రత్త తీసుకోలేదు. నాకు షుగర్, ప్రొస్టైయిట్ ప్రాబ్లమ్ వున్నాయి. అప్పుడు గుర్తుకువచ్చి మందులు వేసుకొని నీళ్ళు చాలా త్రాగాను.

24 గంటల ప్రయాణం. సరిగా 10 గంటలకు బాధ. కడుపులో మంట. యూరిన్ రావటం బంద్యై పోయింది. అమ్మా ! ఏమిటీ పరీక్ష నాకు ! చేయగల్గింది ఒక్కటే. అమ్మ, హైమక్క నామం. తెల్లవార్లూ బాధపడ్తూనే వున్నాను. దాహం. నీరు తాగితే భయం. యూరిన్ రావటం లేదు. మర్నాడు మధ్యాహ్నం 1గంటకు

విశాఖ చేరుకున్నాను. నా పరిస్థితిలో మార్పులేదు. దాదాపు 20 గంటలు నరకం అనుభవించాను. ఆ రోజు సాయంత్రం ఆసుపత్రికి వెళ్ళి చికిత్స చేయించుకున్నాను. ఒక నెలరోజులు పూర్తి విశ్రాంతి కావాలన్నారు. అమ్మ ఎందుకు ఈ పరీక్ష పెట్టిందా ? అన్న ఆలోచన. అమ్మ చెప్పనే చెప్పిందిగా “తనకున్నది తప్పదు. అనుకున్నది జరగదు”.

ఎన్ని చెప్పినా అమ్మ కాపాడుతూనే వుంది. ఈ భాధ నాకు తప్పదు. ఇదే ఒక రోజు ముందైతే మా ప్రోగ్రామ్ ఇబ్బందుల పాలయ్యేది. రిజర్వేషన్లు దుర్లభం. అందరికీ ఇబ్బంది ఒకటి మాత్రం గట్టిగా చెప్పగలను. మన జీవితంలోని కష్ట, నష్టాలను అమ్మ మార్చగలదు. ఓపిక వున్నపుడు కష్టాలు. ఓపికలేనప్పుడు సుఖాలు. చదరంగంలోని తెల్ల నల్ల గడుల్లాగా అమ్మ మార్చి మార్చి మనకు సుఖశాంతులు కలుగచేస్తుంది. *ఏప్రియల్, 2010*

19. అమ్మ మాకిచ్చిన శ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి

ఫిబ్రవరి 3వ తారీఖు 2010 రాత్రి పాండిచ్చేరి నుంచీ వైజాగ్ తిరుగుప్రయాణంలో పడిన బాధ చెప్పనలవి కాదు. కానీ ఈ రెండు నెలల్లో జీవితంలో చాలా విషయాలు తెలుసుకున్నాను. చాలా బాధలు పడ్డాను. నా మానసిక, శారీరక పరిస్థితి ఆ అమ్మకే తెలుసుకానీ మందులతోనూ, మంత్రాలతోటి చాలా ప్రయోగాలు చేసాను. ఈ సందర్భంలో ఒక విషయం మీకు తెలియచేయాలి.

మా కంపెనీవారితో, ఇంకా చేయని తప్పులకు, పొరపాట్లకు అనండి అనేక ఆర్థిక మానసిక ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చినప్పుడు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీ స్వామి కుర్తాళం వారికి ఫోనులో విన్నవించుకున్నాను. ఆ సమయంలో వారు కుర్తాళంలో వున్నారు. రాత్రి 12 గంటలకు టెలిఫోనులో మంత్రం చెప్పి జపం చేసుకోమన్నారు. వారు ఆదేశించిన మేరకు మంత్రం చేసి బాధల నుంచీ బయటపడ్డాను.

అంతకు పూర్వమే మా మనమరాలు గురించి కుసుమ స్వామి వారి దగ్గర మంత్రాలు తీసుకుంది. “ధూమావతి, నాగభైరవ” మంత్రాలు రోజుకు ఒక్కో మంత్రం 1100 చేయమన్నారు. ఆమె చేస్తున్న సమయంలో కాకులు వచ్చి కూర్చునేవి. ధూమావతీ దేవత కాకిరూపంలో వచ్చి నెయ్యి అన్నాన్ని స్వీకరించేది. ఆమెకు ఉదయం చేయటం కుదరక మధ్యాహ్నం చేసినా అప్పుడూ వచ్చేది. ఒక మారు

తను బయటకు వెళ్ళిరావటంతో జపం చేయటం జాప్యమయింది. సాయంత్రం 4 గంటలకు కాకులు వచ్చి అరిచి గోలచేసి గుర్తుచేశాయి. ఒక మారు రాత్రి 10 గంటలకు మంత్రం చేస్తుంటే కాకులు వచ్చాయి. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఆ తరువాత మామనుమరాలికి పూర్తిగా ఆరోగ్యం చేకూరింది. మంత్రాలలో అంతశక్తి వుందా? అనిపించింది.

శ్రీ స్వామివారి రచన దశమహావిద్యలు చదివాను. దానిలో "ఛిన్నమస్త మంత్రం"తో ఒకరు తేలుకాటు బాధకు నివృత్తి కలిగించేవారని చదివాను. అది గుర్తుకు వచ్చి స్వామివారు నాకు ఇచ్చిన "ప్రత్యంగిరా మంత్రం" చేస్తూ చాలా ఉపశమనం పొందాను. నిత్యం లలితా సహస్రనామస్తోత్ర పారాయణ ఖడ్గమాలలాంటి వాటితో జీవితంలో చాలా సమస్యలను దాటిపోగలిగాను. ఇప్పుడు ఈ ప్రత్యంగిరా మంత్రం ఒక కవచంలా కాపాడుతోంది.

ఇక వైద్యం దగ్గరికి వస్తే 50 సంవత్సరాలు పై బడ్డ ప్రతిపురుషుడు "ప్రోస్ట్రేట్‌గ్లాండ్" విషయంలో జాగ్రత్త తీసుకోవాలి. హోమియోపతిలో సబల్‌శరులట (SABAL SERRULATA) మదర్‌టించర్ ప్రతిరాత్రి పదిచుక్కలు. అరకప్పు నీళ్ళలో వేసుకొని తాగితే జీవితం సుఖశాంతులతో గడపవచ్చు. ఇది ఒక టానిక్. ఈ మధ్య ప్రోస్టేట్ కాన్సర్లు ఎక్కువైపోయాయి. దానిని ఈ మందు ద్వారా నివారించుకోవచ్చు. జిల్లెళ్ళమూడి అమ్మ 'నాతో' నాకు హోమియోపతి నమ్మకం నాన్నా!" అని చెప్పింది. నేను చేసేది అలోపతి మందుల వ్యాపారం. కానీ అమ్మ చెప్పిందని హోమియోపతి వైద్యం కూడా నేర్చుకున్నాను. అనేక ప్రయోగాలు చేసాను. చాలామందికి నా వైద్యంతో రోగులకు వారి బాధల నుండీ నివృత్తి కలిగించగలిగాను. అమ్మ నా జీవితంలో అనేక సమస్యలు కలుగచేయటం, వాటిని మంత్రాలతోటి, మందుల తోటి పరిష్కరించుకోవటం. వైద్య విషయాల్లో మా తమ్ముడు డాక్టర్ అశ్వనీకుమార్ ద్వారా చాలా తెలుసుకున్నాను. నా జీవితంలో అమ్మ దగ్గరకు తీసుకున్నప్పటి నుంచీ అనేక అనుభవాలు. ప్రతి క్షణం కాపాడుతందన్న విషయం ప్రతి వారికీ అనుభవమే కదా నేను పడ్డబాధలు మిగతా వారు పడకూడదని నా కోరిక. అందువల్లే 'క్షణక్షణం -అనుక్షణం' రాసుకుంటున్నాను. "చింత ఏల అమ్మ చెంత నున్నంతవరకూ" ఎన్ని బాధలున్నా అమ్మని చూడగానే అన్నీ మర్చిపోతాం. విశాఖమందిరంలో అమ్మ ఎప్పుడూ నవ్వుతూనే దగ్గరకు తీసుకుంటుంది. ఎంత అదృష్టవంతులం.

(మే, 2010)

౨౦. నిదర్శనం

నా ఆరోగ్యం నెమ్మదిగా మెరుగవుతోంది. సాయంకాలం ఒక గంట అమ్మ మందిరంలో కూర్చో గలుగుతున్నాను. కొన్ని రోజులు నా భార్య కుసుమ కూడా తోడువచ్చేది. ఆవిడ కన్ను ఆపరేషను చేయించుకోవాలి. డాక్టర్లు ఆలస్యం చేయకూడదని ఆమెను తొందరపెడ్తున్నారు. నా అనారోగ్యం వల్ల ఆలస్యం అయింది. ఆమె ఒక నెల రెష్టు తీసుకోవాలి అని అన్నారు. కొన్ని రోజులు మందిరానికి వెళ్ళటం ఆగిపోతుంది. ఇద్దరం చాలా బాధపడ్డాము. నేనూ వెళ్ళలేక తాను వెళ్ళకపోతే మందిరంలో అమ్మకూ మూడు పూటలా నైవేద్యాలు ఎలా ?

మందిరం ప్రక్కనే ఆంధ్రాయూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా చేసి రిటైర్డ్ అయిన తిలక్‌గారి భార్య లక్ష్మి గారు ముందుకు వచ్చారు. అమ్మ మందిరంలో ప్రథమ పూజారిణి ఆమే. రెండుపూటలా ఆవిడే ఛూసుకుంటాననీ, అమ్మ మళ్ళీ తనకు ఆ అదృష్టాన్ని కలుగ చేసిందని చాలా సంతోషించారు.

కుసుమకు కంటి ఆపరేషన్ అయ్యింది. అంతా సవ్యంగానే జరిగింది. ఇద్దరం కోలుకుంటున్నాం గానీ మానసిక శారీరక బాధలు ఎక్కువ అయ్యాయి. అమ్మ ఎందుకు పరీక్షలు పెడ్తోందని చాలా దిగులుపడ్డాము. ఒక రోజు ఒక ఫోను కాల్ వచ్చింది. అది ఏలూరు నుంచి మా డాక్టర్ తమ్ముడు అశ్వనీకుమార్ భార్య రాజేశ్వరి దగ్గర నుంచి. సారాంశమేమంటే పుట్టపర్తి సాయిబాబా గారు కుసుమకు పసుపు కుంకుమ బట్టలు పెట్టమన్నారు అని. అంతా ఆశ్చర్యం. ఏమిటీ మాయ. ఆకథ క్రింద వివరిస్తాను.

మా అశ్వనీ కొడుకు కిరణ్‌కుమార్ బందరులో ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. వాడు, వాడి భార్య సుశీల సత్యసాయిబాబా గారి భక్తులు. ఎప్పుడూ పుట్టపర్తి వెళ్తుంటారు. వాళ్ళ పూజామందిరంలో బాబాగారి ఫోటో నుంచి విబూది, తేనెరావటం అందరికీ తెలుసు. వాళ్ళింట్లో ఏ సమస్య వచ్చినా బాబాగారికి నివేదించు కుంటారు. దానికి జవాబు స్వామి ఇవ్వటం అలవాటు. ఈ మధ్య కిరణ్ అన్నయ్యకు యాక్సిడెంట్ అయింది. బ్రతకటం కష్టమన్నారు. వాడి ఆరోగ్యం కోసం స్వామికి నివేదించారు.

15 రోజులు పసుపు బట్టలు కట్టుకొని పూజచేసి వాడికి పసుపు నీళ్ళతో స్నానం చేయించమన్నారు. ఆ తర్వాత ఒక ముత్తైయిదువకు పసుపు కుంకుమ, చీరె, జాకెట్టు పెట్టమని, ఆ ముత్తయిదువ ఎవరైనదీ మర్నాడు చెప్తానన్నారుట.

"తల్లిని కొలుస్తున్న మీ పెద్ద అత్తగారిని ముత్తైయిదువగా పెట్టుకోమని" పసుపు, కుంకుమ గాజులు స్వామి స్వయంగా ఇచ్చారుట. ఒక గురువారం మధ్యాహ్నం తీసుకు వచ్చి కుసుమకు బొట్టుపెట్టి సుశీల ఇచ్చింది. "ఆ సాయంత్రం స్నానం చేసిన తరువాత పెట్టుకుందామని జాగ్రత్తగా దాచుకుంది. సాయంత్రం మర్చిపోయింది. మర్నాడు శుక్రవారం తలంటు స్నానం చేయగానే గుర్తు వచ్చి అమ్మకు, సత్యసాయిబాబాకు నమస్కరించి బొట్టు పెట్టుకుందిట. అంత మటుకు నీరసంగా ఉన్న మనిషికి ఎక్కడ లేని ఓపిక వచ్చి గబగబా పనిచేసుకుంటుంటే ఆశ్చర్య పోవటం నా వంతు అయింది.

నాకు ఒంట్లో బాగుండనప్పుడు నన్ను షిర్డీ వెళ్ళి రమ్మంది అమ్మ. ఇప్పుడు కుసుమకు బాగుండనప్పుడు సత్యసాయిబాబాగారి దగ్గర నుంచీ పసుపు, కుంకుమ గాజులు వచ్చేటట్లు చేసి మాకు వైద్యం చేసింది అమ్మ.

క్షణక్షణం మనతో పాటు వుండి మనందర్నీ కాపాడుతోంది. ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? అమ్మ ఎప్పుడూ తనకర్తృత్వాన్ని ఒప్పుకునేది కాదు. ఎవరో ఒకరిని అందులో భాగస్వామ్యం చేసేది. అమ్మా ! మమ్మల్ని విడిచి పెట్టకమ్మా !

జూన్, 2010

21. కేశవశర్మతో ఆఖరిసారి

మా వైజాగ్‌కి తంగిరాల కేశవశర్మగారు, యల్.ఐ.సి.లో పనిచేస్తూ ట్రాన్స్‌ఫర్ మీద వచ్చారు. ఆయన్ని అమ్మ తన పనిమీద వైజాగ్ ట్రాన్స్‌ఫర్ చేయించింది అనే చెప్పాలి. వైజాగ్ ఆమెకు ఒక ముఖ్యకేంద్రంగా చేసుకోవాలి. అది ఆవిడ మాస్టరు ప్లానులో ఒక భాగం. ఆయన వైజాగ్ వచ్చినప్పటినుంచీ అమ్మ గురించే ఆలోచన. మరో ఆలోచనే లేదు. మా వద్ద డబ్బు వున్నా లేకపోయినా డబ్బు తీసుకుపోయి అనేకచోట్ల పూజాకార్యక్రమాలు నిర్వహించేవారు. నిస్వార్థి అంటూ ఎవరైనా

వున్నారా అని అడిగితే కేశవశర్మగారినే చూపిస్తాను నేను. అందరూ బాగుంటే చూసి సంతోషిస్తాడు. ఆయన ఇంట్లో సరైన కుర్చీ బల్ల కూడా వుండదు.

2 నెలల క్రితం ఒకరోజు ఫోన్ చేశారు కేశవశర్మగారు. "స్వామీ ! నీకు ఒంట్లో బాగుండలేదుట చూడటానికి వస్తున్నానని" చాలా సంతోషించాను. అమ్మ బిడ్డల ప్రేమకు అవథులు లేవు అలాగని అందరూ అలా వుంటారా? లేదు. అదే కేశవశర్మగారి ప్రత్యేకత. ఆయనకు ఆయనే సాటి. నా భార్య కుసుమ కంటికి ఆపరేషన్ చేయించుకుంది, నేను చూస్తే ఇలా ఉన్నాను. అందుకేనేమో రాత్రి శరభలింగం గారింట్లో దిగి మర్నాడు ఉదయం 10 గంటలకు మా ఇంటికి చేరారు. ఆయన ఉన్నంత సేపు చాలా చక్కగా కష్టసుఖాలు ముచ్చటించుకున్నాం. నేను ఆఫీసుకు బయలుదేరాను, ఆయన నన్ను వారించారు. ఆరోగ్యం బాగా చూసుకో. మీ షర్టు గుండీ సరిగా పెట్టుకోవయ్యా. ఎంత చిక్కిపోయావో చూడు. ఆ ఛాతి ఎండిపోయింది జాగ్రత్త" అని ప్రేమ తిట్లు. నేను చలించిపోయాను. ఆయన మధ్యాహ్నం తిరిగి బాపట్ల వెళ్ళిపోయారు.

మే నెలలో కుసుమ మా దగ్గర బంధువుల పెళ్ళికి చెన్నై వెళ్ళింది. వచ్చేటప్పుడు బాపట్లలో దిగి జిల్లెళ్ళమూడిలో ఒక పూట వుండటానికి అన్ని ఏర్పాటు జరిగిపోయాయి. కానీ ఆ రోజు మే 26 పినాకినీ బాపట్ల 7-30కి రావల్సింది 2 గంటలు లేటు. చీకట్లో ఒక్కతే జిల్లెళ్ళమూడి వెళ్ళటం ఎందుకని శర్మగారికి ఫోన్ చేశాను" నీ కెందుకయ్యా నేను చూసుకుంటాను, నిశ్చింతగా వుండు" అని అభయమిచ్చారు శర్మగారు. అదే నేను ఆఖరి సారి ఆయనతో మాట్లాడటం పట్టుమని పదిరోజులు కాకుండా తొందరపడి వెళ్ళి అమ్మలో ... ఆ షాకు నుంచీ తిప్పుకోవటం చాలా కష్టమైపోయింది. *జులై, 2010*

22. హైమానుగ్రహం

వైజాగ్ మందిరంలో అమ్మ వంక చూస్తున్నప్పుడు ఎక్కువగా కేశవశర్మగారే గుర్తుకు వస్తున్నారు. ఇంక ఆయన కనబడరు. ఈ విషయాన్ని జీర్ణించుకోవటం చాలా కష్టం. నాకు తెలిసినంత వరకూ అహర్నిశలూ అమ్మ గురించి ఆలోచించేవారిలో ఆయన ఒకరు. మొన్న కె.బి.జి.గారిది, పొత్తూరి వారి పుస్తకాలు

చదివాను. అందరూ మహానుభావులే. అందరూ అమ్మ సేవలో మునిగినవారే. ఒక్కొక్కరిది ఒక్కొక్క పాత్ర.

రాచర్లవారు అయితే గుళ్ళు గోపురాలు అద్భుతమైన నిస్వార్థసేవ. అమ్మ ఆయనకు ఆ విధంగా అవకాశమిచ్చింది. రామకృష్ణ అన్నయ్య విద్యాలయాలు పి.యస్.ఆర్.కు విశ్వజనని సంపాదకుడిగా- వ్రతాలు పూజలు చేయించే విధంగా, ధర్మసూరి, రాముా భక్తులకు కావలసిన అవసరాలను పరిరక్షించటం, నాదెళ్ళ లక్ష్మణరావుగారి దంపతులకు పూర్తిగా అక్కడే స్థిరనివాసమేర్పరచింది. రాజగోపాలరావుగారు హాస్టల్ కట్టడాలు, చక్కా శ్రీమన్నారాయణచేత జిల్లెళ్ళమూడిలో అనేకులకు గృహాలు. అలా జిల్లెళ్ళమూడి అమ్మ చెప్పినట్లు 7వ మైలు రాయి వరకూ విస్తరించినా ఆశ్చర్యపోనవసరం లేదు. అందరూ మహానుభావులే. అంతా అమ్మ మాయాజాలంలో వారే.

సద్గురు శివానందమూర్తిగారు చెప్పినట్లు “అమ్మ ఆదిశక్తి. కాళీ అవతారం. ప్రేమస్వరూపిణి. మనని ప్రేమించి, లాలించి మనకి జన్మరాహిత్యం ప్రసాదించటానికే ఆవిడ జిల్లెళ్ళమూడి కార్యక్షేత్రంగా ఎంచుకుంది. ఇది సత్యం. ఆమెను కొలిచిన ప్రతివారికి అసలైన సుఖాలు ప్రసాదిస్తోంది. కోరికలు నెరవేరుస్తోంది. ఇంక హైమక్క సంగతి చెప్పనే అక్కరలేదు. తలచినంత మాత్రానే రెక్కలు కట్టుకు వాలిపోతుంది.

ఏరోజుకారోజు ఒక వింత. ఆశ్చర్యం. మా మందిరంలో రోజూ ఎంతోమంది వస్తూనే వుంటారు. కొందరు ప్రదక్షిణలు, కొందరు పారాయణలు. మరి కొంతమంది బయట నుంచే నమస్కరించేవాళ్లు. అందరి కోరికలను ఆమె తీరుస్తుంది. కష్టాల కొలిమి నుంచీ బయట పడవేస్తుంది. అనేకమంది కాలేజీ సీట్లు, పెళ్ళిళ్ళు, ఒకటేమిటి అనేక కోరికలను నెరవేరుస్తుంది. ఈ మధ్య జరిగిన ఒక సంఘటన.

మందిరానికి దగ్గరగా వృద్ధాశ్రమము వుంది. అందులో చాలామంది పిల్లలు విదేశాల్లో వుండటంవల్ల వీరు ఆశ్రమంలో నివాసం. చాలామందిది ఇదే కథ. ఆ ఆశ్రమంలో పనివాళ్ళను సప్లయి చేసే కంపెనీలు. వారి ఇంట్లో పనిచేయటానికి కూడా ఏర్పాటు చేస్తారు. ఆ కంపెనీకి 6 వేలు కడితే 3 వేలు ఆ పనిపిల్లకి ఇస్తారు. ఒక వేళ ఆమె రాకపోయినా మళ్ళీ ఇంకొకళ్ళని పంపిస్తారు.

అలా పనిచేసే ఒక అమ్మాయి రోజూ మందిరానికి వచ్చి అమ్మకు దణ్ణం పెట్టుకొని పనికి వెళ్తుంది. ఆమెకు తండ్రి లేదు. ఈమె పంపే 3 వేలే తల్లికి ఆధారం. ఆపిల్లకు అవసరమైన మందులు ఇస్తుంటాను.

ఒక రోజు ఆ పిల్ల మందిరంలో విచారంగా కూర్చుంది. ఎందుకు అలావున్నావంటే ఇక్కడ నేను పని చేస్తున్న ముసలాయన చనిపోయారు. ఆమె పిల్లల దగ్గరకు వెళ్ళిపోతుందని నన్ను వేరే చోట చూసుకోమన్నారు. ఇంక అమ్మను దర్శించుకోవటానికి వీలవదని చాలా బాధపడింది. ఒక నెల గడువు ఇచ్చారని" చెప్పింది. హైమక్క నామం చేసుకోమన్నాను. హైమక్క తప్పక ఆమె సమస్యకు పరిష్కారం చూపిస్తుందని నా ధృఢ విశ్వాసం.

గడువు అయిపోవటంతో ఆ అమ్మాయిని వేరే చోటికి పంపించేసారు. శెలవురోజు వచ్చి అమ్మను దర్శించుకొని మందులు తీసుకువెళ్లేది. ఒక రోజు అకస్మాత్తుగా వచ్చేసి జిల్లెళ్ళమూడి వెళ్లాలని వుంది. ఎలా వెళ్ళాలని ఆరా తీయటం మొదలుపెట్టింది. ఏమిటి విషయం ? అని నా ప్రశ్న. తను పనిచేసిన పాతవాళ్ళు బ్రతిమిలాడి మళ్ళీ పనిలో పెట్టుకున్నారని, జీతం పెంచారని ఆమె వున్నంత వరకూ ఆమె దగ్గరే వుంచుకుంటారని అమితమైన సంతోషం వెలిబుచ్చింది. ఇంత సడన్‌గా ఈ మార్పు ఎలా వచ్చిందని అడిగాను. మొన్న మధ్యాహ్నం 1 గంట అమ్మ దగ్గర ఒక్కతే కూర్చుని మొరపెట్టుకుందిట. మర్నాడే అనేక కబుర్లు, ఫోన్లు చేసి ఆ అమ్మాయిని రమ్మని, ఆ పిల్లలేకుండా ఆ పెద్దావిడ వుండలేకుండా వున్నారని. అంతా అమ్మదయ అని సంబరపడింది. నేను ఆశ్చర్యపోయాను. వెంటనే కేశవశర్మగారే గుర్తుకు వచ్చారు.

మరి అమ్మ ఆయన కోరిక తీర్చటానికి ఎందుకు జాప్యం చేస్తోంది. పంచాయతనం, శ్రీ చక్రం అమ్మ గుళ్ళో పెట్టాలని ఆయన చిరకాలవాంఛ. ఆ ఒక్క కోరికా తీర్చలేదా? అమ్మ ఆదిశక్తి అని మనందరికీ తెలుసు. హైమక్కకి అమ్మ శక్తిపాతం చేసిందంటే "నాశక్తి ఒకరికిస్తే తరిగేది కాదని" అమ్మే స్పష్టం చేసింది కదా! ఆ విగ్రహానికి అనేక పూజలు చేస్తాం ? అనేక అలంకరణలు చేస్తాం. సర్వశక్తిమయీ అని పారాయణలు చేస్తున్నాం. ఆ గుడిలో పంచాయతనం పెట్టటం వల్ల అమ్మకేమి నష్టం ? అమ్మకు శక్తిని ఇవ్వగలవాళ్ళం, తీసివేసేవాళ్ళం

మనమా ? అంతా మన భ్రమ. అమ్మా ! చేతులెత్తి ప్రార్థిస్తున్నాను. ఆ శర్మగారి చిరకాలవాంఛను తీర్చి ఆయన ఆత్మకి శాంతిని చేకూర్చమ్మా! ఆయన నీ ఒడిలోనే ఆడుకుంటున్నాడు. నీ గుడిలో పంచాయతనం ఏర్పాటు చేసుకో తల్లీ ! మేమందరం సంతోషిస్తాం. ప్లీజ్... జయహోమాతా !

ఆగష్టు, 2010

23. అమ్మ ప్రామిస్

మా విశాఖమందిరంలో కూర్చున్నంత సేపూ అమ్మతో గడిపిన మధురక్షణాలు, మాటలు గుర్తుకు వస్తూనే ఉంటాయి. ఒక సందర్భంలో చొరవ తీసుకొని "వైజాగ్ రా అమ్మా" అని అభ్యర్థించాను. "వస్తా నాన్నా!" అన్నది అమ్మ. నేను "ప్రామిస్" అన్నాను. అమ్మ 'ప్రామిస్' అన్నది. తర్వాత ఎన్ని సందర్భాలలో ఆ ప్రస్తావన తెచ్చినా అమ్మ వద్ద నుండీ సమాధానం లేదు.

అమ్మ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ విషయమై పూర్ణానందస్వామివారిని సంప్రదించాం. దానికి వారు "వారి ఆర్తి, ఆవేదనలకే అమ్మ వేంచేసింది. విగ్రహ ప్రతిష్ఠ మీరే చేసుకొని నిత్యం చేసే పూజలు, పారాయణలు చేసుకోమని" ఆదేశం. అమ్మ ఆ చిన్నమందిరంలో వచ్చి కూర్చుంది. అక్కడ ప్రతినిత్యం ఏదో ఒక వింతే. పాతవారు మందిరం చుట్టుప్రక్కల వున్నవారు రాలేకపోతున్నారు. మందిరం దగ్గర్లో వున్న వాళ్ళు మరీ దూరమవుతున్నారు. ఎక్కడెక్కడి నుంచో గాజువాక, మర్రిపాలెం చాలా దూరాల నుంచీ వచ్చిన వాళ్ళు వారి అనుభవాలు చెప్తుంటే ఒళ్లు పులకరించి పోతుంది.

వృద్ధాశ్రమంలో ఒరిస్సా అమ్మాయిని అమ్మ అనుగ్రహించిన తీరు రాశాను కదా ! మధ్యలో 2 నెలలు ఆ అమ్మాయి కనిపించలేదు. మళ్ళీ మొన్న సాయంత్రం ప్రత్యక్షమయింది. ఆ పిల్లని ఆ ఇంటి ఆమె బొంబాయిలో వాళ్ళ పిల్లల దగ్గరికి వెళ్తూ తీసుకు వెళ్లిందిట. ఆ రెండు నెలలు బొంబాయిలో హాయిగా గడిచిపోయిందిట. ఆ పిల్ల ఎప్పుడూ అమ్మ ఫోటోను బాగ్‌లో పెట్టుకొని అమ్మ, హైమక్కల నామం చేస్తూనే వుంటుంది.

బొంబాయికి షిర్డీ దగ్గరే కదా అని ఆ పిల్ల బస్సులో షిర్డీకి వెళ్ళి బాబా

దర్శనం చేసుకొని తిరిగి బొంబాయి వచ్చేసింది. అప్పుడు రాత్రి 10-30 ని.లు అయింది. ఇంటికి బస్‌స్టాండ్‌కు చాలా దూరం. ఆడపిల్ల ఒక్కతే ఆటోలో కానీ టాక్సీలో రావటం కాని సేఫ్ కాదు. బస్సులో చాలా సమయం పడ్తుంది. కానీ ఏమి చేయాలో పాలుపోక అమ్మ నామం చేస్తోంది. ఆ బస్సుస్టాప్‌లో ఒక అబ్బాయి కన్పించాడుట. ఆ పిల్లవాణ్ణి తన ఎడ్రస్ చెప్పి బస్సు ఎక్కాలని అడిగిందిట. ఆపిల్లవాడు "నేను కూడా అటే వెళ్ళాలని" చెప్పి బస్సులో తోడు వెళ్ళి ఆ అమ్మాయిని ఇంటి వద్ద దింపాడుట. రాత్రి 1.30 అయింది. ఆ అమ్మాయి ఇంటి వద్ద గేటులోపలికి వెళ్ళి వెనక్కి తిరిగి చూస్తే ఎవ్వరూ కనిపించలేదట. ఆ పిల్లవాడు మాయం. ఆ పిల్లకి అంతా అయోమయం అయింది. అమ్మే ఆ రూపంలో వచ్చి తన్ని కాపాడిందని ఆ పిల్ల పరిపూర్ణ విశ్వాసం. ఈ కథ చెప్తూనే ఇంకో విషయం చెప్పింది.

ఆ పిల్ల అన్నగారు హైద్రాబాద్‌లో వుంటున్నాడు. ఏదో ప్రైవేటు కంపెనీలో పనిచేసేవాడు. కొంతకాలం నుంచి మతిస్థిమితం లేక భార్యను కొట్టడం, పనికి వెళ్ళకపోవటంతో వైజాగ్ తీసుకు వచ్చి పిచ్చి ఆసుపత్రిలో వైద్యం చేయించి, అమ్మ దర్శనం చేయించి, నా దగ్గర మందు తీసుకొని హైద్రాబాద్ వెళ్ళాడు. ఇప్పుడు అతను చక్కగా ఉద్యోగం చేసుకుంటున్నాడు. అతని భార్య గర్భిణి. ఇదంతా అమ్మ దయ, అనుగ్రహం కాకపోతే మరి ఏమిటి ?

అమ్మ వైజాగ్ వస్తానని చేతిలో చేయివేసి ప్రామిస్ చేసి ఆ మందిరంలో మన కోసం వచ్చి కూర్చుంటే పాదాలను అర్చించుకోలేకపోవటం మన దురదృష్టం. జిల్లెళ్ళమూడిలో గజేంద్రమ్మక్కయ్య చెప్పిన మాటలు గుర్తుకు వస్తున్నాయి. ఒకరోజు నిస్పృహతో గజేంద్రమ్మక్కయ్య కొట్టు దగ్గర నులకమంచం మీద పడుకున్నాను. ఎందుకలా వున్నావని" అక్కయ్య అడిగింది. "ఎంత చెప్పుకున్నా అమ్మ కరుణించటం లేదు. ఇంక రాన"న్నాను. "ఏమయ్యోయ్, ఆపైవాడు మాయలోడు. వదలబాక. చాలా ఏడిపిస్తాడు. చివరికి అందలం ఎక్కిస్తాడు" ఆ మాటలే మారు మ్రోగుతుంటాయి. అమ్మా ! నిన్ను వదలను, వదలను అమ్మా ! అనుగ్రహించమ్మా... జయహోమాతా...

అక్టోబర్, 2010

24. షిర్డీసాయి ఆరోగ్య ప్రసాదం

వైజాగ్‌లో అమ్మ మందిరానికి దూరంగా మా నివాసానికి, ఆఫీసుకు 2 సరికొత్త ఫ్లాట్స్ ఏర్పాటు చేసింది. మాకు అన్ని విధాలా, అన్ని సదుపాయాలు చక్కగా ఏర్పడ్డాయి. కానీ మా ఇద్దరికీ అమ్మకు దూరమయ్యామన్న దిగులు ఎక్కువైంది. ఎప్పుడూ మందిరం గురించే ఆలోచనే! ఉదయం 10 కి.మీ. దూరం నుండి వచ్చి మా పాత వంటావిడ లక్ష్మి దీపారాధన చేసి అమ్మ అష్టోత్తరం చేసి నైవేద్యం పెడ్తుంది.

మధ్యాహ్నం 12 గంటలకు కుసుమ స్వయంగా వంటచేసి కార్లో వెళ్ళి అమ్మకు మహానైవేద్యం పెడ్తుంది. శ్రీ సూక్తం, లలితా సహస్రనామపారాయణ, త్రిశతి, ఖడ్గమాల, అమ్మ అష్టోత్తరంతో అమ్మను అర్చించుకొని 1 గంటకు తిరిగి వస్తుంది. ప్రతి సాయంత్రం 6-30 నుంచి 8 గంటలకు అమ్మ దగ్గర నా కార్యక్రమాలు ముగించుకొని తృప్తిగా ఇంటికి వస్తాను. ప్రతి శుక్రవారం, అమావాస్య, పూర్ణిమలకు 6 గంటల నుంచీ 8 గంటల వరకూ సామూహిక పూజలు నిర్వహించు కుంటున్నాము.

మేము అశోక్‌హౌస్‌లో వుండకపోవటంతో బయటనుంచే అనేకమంది రోడ్డు మీద చెప్పులు విడచి అమ్మకు నమస్కారం చేసుకుంటున్నారు. కొంతమంది లోపలికి వచ్చి ప్రదక్షిణలు చేసుకొని నమస్కరించుకొని వెళ్ళటం పరిపాటి అయింది.

ఈ ఏడాది మొదటి నుంచీ ఆరోగ్యం సరిగా లేక బాధలు ఎక్కువయ్యాయి. నాదీ, నాభార్య కుసుమదీ ఒకటే నక్షత్రం. జాతక రీత్యా కష్ట సుఖాలు ఇద్దరికీ ఒకేసారి. ప్రతి క్షణం అమ్మ నేను వున్నానంటూ కాపాడుతూనే వున్నదని నిరూపించే సంఘటనలు అనేకం. అందులో ఒక సంఘటన.

నా భార్య కుసుమకు సడన్‌గా బి.పి. పెరిగి పోయింది. ఉన్నట్లుండి నిలువునా క్రిందపడడం 2సార్లు జరిగింది. అమ్మ తన చేతుల్లోకి తీసుకొని కాపాడటం జరిగింది. అంతలా పడ్డా తలకు దెబ్బ తగలటం కాని, కాళ్ళు చేతులకు నడుం ఎటువంటి ఇబ్బందీ లేకపోవటం అమ్మ దయే కారణం. వెంటనే కేర్ ఆసుపత్రి డాక్టరు సి.వి.రావు గారి దగ్గరకు తీసుకు వెళ్ళాం. ఆయన సద్గురు శివానందమూర్తిగారి శిష్యులు. వారికి ఆయనే దైవం. వేరే ధ్యాసలేదు.

వారు పరీక్ష చేసి హార్టు బాగుంది కానీ బి.పి. బాగా పెరిగిందని నిర్ధారణ చేసి తను వాడుతున్న మందులకు 4 రెట్లు మందులు పెంచారు. బి.పి. తగ్గింది కానీ నీరసం బాగా పెరిగింది. ఏమి చేస్తుందో కూడా తెలియని పరిస్థితి.

మరి నా వరకూ వస్తే మళ్ళీ పాత బాధ. కడుపు పొంగిపోవడం, ఆకలి వుండదు. నీరసం తట్టుకోలేని పరిస్థితి. మందిరంలో కూర్చుని అమ్మకు మొరపెట్టుకున్నాను. మళ్ళీ పాతరోజులు గుర్తుకు వచ్చాయి. ఒక రోజు అమ్మ దగ్గర కూర్చుని ఏడ్చాను. పొట్టమీద చేయి వేసి రాస్తూ ఎసిడిటీ నాన్నా! అని ఓదార్చింది. అక్కడ నుంచీ అమ్మ నన్ను, కుసుమను షిర్డీ వెళ్ళమనటం గుర్తుకు వచ్చాయి.

ఆరోజు అక్టోబరు 2. సెలవురోజు. ఆఫీసులేదు. నీరసం, కడుపు బాధ ఎక్కువగా వుంది. సాయంత్రం ఒక్కడినే కూర్చుని బాధతోనే నామం చేసుకుంటున్నాను. ఇంతలో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వారు రోజూ మందిరంలో 10 నిమిషాలు కూర్చుని ధ్యానం చేసుకుంటారు. వారికి అమ్మ పుస్తకాలు కుసుమ రాసినవి ఇవ్వటం జరిగింది. వారు నా చేతిలో షిర్డీసాయి బాబా ప్రసాదం, 2010 సం॥ కాలెండర్లు పెట్టారు. ఆశ్చర్యం, ఆనందం చెప్పనలవి కాదు.

వారు చెప్పటం మొదలు పెట్టారు. విశాఖపట్టణం సిటీ అవతల 'అరిలోవ'లో బాబామందిరం చిన్నది కట్టుకున్నారట. రోజూ అమ్మను దర్శించుకొని అక్కడికి వెళ్లి పూజాకార్యక్రమాలు నిర్వహిస్తుంటారట. వారి నివాసం పెద్ద వాల్తేరులో రోజూ లాగానే అమ్మను దర్శించుకొని పది నిమిషాలు ధ్యానం చేసుకుంటున్నప్పుడు అమ్మ వచ్చి వారి ముందు నిలబడిందిట వారు పాదాభివందనం చేసుకున్నారు. ఆ రోజు నుంచీ వారికి అమ్మ మీద భక్తి ఎక్కువై పోయింది. వారు మండల దీక్ష 'బాబా' ది తీసుకొని దీక్షానంతరం షిర్డీ వెళ్ళి వచ్చారు. వారు నన్ను గుర్తు పెట్టుకొని ప్రసాదం తెచ్చి చేతిలో పెట్టారు. కళ్ళ వెంట నీళ్ళు వచ్చాయి. అమ్మా! నీవు ఎంత దయామయివమ్మా! నీవు అమ్మాయి షిర్డీ వెళ్ళమన్న పలుకులు గుర్తుకు వచ్చాయి. నా సంతోషం చెప్పలేను. రెండు రోజుల్లో అన్నీ బాధలు చేతితో తీసివేసినట్లు మాయం. ప్రతిక్షణం మనల్ని అంటి పెట్టుకొని రక్షిస్తోందని చెప్పుకోవాలా ! అమ్మా ! మా తప్పులు మన్నించి రక్షిస్తూ వుండు తల్లీ.

నవంబర్, 2010

25. అమ్మ చిత్రం జరిగిన విచిత్రం

మా వైజాగ్ మందిరంకు అనేకమంది వస్తుంటారు. కొంతమంది మందులకోసం, మరికొంతమంది అమ్మను కొలుచుకోవటానికి ఈ మధ్యన ఒక కొత్త వ్యక్తి తరచూ రావటం జరిగింది. ఒక రోజు వారి పరిచయం కోరటం జరిగింది. వారు తమిళులు. ఉద్యోగానంతరం వైజాగ్‌లో సెటిల్ అయ్యారు. వారు పుట్టపర్తిలో 12 సంవత్సరాలు బాబాగారి దగ్గర చదువుకున్నారు. బాబాగారే ఆయనకు 'సాయిరామ్' అని పేరుపెట్టారు. వారికి అమ్మకలలో దర్శన మిచ్చిందిట. వారి నివాసము మా మందిరంకు వెనకాలే. ఇక్కడకు వచ్చాక మొదటిసారిగా కలలో కనిపించిన అమ్మ దర్శనం చేసుకున్నారు. అది మొదలు తరుచూ అమ్మ దగ్గరకు వచ్చేవారు.

ప్రతిక్షణం అమ్మ వారి వెంటనే వుండి అనుగ్రహిస్తోంది. వారు అమ్మ ఫోటో కావాలంటే అమ్మ నామం హైమ నామంతో మేము వేయించిన చిన్నఫోటోలు మూడు లెక్కబెట్టి మరీ ఇచ్చాను. వారం రోజుల తరువాత చూచుకుంటే 4 ఫోటోలున్నాయని ఆశ్చర్యంగా చెప్పారు. ఈ మధ్య వారు కుటుంబంతో మద్రాసు వెళ్ళవలసి వచ్చింది. కానీ రిజర్వేషన్ దొరకలేదు. స్టేషన్‌కు వెళ్ళి అక్కడ టి.టి.ని ప్రాధేయపడ్డారు. ఖాళీలేదని ఖచ్చితంగా చెప్పారు. సాయిరామ్‌గారు కొంతసేపు అక్కడ వుండి నిస్పృహతో వెనక్కి తిరిగారు.

ఇంతలో ఎవరో వచ్చి టికెట్లు కాన్సిల్ చేసుకోవటంతో టి.టి.వెనక్కి పిలిచి మరీ బెర్త్‌లు ఇచ్చాడు. వారు హాయిగా రైలులో కూర్చుని అమ్మకు కృతజ్ఞతలు చెప్పటానికి జేబులో నుంచీ ఫోటోలు తీస్తే 4 కాస్తా ఐదు ఉన్నాయట. వారు ఆనందాశ్చర్యాలతో పొంగి పోయారు. అమ్మకు ఎంత ప్రేమ. ఎంత అనుగ్రహం. ఇంకా అనేక వింతలు చెప్పారు. అమ్మకు అందరూ బిడ్డలే కదా! ఆ మూలమందిరంలో వుండి ఎంత మందిని ఉద్ధరిస్తోందో ! అమ్మ, హైమల అనుగ్రహం ఇంతింత అని చెప్పటానికి మాటలు చాలవు. ప్రతివారికి హైమక్క నామం చేసుకోమని సలహా ఇస్తుంటాను. తలచిన వెంటనే హైమక్క రెక్కలు కట్టుకొని వాలి అనుగ్రహిస్తుంది.

మా ఆఫీసులో పనిచేసే రాజ్యలక్ష్మి, వాళ్ళ అమ్మ హైమక్క అమ్మను కొలుస్తున్నవారే. క్రిందటి సంవత్సరం ఆమెకు పెళ్ళి అయింది. అమ్మ అనుగ్రహం వల్ల మంచి భర్త లభించాడు. క్రిందటి నెల ఆమె ప్రసవించింది. చక్కటి ఆడపిల్ల పుట్టింది. ఆసుపత్రిలో పురిటికొరకు చేరిన తరువాత కొద్దిసేపు నొప్పులు రావటం. ఆగిపోవటంతో చాలా బాధపడింది. చివరకు ఆపరేషన్ చేయాలనే పరిస్థితి వచ్చింది. నేను ఫోను చేసి హైమక్క నామం చేసుకోమని చెప్పాను. అంతమటుకు నొప్పులతో బాధపడినా ఆపరేషన్ అవసరం లేకుండా నార్మల్‌గా ప్రసవించింది. అంతా హైమక్క అనుగ్రహమే అని వారి విశ్వాసం. ***(డిసెంబర్, 2010)***

26. రాజేష్‌ను ఎంచుకుంది

వైజాగ్ మందిరంలో ఈ మధ్య చాలా మార్పులు జరిగాయి. నా అనారోగ్యం వల్ల ఉదయం అమ్మపూజా కార్యక్రమానికి వెళ్ళటం కష్టమైపోయింది. దానికి తోడు మందిరం దూరమయింది కదా! గత ఏడాది నుంచి మా వంట అమ్మాయి లక్ష్మి రోజు ప్రొద్దున్నే వెళ్ళి దీపారాధన, పూజ నిర్వహించేది. ఆమె వూరికి దూరంగా వున్న మధురవాడనుంచి వచ్చేది. ప్రయాణమే 1 గంట పడుతుంది. ప్రతినెల ఆమె నెలసరి 4 రోజులలో నేనే వెళ్ళేవాడిని. అమ్మ మందిరంలో వున్న అశోక్‌హౌస్‌లో వున్నప్పుడు అనేక ఫోటోలను చేయించుకున్నాను. రెండు పెద్ద ఫోటోలు వుండేవి. మేము అశోక్‌హౌస్ ఖాళీ చేసే ముందు ఒక పెయింటింగ్ బాగా రంగులు పోయి ముడతలు వచ్చాయి. రిపేర్ చేయించటానికి మందిరంలో పెట్టాను. మా బిల్డింగ్‌లోనే ఏకా రాజేశ్వరరావుగారి రెండో అబ్బాయి ఏకారంగారావు వుండేవాడు. అందులోనే కరస్పాండెన్స్ కోర్సులో అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేసిన డాక్టర్ రవిబాబుగారుండేవారు. మందిరంకు దగ్గరగా వుండాలన్న ఉద్దేశంతోనే వారు అక్కడకు వచ్చారు. అది ఖాళీ చేయించటంతో వాళ్ళకు దగ్గరలోనే అద్దెకు దొరికాయి. మా నివాసం మాత్రం కొంతదూరమైంది.

అమ్మ పెయింటింగ్ ఏకారంగారావుగారు లామినేట్ చేయించి ఇంట్లో చక్కగా అమర్చుకున్నారు. దాని వద్దే కూర్చుని ఆరాధించుకునేవారు. రంగారావు ఆరోగ్యం సరిగా లేక బాధపడ్తుండేవారు. కడుపులో మంట ఓర్చుకోలేక బాధపడలేకుండా వున్నానమ్మా" అని రోదిస్తుంటే దాదాపు 2 సంవత్సరాల క్రితం

అమ్మ ఆయన్ని అనుగ్రహించి తనలో ఐక్యం చేసుకుంది. వారికి ఒక్కడే కొడుకు రాజేష్. యోగ్యుడు. జాగ్రత్తగా చదువుకుంటూ బి.కాం.పూర్తిచేసాడు. భార్య కరుణ. రంగారావుగారికి వాళ్ళనాన్నగారు ఏకా రాజేశ్వరరావుకు సంగీతంలో ప్రావీణ్యం వుంది.

రాజేష్ కూడా గిటారు, కీబోర్డు వాయించేవాడు. కచేరీలు కూడా చేసాడు. అమ్మ అనుగ్రహించింది. అతను దాదాపు రెండు నెలలుగా ఉదయమే మందిరంకు వెళ్ళి అమ్మను అర్చించుకుంటున్నాడు. మావంట అమ్మాయి లక్ష్మివాళ్ళ బావగారు మరణించడంతో తనకు రావటానికి వీలవనందున మందిరం దగ్గరగా వుండటంతో రాజేష్ శాస్త్రోక్తంగా అమ్మకు పూజ చేసుకుంటున్నాడు. నాకు ఎంతో భారం దిగిపోయింది. అందరం పెద్దవాళ్ళం అవుతున్నాము. ఓపికలు తగ్గుతున్నాయి. తరువాతి తరం వాళ్ళు రావాలని కేశవ అన్నయ్య పరితపించేపోయేవాడు. అమ్మ కేశవన్నయ్య కోరిక మా కోరికనూ మన్నించింది. రాజేష్‌ను అనుగ్రహించింది.

అంజన్ కూతురు పెళ్ళికి వెళ్ళినప్పుడు మర్నాడు కుసుమ జిల్లెళ్ళమూడి వెళ్తూ ఏకా రాజేవ్వరరావుగారి మనవలను చరణ్, రాజేష్‌లను జిల్లెళ్ళమూడికి తీసుకువెళ్ళింది. అక్కడ దేవాలయాలను దర్శించుకున్నాడు. పులకరించిపోయాడు. అమ్మను ఇంకా ఇంకా ఆరాధించు కోవాలన్న తపన పెరిగిపోయింది. "రోజూ నేనే ఉదయం పూజ చేసుకుంటానని వాళ్ళ అమ్మ కరుణతో కబురుచేసాడు. మాకు ఓపిక తగ్గిపోతున్న తరుణంలో అమ్మ రాజేష్‌ను ఎంచుకుంది.

సాయంత్రం ఇంట్లో సంగీతం క్లాసులు చెప్పకుంటూ ఇటు అమ్మపూజ చేయటం మామూలు విషయం కాదు కదా! వాళ్ళ అమ్మా మేము సాయంత్రం మందిరంలో ఎంతో తృప్తిగా, ఆనందంగా కొల్చుచుకుంటున్నాము. ఈ రకంగా అమ్మ క్షణక్షణం మమ్మల్ని కాపాడుతూనే వున్నది. *జనవరి, 2011*

27. అమ్మ మందు

అమ్మ అనుగ్రహం, దయా,ప్రేమ ఏమని వర్ణించ గలము. మనం చాలా అదృష్టవంతులం. అమ్మని కొలవని వారు దురదృష్టవంతులే అని చెప్పటానికి వెనకాడకూడదు. విశాఖమందిరంలో అనేక అద్భుతాలు జరుగుతున్నాయి. ఏకా

రాజేష్ ఎమ్.బి.ఎ. చదువుతూ, గిటారు క్లాసులు చెప్పుకుంటూ అమ్మకు ఎనలేని సేవ చేసుకుంటున్నాడు.

అలాగే అనేకమంది. చాలామంది హోమియోపతి మందుకి మందిరానికి వస్తారు. అమ్మ దర్శనం చేసుకొని మందు తీసుకుంటే నయమవుతుందని వారి నమ్మకం. లాసన్స్ బే కాలనీలో మారుతీ మామ్మగారు వున్నారు. ఆమె హనుమదుపాసకురాలు. ఆవిడకు 80 సంవత్సరాలు పైనే వుంటుంది. వాళ్ళ ఇంటిపేరు "మారుతీ నిలయం". ఆవిడ అహర్నిశలు ఆంజనేయస్వామిని కొలుచుకునేది.

ఆవిడకు చూపు తగ్గితే వాళ్ళ పిల్లలు నా దగ్గరకు వచ్చి మందు తీసుకు వెళ్ళేవారు. క్రిందటి సంవత్సరం ఆవిడ స్నానాల గదిలో జారిపడటంతో కాలు విరిగింది. డాక్టర్ కట్టు వేశారు. కానీ ఆమె వేరే ఇంగ్లీషు మందులు ఏమీ వాడేది కాదు. అమ్మ మందిరంలో హోమియో మందు తీసుకునేది. ఆ తరువాత ఆమెపని ఆమె చేసుకుంటూ వుండేవారు. ఆ తరువాత నీరుడు ప్రాబ్లమ్ వచ్చింది. దానికి కూడా నా దగ్గరే మందు వాడేవారు. ఎంత బాధ వున్నా, చూపు తగ్గినా, నీరుడు కాకపోయినా అమ్మ మందిరంలో తీసుకున్న మందే పనిచేసేది. అమ్మను ప్రార్థించే మందు ఇచ్చేవాడిని. అమ్మే చూచుకునేది. ఈ మధ్య ఆవిడ పిల్లలందర్నీ పిలిపించుకొని, వెళ్లిపోతున్నానని, చాప వేయించుకొని ఏ బాధపడకుండా రామనామం చేస్తూ స్వర్గస్థురాలయింది. అంతటి భక్తురాలికి సేవచేసుకున్న అదృష్టవంతుణ్ణి, అంతా అమ్మదయ.

అలాగే ఒక ఆర్.టి.సి.డ్రైవర్ కూతుళ్ళు ఇద్దరూ మందుకు వచ్చేవారు. పెద్దపిల్లకు మాటలు సరిగా రావు. చేతలు శూన్యం. ఆ పిల్ల చాలారోజులు మందులు తీసుకుంది. ఆశ్చర్యం ! ఆమెకు మాటలు రావటమే కాక హాయిగా వుంది. చిన్నపిల్ల ప్రసన్న. అమ్మగుడిలో చాలాకాలంగా ప్రదక్షిణాలు చేసుకుంటుంటే హైమక్క నామం కూడా చేసుకోమని సలహా ఇచ్చాను. హైమ అనుగ్రహించింది. ఆ అమ్మాయి ఎమ్.సి.ఎ. చేసింది. సాఫ్టువేర్ కంపెనీలో జాబ్ వచ్చింది. 8వేల రూపాయల జీతం. వాళ్ళ సంతోషానికి అవధులు లేవు. అమ్మ మందిరంలో ఎంత సాధన చేస్తే అమ్మ అంత అనుగ్రహిస్తుంది అని ఘంటాపథంగా చెప్పగలను. ఇలాంటివి ఎన్నెన్నో అనుభవాలు. ఉదాహరణలు.

సంక్రాంతి పండుగకు 10 రోజుల ముందు అమ్మకాళ్ళు పట్టుకొని కుసుమ ప్రార్థించింది. "అందరూ పండుగకు సున్నాలు, పెయింట్స్ వేసుకుంటారు. నీ మందిరానికి రంగులు వేయించుకోవాలమ్మా!" అని. ఈ సంవత్సరం వర్షాలు ఎక్కువ కావటంతో మందిరం కారిపోతుంటే 8 వేలు పెట్టి బాగుచేయించాను. మా మందిరం గురించి ఎవరినీ డబ్బు అడగటం అలవాటు లేదు. ఫిబ్రవరి 17కు పెయింట్స్ వేయిస్తానని చెప్పాను.

ఈలోగా హైద్రాబాద్‌నుంచీ పటమట నరసింహమూర్తిగారి అమ్మాయి రత్న ఫోను చేసి అక్కయ్యా ! "10 వేల రూపాయలు విశాఖ అమ్మ మందిరానికి పంపిస్తున్నాను. నీకు తోచిన విధంగా ఖర్చుచేయమంది". కుసుమ ఆనందానికి అవధులు లేవు. అమ్మ నా మొర ఆలకించింది అని సంబరపడింది. నరసింహమూర్తిగారి అల్లుడు వి.వి.యస్.రామారావుగారు 10 వేల రూపాయలు పంపించారు. డబ్బు రెడీ అయింది కానీ పండుగ ముందు పెయింట్ వేసేవాళ్ళు దొరకటం కష్టం కదా!

ఇంకో విచిత్రం ఏమిటంటే మా పెద్దమ్మగారి మనమడి పేరు భుజంగరావు. నా దగ్గరికి మందుకు రావటం జరిగింది. అతను కాంట్రాక్ట్సు చేస్తున్నాడుట. మందిరం గురించి చెపితే ఆ ఛాన్సు మాకివ్వండి. నేను చేయించి పెడ్తానని ముందుకు వచ్చాడు. మూడు రోజుల్లో అంతా కంప్లీటు చేశాడు. అమ్మ ఎవరిని ఏ విధంగా అనుగ్రహించి ప్రేరేపిస్తుందో అనూహ్యం. అంతా అయోమయం. ఆశ్చర్యం. అంతా ఒక లీలగా జరిగిపోయింది. మేము మాత్రం విస్తుపోయాము. అమ్మా! మందిరంలో నీవు వచ్చి కూర్చున్నావు, ఎంతమందిని ఉద్ధరించాలో నీకే తెలుసు. మేము ధన్యులం తల్లీ ! ఇలాగే మమ్మల్ని అనుగ్రహిస్తూ సదా నీ సేవచేసుకొని తరించనీ తల్లీ! *ఫిబ్రవరి, 2011*

28. తిరోధానకరీశ్వరి

"అమ్మ కాలస్వరూపిణి. కాళీ, మనని లాలించి, ఆడించి ప్రేమతో అన్నపు ముద్దలు నోటిలో పెడ్తూ తనలో లయం చేసుకోవటానికి ఈ అవనీస్థలిపై అవతరించిన ఆదిశక్తి ప్రేమస్వరూపిణి" అని సద్గురు శివానందమూర్తిగారు జిల్లెళ్ళమూడిలో అమ్మను వర్ణించిన పలుకులు. ఇది అక్షరాల నిజం. ఆమె "సర్వానుల్లంఘ్యశాసనా".

అమ్మను దర్శించుకున్న ప్రతివారికీ ప్రత్యేకానుభూతి. నామటుకు నాకు అంతా అయోమయం. అమ్మ మనల్ని మర్చిపోదు. మనం అమ్మను విస్మరించ కూడదు. మా మందిరంలో అనేకమందికి అనేకానుభూతులు రావటం జరుగుతోంది. ఈ మధ్యనే "షిర్డీసాయి ఛారిటబుల్ ట్రస్టు"వారు అరిలోవలో అధినేత రాంబాబు గారిని అమ్మ అనుగ్రహించటం వారు జిల్లెళ్ళమూడిలో అమ్మను దర్శించుకొని అచ్చటి ఆప్యాయత, ప్రేమ చూచి ముగ్ధులయిపోయారు. 'ఇది భూతల స్వర్గం మేము ధన్యులం' అని వారు చెప్తూ పులకించిపోయారు.

నా చేతిలో చేయి వేసి వచ్చి వైజాగ్‌లో ఆ చిన్న మందిరంలో కూర్చుని, నాకు అనేక విచిత్రమైన అనుభూతులు ప్రసాదిస్తున్న అమ్మ గురించి ఏమని వర్ణించలగను ? అమ్మ నాకు ఎప్పుడు కలలో దర్శనమిచ్చినా, ఏదో ఒక అవాంతరం వచ్చే ముందే ఇస్తుంది. సుస్పష్టం. అమ్మ ముఖంలోనూ, చేతలలోనూ కన్పిస్తాయి.

అమ్మ కలలో కన్పించి కన్నీరు పెట్టుకుంటూ తలపక్కకి తిప్పేసుకుంది. అమ్మ దగ్గరకు వెళ్ళినప్పుడు ఆ కల గురించే అడిగాను. సమాధానం శూన్యం. పక్కనే వున్న రామకృష్ణ అన్నయ్య "అమ్మ నీ బాధను తీసివేసిందని" విశ్లేషించాడు. అమ్మ నోట ఒక్కమాటగానీ, ముఖంలో తేడా గానీ లేదు. కల వచ్చిన నెలరోజుల లోపలే మా అమ్మను తనలో లయం చేసుకుంది.

రెండు నెలల క్రితం మళ్ళీ అమ్మ హడావుడిగా ఎవరితోనో చర్చిస్తూ, ఎవరికో సీరియస్‌గా వుంటే ఎలా వుంటుందో అదే సీను కన్పించింది. ఏం జరుగుతుందో అని మధనపడ్తున్నాను. సరిగ్గా 2 రోజులు కాకుండానే హైద్రాబాద్ నుంచీ మా కజిన్ సిస్టరు గోళ్ళమూడి రాధ వాళ్ళ చెల్లెలి దగ్గరకు వచ్చింది. నెలరోజుల క్రితమే ఆమె భర్త గోళ్ళమూడి గోపాలకృష్ణ మరణించారు. చెల్లెలి దగ్గర ఉందామని వచ్చిన మా రాధ అక్కయ్యకు సడన్‌గా హార్టు ఎటాక్ వచ్చింది. రాత్రి 10 గంటలకు చాలా కంగారు పడ్డారు. ఆసుపత్రికి తీసుకువెళ్ళటానికి కూడా సమయం లేకుండానే భర్తలో కలసిపోయింది.

ఇది జరిగి వారం కాకుండానే మరో అవాంతరం. మా మందిరంలో ఏడాదిపాటు ఉదయం అమ్మను అర్చించుకునే మా వంట అమ్మాయి

లక్ష్మిబావగారికి గొంతు నొప్పిగా వుందని వాల్తేరులో వున్న ఇ.యన్.టి. ఆసుపత్రికి తీసుకు వెళ్ళారు. ఆపరేషన్ చేయాలని నిర్ధారణ చేసారు. ఆపరేషన్ మధ్యలో ఆయనకు హార్టు ఎటాక్ వచ్చింది. వున్నది ఇ.యన్.టి.ఆస్పత్రిలో. హార్టు వార్డు అక్కడ వుండదు గదా ! కె.జి.హెచ్. 4 మైళ్ళదూరం. డాక్టర్లు హడావుడిగా అంబులెన్సులో కె.జి.హెచ్.కి తరలించారు. అంతా గందరగోళం. అంతా కె.జి.హెచ్.కి పరుగులు తీసారు. ఏడ్పులు, ఆందోళన. ఏమి జరుగుతుందో డాక్టరు సరిగ్గా చెప్పలేకపోయారు. 2 రోజులు కె.జి.హెచ్‌లో ఎమర్జన్సీ ట్రీట్‌మెంట్ జరిగింది. తరువాత ఆయన చనిపోయారు. 54 సంవత్సరాల ఆయన పోవటంతో ఆ కుటుంబం అతలాకుతలం అయింది. ఈ రెండు అవాంఛనీయ సంఘటనలు. అమ్మ ముందే కలలో చూపించింది.

అమ్మకు చావు పుట్టుకా సమానమే కదా ! పోతుకూచి రవి పోయినప్పుడు అతన్ని దహనం చేసి వచ్చి వివాహం జరిపిన విషయం విదితమే కదా! అమ్మ సృష్టికర్త్రి బ్రహ్మరూపిణి, గోప్త్రీ, గోవిందరూపిణి, సంహారిణి. రుద్రరూపా, తిరోధనకరీ, ఈశ్వరీ కదా మనందరం ఆమె బిడ్డలం. అందర్నీ తానే దగ్గరకు తీసుకొని చివరకు తన ఒడిలోనే హాయిగా తీసుకుంటుంది. ఇక్కడా, అక్కడా కూడా ఆమె చెంతనే వుంటాం. మనం ఎంత అదృష్టవంతులం. ఇదంతా ఎందుకు రాస్తున్నానంటే అమ్మ ప్రతిక్షణం మన వెంటే వుండి, మన చేయి పట్టుకొని నడిపిస్తోందని ధృవీకరించటానికే. అమ్మ మనలోనే వుంది. మనం అమ్మతోనే వున్నాం.

మార్చి, ***2011***

29. అందరి అమ్మోత్సవం

ప్రతి ఏడాదీ అమ్మ జన్మదినవేడుక చాలా తృప్తిగా, వైభవంగా జరుపుకుంటాం. ఈ ఏడాది అలా జరుపుకో గలమా! అనే సందేహం వెంటాడుతూనే వుంది. కారణాలు అనేకం.

వంటలు చేయించటానికి, త్రాగటానికి నీళ్ళు కావాలి కదా ! అశోక్‌హౌస్‌లో నీళ్ళ మోటారు పాడైంది. అందుకని వీలైన వారంతా తలా ఒక ప్రసాదం తేవటానికి నిర్ధారణ అయింది. 28వ తారీఖు అమ్మవ్రతం చేసుకోవటం మా అలవాటు. వైజాగ్‌లో వున్న మన జిల్లెళ్ళమూడి విద్యార్థి సూర్యనారాయణ ఇక్కడి పురోహితుల్లో

మంచి పేరు సంపాదించాడు. అతను నేనే వస్తాను అక్కయ్య అంటూ కుసుమకు ఫోను చేశాడు. 28వ తారీఖు సోమవారం అయింది. అన్ని ఆఫీసులు వుంటాయి. అందరు బిజీగా వుంటారు. శనివారం సాయంత్రం అందరం సమావేశ మయ్యాం. మా మేనల్లుడు గోళ్ళమూడి నరసింగరావు అశోక్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అశోక్‌హౌస్ బాగోగులు అతనే చూస్తూ వుంటాడు. అతను ప్రత్యక్షమయినాడు. మా సమస్య చెప్పాం. తాళాలు ఇచ్చి మోటారు బాగు చేయించు కోమన్నాడు. అప్పటికప్పుడు రాత్రి ఏ ఎలక్ట్రీషియన్ దొరుకుతాడు. ఇంతలోనే ఎక్కడి నుంచో మాకు తెలిసిన ఎలక్ట్రీయన్ ప్రత్యక్షమయ్యాడు. మా సమస్య చెప్పాము. ఈ రాత్రికి ఎలాగైనా సామానుకొని తెచ్చి ఆదివారం పని పూర్తి చేస్తానన్నాడు.

ఆదివారం మధ్యాహ్నం కుసుమ నివేదనకు వెళ్ళేటప్పటికీ మోటారు బాగు అయింది. నీటిసమస్య తీరిపోవటంతో 4 గంటల తరువాత మందిరం అంతా గోడలతో సహా కడిగి శ్రీసూక్తంతో అమ్మను అభిషేకించి అలంకరించే అప్పటికి 7 గంటలు అయింది. ఈ మధ్య అయ్యగారి నరసింహారావు గారి అబ్బాయి శ్రీను అమ్మకు కొబ్బరికాయలు తెచ్చి ఇస్తున్నాడు. సరిగ్గా రేపటికి కాయలు ఏలా అనుకుంటున్న సమయంలో వాళ్ళ అమ్మగారు, శ్రీను అమ్మకు కొబ్బరికాయలు తీసుకొని వచ్చారు. అప్పుడే అనుకోకుండా శరభలింగంగారు, సువర్చల, సీతాదేవిగారి అల్లుడు డి.యస్.పి. సుబ్బారాజుగారు, లక్ష్మి వాళ్ళ బాబు వచ్చారు. దాదాపు ప్రతి ఆదివారం కృష్ణశర్మ, లలిత అమ్మ దర్శనానికి వస్తారు. వాళ్ళతో మర్నాడు అమ్మ జన్మదిన వేడుక గురించి చెప్పాను. ఎప్పుడో మానేసిన వాచ్‌మాన్ అదేవేళకు ప్రత్యక్షమవ్వటం అమ్మ అనుగ్రహానికి నిదర్శనమే.

మర్నాడు ప్రొద్దున్నే రాజాం నుంచీ చైతన్య వచ్చాడు. అతను వుంటే కొండంత అండ. చైతన్య, మురళి కలసి అన్నీ అమర్చేశారు. ముందురోజే మామిడాకుల తోరణాలతో మందిరం చుట్టూ కట్టారు. మైక్ ఏర్పాటు జరిగింది. ఉదయమే మన్నవ కృష్ణశర్మ బుట్టెడు గులాబీలు, ఎఱ్ఱ మందారాలు తీసుకువచ్చారు. ఆ గులాబీలను దండలా కట్టి క్రింద నుంచీ పై దాకా అమ్మను అలంకరించాము. సూర్యనారాయణ అద్భుతంగా పూజ జరిపించాడు. కుసుమ అమ్మ వ్రతకథలు వినసొంపుగా చదివి వినిపించింది.

ఏకా రాజేశ్వరరావుగారి కోడలు కరుణ, మనుమడు రాజేష్ నిలబడి పూజా ఆసాంతం జరిగే వరకూ పాలు పంచుకున్నారు. శ్రీచక్రంలో ఉన్న అమ్మ ఫోటో కుంకుమ, పళ్ళు, పూలు అందరికీ అందజేయటం జరిగింది. 50 మంది స్త్రీలు కుంకుమ పూజ స్వయంగా చేసుకున్నారు. నివేదనలు చెప్పినవారే కాక అనేక మంది పలురకాల ప్రసాదాలు తీసుకురావటం జరిగింది. మా ఇంటినుంచీ పులిహోర, ఉండ్రాళ్ళు లక్ష్మి చేసి తీసుకువచ్చింది. పాతవాళ్ళే కాక కొత్తవాళ్ళు కూడా అనేకులు పాలుపంచుకున్నారు. సూర్యనారాయణ మరదలు పదిమందిని తీసుకొని ప్రసాదంతో వచ్చింది. చివరకు సరళక్కయ్యను కూడా గజపతినగరం నుంచి అమ్మ తెప్పించుకుంది. గోపాలన్నయ్య మనమరాలు వాత్సల్య 4 రకాల పళ్ళు తీసుకు వచ్చి వడ్డన కూడా చేసింది. ప్రసాదాలు అద్భుతంగా వున్నాయని అందరూ ఆనందించారు. అమ్మను చూచి కళ్ళు తిప్పుకోలేకపోయాము. అంతా అమ్మే ఆనందింప చేసింది. అనూహ్యం క్షణక్షణం ఒక అద్భుతం.

ఏప్రియల్, 2011

౩౦. పతిదేవునితో పునరాగమనం

ప్రతి సంవత్సరం జనవరిలో దక్షిణాది యాత్రా స్థలాలను దర్శించటం ఆనవాయితీ. క్రిందటి సంవత్సర యాత్రలకు వెళ్ళి వచ్చిన తరువాత ఆరోగ్యం దెబ్బతినటంతో ఫిబ్రవరి 17 ధాన్యాభిషేకానికి కూడా వెళ్ళలేకపోయాను. ఈ సంవత్సరం అమ్మ అనుగ్రహం చేత ఆరోగ్యం కుదుటబడి గురువాయూర్ కృష్ణణ్ణి, కన్యాకుమారిని, అరుణాచలంలో రమణమహర్షి సమాధిని దర్శించాము. కన్యాకుమారిలో వేలమంది జనం వున్నా ఆలయంలో అమ్మవారి దర్శనం చాలా హాయిగా అయింది. అమ్మ గోపాలన్నయ్యతో "ఆ విగ్రహం అచ్చు మన హైమలాగా వుంటుంది కదానాన్నా!" ఆ మాటలు చెవులలో మారు మ్రోగుతుండగా నాకూ అక్కడ హైమక్కే దర్శనం ఇచ్చింది.

అక్కడ నుంచి రమణాశ్రమం వచ్చాము. ప్రొద్దున్నే స్నానపానాలు కావించుకొని రమణమహర్షి సమాధి దగ్గర 1 గంట గడిపి, మాతృభూతేశ్వరాలయాన్ని సంద ర్శించాము. అక్కడ వుండగా కుసుమ అమ్మ

సచ్చరిత్రలో రాసిన ఘట్టం "చీరాల బేర్ ఆసుపత్రిలో 'అమ్మ' వున్నప్పుడు అక్కడి డాక్టర్లతో కలిసి అమ్మ రమణాశ్రమంకు వెళ్ళింది. మొదటిసారిగా శ్రీరమణులు అమ్మను 'మాతృశ్రీ' అని సంబోధించారని, అప్పుడు అమ్మ ఎక్కడైతే కూర్చున్నదో అక్కడే మాతృభూతేశ్వరాలయాన్ని నిర్మించారన్న సంగతి" జ్ఞప్తికి వచ్చింది.

అరుణాచలేశ్వరుని దర్శించటానికి వెళ్ళాలను కున్నాము. నా స్నేహితుడు ఆర్.వి.రావు తనకు ఓపికలేదని చెపితే నేనూ వుండిపోయాను. నాకు ఇంకొద్ది సేపు రమణుని సమాధి దగ్గర గడపాలని వుంది. కానీ రాత్రి ప్రయాణం కదా! వెళ్ళిపోదామంటే మేము దిగిన గెస్టుహోస్‌కు బయలుదేరాము. మాటల ధ్యాసలో పడి దోవతప్పాము. అలా ఒక అరగంట నడిచాము. ఊరి అవతల ఎక్కడో ఇరుక్కుపోయాము. చివరికి 'స్వామీ తప్పయిపోయింది. క్షమించండి ? రక్షించండి' అని రమణమహర్షిని ప్రార్థించాం. లెంపలేసుకున్నాం. ఇంతలో ఎక్కడి నుంచో ఒక ఆటో ప్రత్యక్షమయింది. మహర్షి పంపిన ఆటో ఎక్కి ఆశ్రమంకు వెళ్ళి అరగంట ధ్యానం చేసుకొని మా వసతికి చేరుకున్నాం.

సాయంత్రంకి విల్లిపురం చేరి రైలు ఎక్కాము. వెళ్ళిన 5 గురికి తలా ఒక చోట బర్తులు వచ్చాయి. డాక్టర్ అశ్వనీకుమార్ బర్తులో ఒక నడివయస్సు ఆవిడ మూలన కూర్చుంది. ఆమె బర్తు ఏదని హిందీలో అడిగాను. ఆమెపై బర్తు తనదని తెలుగులో సమాధానం చెప్పింది. వాళ్ళది గుంటూరు అని వాళ్ళ అబ్బాయి పాండిచ్చేరిలో మెడిసన్ చువుతున్నాడని, ఆతని దగ్గరకు వెళ్ళి వస్తున్నాను" అంతా స్వామి అనుగ్రహం అంది. ఏ స్వామి అని ప్రశ్నించాను. శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి" అని చెప్పింది. స్వామి వారితో మాకున్న అనుబంధం, అనుభవాలు ముచ్చటించు కున్నాము.

వైజాగ్ తిరిగి వచ్చాక జిల్లెళ్ళమూడి ధాన్యాభిషేకానికి ఫిబ్రవరి 16వ తారీఖు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో గుంటూరు దాకా చేయించుకొని అక్కడ నుంచీ టాక్సీలో జిల్లెళ్ళమూడి వెళ్ళాలని మా ప్లాను. ఆ రోజు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ 1 గంట ఆలస్యంగా వచ్చింది. 9 గంటలకు గుంటూరు చేరినా 10-30 నిమిషాలకు జిల్లెళ్ళమూడి చేరుతామని అనుకున్నాము.

ఎప్పుడూ వూరు వెళ్తున్నా మా మందిరంలో అమ్మను దర్శించుకు వెళ్ళేవాడిని.

ఆ రోజు ఆఫీసులో పని వుండటంతో కుసుమ మందిరంకు వెళ్ళి నివేదన ఇచ్చివచ్చింది. వెంటనే బయలుదేరాల్సింది. 2 గంటలకు బయలుదేరింది. దారి పొడుగునా ఆపుతూనే వున్నాడు. గుంటూరుకు 8-30 గంటలకు చేరవలసిన రైలు ఏలూరుకే 9 గంటలకు చేరింది. మా మనవడు లలిత్ చక్రవర్తి ఫోను చేసి "తాతా మీరు ఎక్కడ వున్నారని అడిగాడు. 'ఇంకా ఏలూరు దగ్గరే వున్నామురా' అన్నాను. "మీరు విజయవాడలో దిగిపోయి పొద్దున్నే బయలుదేరి జిల్లెళ్ళమూడి వెళ్ళొచ్చు కదా" అన్నాడు.

అమ్మే వాడి రూపంలో ఆ సలహా ఇచ్చిందని పించింది. విజయవాడ చేరేటప్పటికే 11 గంటలు అయింది. విజయవాడలో మా తమ్ముడు సుబ్బారావు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మేనేజర్‌గా వుంటున్నాడు. వాళ్ళ ఇల్లు గాంధీనగర్‌లోనే. స్టేషన్‌కు దగ్గరకూడానూ. చాలా హాయిగా రాత్రిపడుకొని ఉదయమే పినాకినీలో బాపట్లకు చేరి జిల్లెళ్ళమూడి ధాన్యాభిషేకం సమయానికి చేరాము. ఆరాత్రి వాడి ద్వారా ఆ సలహావచ్చి వుండకపోతే గుంటూరులో. అవస్థ. మళ్ళీ ఉదయమే జిల్లెళ్ళమూడికి చేరటం కష్టమయ్యేది. అమ్మ ఎప్పుడూ మనతోటే వుంటుందనటానికి నిదర్శనమే ఈ సంఘటన.

ధాన్యాభిషేకం ఊహించిన దానికంటే కన్నుల పండుగలా జరుపుకున్నాము. మర్నాడు 18 వ తారీఖు మేడమీద వున్న అమ్మ ఎ.సి. రూముకి వెళ్ళాను. ఆ గది అంటే నాకు చాలా ఇష్టం. అమ్మతో నా పరిచయం, నా బాధలు విన్నవించుకోవటం, అమ్మ ఓదార్చటం, ఆ సంభాషణలు అన్నీ గుర్తుకు వస్తాయి. మళ్ళీ అమ్మకు నా కష్టసుఖాలు చెప్పుకుంటాను. అమ్మ సలహా వెంటనే స్ఫురింపచేస్తుంది. ఇది నా స్వానుభవం. ఎవరి అనుభవాలు వారివి. దత్తు అన్నయ్య వున్నాడు. ఇంక ఎవరూ లేరు. అమ్మకు చెప్పుకోవలసినవి అన్నీ చెప్పుకున్నాను. నా సెల్‌ఫోనుతో అమ్మ మంచం మీద వున్న పెద్ద చిత్రపటానికి ఫోటో తీయటానికి ప్రయత్నించాను. ఎన్నిసార్లు తీసినా ఒక్క ఫోటో కూడా సరిగా రాలేదు. అమ్మని నా తప్పులు మన్నించి అనుగ్రహించమని ప్రార్థించాను. కానీ ఫలితం లేదు.

ప్రతి రోజూ కుర్తాళం స్వామి ఇచ్చిన మంత్రం, హైమక్క నామం చేస్తాను. ఈ 2 రోజులుజిల్లెళ్ళమూడిలో చేయలేదు. వెంటనే జపం చేసి, హైమక్క నామం

చేసి మళ్ళీ ఫోటోలు తీయటం మొదలు పెట్టాను. అద్భుతంగా వచ్చాయి. వీడియో కూడా తీసుకున్నాను. 18 తారీఖు బయలుదేరి వైజాగ్ వచ్చేశాను. కుసుమ హైద్రాబాద్ పెళ్ళికి వెళ్ళింది. 2 రోజులు గడిచాయి. కుసుమ హైద్రాబాద్ నుంచీ "నేను అమ్మ, నాన్నగారి ఫైబర్ విగ్రహాలు తీసుకు వస్తున్నాను. స్వామీజీది కొంచెం పెద్దదిగా వుంది. మన మందిరంలో చోటు చాలదు కదా" అని ఫోను చేసింది. పూర్ణానందస్వామిజీ ప్రప్రథమంగా గృహస్థు ఇంట్లో భిక్ష స్వీకరించింది మీ నాన్నగారి ఇంట్లోనే నీకు భువనేశ్వరీ మంత్రం ఉపదేశించమని ఆదేశించారు. అటువంటి మహానుభావులు వస్తామంటే వేరే ఆలోచన ఎందుకు ? తీసుకు వచ్చేయి; నేను చూసుకుంటానని-సలహా ఇచ్చాను.

ఆవిడ తీసుకు వచ్చింది. మా మందిరంలో అన్ని ఫోటోలు సర్దుకుని ఈ విగ్రహాలు మూడు పెట్టుకొని పరవశించి పోయాము. ఆ సాయంత్రం అమ్మ, నాన్నగారు విచ్చేసిన సందర్భంగా పూజకుపక్రమించాము. ఈ లోగా జి.ఎమ్.ఆర్. బాలాజీ కొత్తకారు కొనుక్కొని అమ్మ దగ్గరకు తీసుకు వచ్చారు. ఆ దంపతులు కూర్చుని పూజ చేసుకున్నారు. కుసుమ ఆ కొత్తకారుకు గంధం, అమ్మ కుంకుమ అలంకరించింది. వాళ్ళ ఎంతో ఆనందించారు.

సరిగ్గా వారం గడిచిందో లేదో అమ్మ అనుంగుబిడ్డ భవానీప్రసాద్ గారు "దేవీపురంలో పూజలో పెట్టిన శ్రీ చక్రం మేరువు కొనుక్కున్నారు కానీ తరచూ వూళ్ళకి వెళ్ళిరావటంతో నిత్యపూజకు ఆటంకం జరుగుతోందని అది అమ్మ మందిరంలో పెట్టాలని వీలుంటుందా? అని ఫోను చేసారు. ఓహో ! ఇంకో విచిత్రం ! ఎప్పుడూ ఊహించలేదు. అమ్మవారి అనుగ్రహం. ఆయన ఒకరోజు సాయంత్రం తీసుకు వచ్చారు. దాన్ని మందిరంలో అమర్చేశాం. అర్చనలు ప్రారంభమయ్యాయి.

కేశవశర్మగారు శ్రీ చక్రం గురించి ఎంత తపించిపోయాడో మనందరికీ తెల్సిన విషయమే. మరి మా ప్రమేయం లేకుండా వైజాగ్ మందిరంలో ప్రధమంగా కొలువైవున్నది. అవును మరి కేశవశర్మగారు వైజాగ్‌లో అమ్మకు చేసిన సేవ సామాన్యం కాదు కదా ! అందుకే అమ్మ ఆయన కోర్కెను ఆవిధంగా స్వీకరించిందేమో.

మే, 2011

31. ఆవేదనే ఆరాధన

వైజాగ్ మందిరంలో ప్రతిరోజూ మధ్యాహ్నం కుసుమ అమ్మకు మహానైవేద్యంతో పాటు శ్రీ చక్రార్చన చేసుకుంటున్నది. మందిరంలో ప్రతివారికీ ఒక్కో అనుభూతిని అమ్మ ప్రసాదిస్తోంది. రోజూ సాయంత్రం అమ్మ కబుర్లు చెప్పుకుంటాం. ఒకరోజు లక్షల అప్పులనుంచీ అమ్మ ఎలా బయటపడేసిందో చెప్తూ అమ్మ నాతో రేపు ఏం జరుగుతుందో నీవు చూడలేవు. నేను చూడగలను నాకు అంతా వర్తమానమేనని ప్రకటించిందని చెప్పాను.

వెంటనే రాజేష్ తన అనుభవాన్ని ఇలా చెప్పాడు. నడివయస్సులోనే తన తండ్రి ఏకారంగారావు అమ్మలో కలిసిపోయాడు. ఆస్తులు ఏమి మిగల్చలేదు. అంతా అంధకారం. అయోమయం. అప్పుడు గుర్తుకువచ్చింది. తన తల్లి కరుణ తనని ప్రసవించే సమయంలో విపరీతంగా బాధపడ్తుంటే ప్రసాదరాయకులపతిగారు మంత్రించి అక్షతలు ఇచ్చారుట. అవి. శిరస్సుపై వేసుకున్న కొద్ది నిమిషాలకే కరుణకు సునాయాసంగా కాన్పు అయింది. అప్పటి నుంచీ ఏదైనా వారి సలహా సంప్రతింపులుతో చేయటం ఎక్కువైంది. అంతా గుంటూరు వాళ్ళు. అమ్మ భక్తులే.

ఆ చనువుతో విశాఖ లలితాపీఠంకు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి (డాక్టర్ ప్రసాదరాయకులపతి) వుండగా "రాజేష్ తన ఆవేదన, బాధలు చెప్పుకొని బావురుమన్నాడు. ఆ ఆవేదనలో ఉద్రేకంగా మా నాన్నకు నిత్యం అమ్మ స్మరణే. అమ్మనే కొలుచుకున్నాడు. అమ్మ నాన్నకు ఏం చేసింది. అనారోగ్యంతో బాధలతో అమ్మలో కలసిపోయాడు ? ఆమెను ఎందుకు కొలవాల'ని ప్రశ్నించాడు.

దానికి స్వామివారు "అమ్మ ఏం చేసిందో మీ నాన్నకి- అమ్మకే తెలుసు. నమ్మకం, భక్తి, వుంటే ఆమె కాళ్ళు పట్టుకో, లేకపోతే వదిలై అని గంభీరంగా" అన్నారు. రాజేష్‌కి ఏమి చెప్పాలో తెలియలేదు. వణికిపోయాడు. తిరిగివచ్చి అమ్మ పాదాల మీద వాలిపోయాడు. రాజేష్‌ని అమ్మ తన లాలన లోకి తీసుకుంది.

రాజేష్ లలితాసహస్రనామపారాయణ నేర్చు కున్నాడు. రోజూ ప్రొద్దున్నే భక్తిశ్రద్ధలతో అమ్మను అర్చించుకుంటున్నాడు. సత్యసాయి స్కూల్‌లో మ్యూజిక్ క్లాసులు తీసుకునే అవకాశం వచ్చింది. అమ్మ అనుగ్రహంతో సాయంకాలం తన కాలేజీ అయిపోయాక క్లాసులు చెప్పుకునేలా అవకాశం కల్పించారు. తరువాత

ఇంటి దగ్గర కొంతమందికి నేర్పుతున్నాడు. సంపాదన పెరిగింది. ఈ నెల 19వ తారీఖున బ్యాంకు లోను పెట్టుకొని కొత్త 'కీబోర్డు' కొనుక్కున్నాడు. షాపు నుంచి తిన్నగా మందిరానికి తీసుకు వచ్చి కుంకుమ బొట్టు పెట్టి ఇంటికి తీసుకు వెళ్ళాడు. అమ్మ అనుగ్రహానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే. అమ్మ క్షిప్రప్రసాదిని కదా !

జూన్, 2011

32. అంతా అమ్మే చూసుకుంటుంది

జిల్లెళ్ళమూడిలో చదివిన విద్యార్థులు, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో వేలమంది అనేక కళాశాలలో లెక్చరర్స్‌గా పనిచేస్తున్నారు. ఈ రోజులలో జీతాలు 30 వేల నుంచీ 40 వేలకు తక్కువ లేదు. ఇది మనందరం గర్వించతగ్గ విషయం. పూర్వవిద్యార్థి కిషోరే అక్కడ చదివినవారికి తిండి గురించి, జీవితం గురించి బెంగవుండదని అంతా అమ్మే చూచుకుంటుందని చెప్పాడు. కొంతమంది పౌరోహిత్యం చేస్తూ మంచిపేరు ప్రఖ్యాతులు సంపాదించారు. యస్.కోటలో భాస్కరశర్మ, విశాఖపట్టణంలో కె.సూర్యనారాయణ ముఖ్యులు. సూర్యనారాయణ మన విశాఖమందిరంలో భక్తిశ్రద్ధతో, అమ్మపూజలు నిర్వహిస్తుంటాడు.

12వ తారీఖున జరిగిన అన్నాభిషేకంకు కొంచెం ఆలస్యంగా వచ్చాడు. అందరూ కొంచెం చికాకు పడ్డాం. కానీ మరుక్షణంలో అందరికీ ఆశ్చర్యం, ఆనందం. ఆయన ఇంటి గృహప్రవేశం 19.6.11 జరిగే కార్యక్రమానికి అందరి చేతుల్లో శుభలేఖలు పంచిపెట్టాడు. ఒక పక్క కూతుర్ని గీతం యూనివర్శిటీలో ఇంజనీరింగ్ చదివిస్తూ ఇల్లు నడుపుకుంటూ సామాన్య పురోహితుడు 15 లక్షలతో విశాఖలో (స్థలం వుండగా) పైగా ఇల్లు కట్టడం ఆశ్చర్యకరమైన విషయం. అమ్మ తన బిడ్డల మీద ప్రేమ ఎలా అనుగ్రహిస్తుందో అతని జీవితమే ఒక ఉదాహరణ.

సూర్యనారాయణ చిన్నప్పుడు కొంచెం మందకొడిగా వుండేవాడు. మాట కూడా కొంచెం నత్తిగా వచ్చేది. అతని తల్లిదండ్రులు అమ్మ మీదే భారం వేసి జిల్లెళ్ళమూడి కళశాలలో చేర్పించారు. 1983–1988 సంవత్సరంలో చదువు ముగించుకొని రెండు సంవత్సరాలు హైద్రాబాద్‌లో వున్నాడు. మొదట్లో అవకాశాలు దొరకక సంపాదన లేక చాలా బాధపడ్డాడు. విశాఖకు తిరిగి వచ్చేశాడు. సూర్యనారాయణ కజిన్ శ్రీ కొక్కిరగడ్డ సుబ్రహ్మణ్యం (మణి) గారు

సూర్యనారాయణకు పౌరోహిత్యం గురువుగా వుండి అందులో అతనికి తర్ఫీదునిచ్చారు. అమ్మ దయవల్ల ఒక ఆంజనేయస్వామి ఆలయంలో నెలకు 5 వేలు జీతం మీద చేరాడు. నెమ్మదిగా బయటకూడా పూజలు చేయిస్తూ మంచిపేరు సంపాదించుకున్నాడు. కంచుకంఠం. అమ్మ దగ్గర చదువుకున్న రోజుల్లో వున్న నత్తి కూడా పోయి అనర్గళంగా పూజలు చేయించటం వాళ్ళ వాళ్ళంతా కూడా ఆశ్చర్యపోయారు. పేరుతో పాటు సంపాదన పెరిగింది.

గాజువాకలో చిన్న స్థలం ఏర్పరచుకున్నాడు. అవసరానికి తనతో పాటు చదువుకున్న స్నేహితులు డబ్బు సర్దుబాటు చేశారు. నెమ్మదిగా అప్పు తీరుస్తూ ధైర్యం చేసి 2 అంతస్థుల చిన్న మేడ ప్రారంభించాడు. చివరికి 5 లక్షలు కావాల్సి వచ్చాయి. పని ఆగిపోయింది. అమ్మ మీదే భారం వేసి తన పనికానిస్తు వచ్చాడు. తను, తన భార్య మానసికంగా వత్తిడి అనుభవించారు. ఇంతలో ఒక పెళ్ళి అద్భుతంగా జరిపించాడు. వచ్చిన అతిధులలో ఒక ఆమె సూర్యనారాయణ వివాహం జరిపించిన తీరుకు చాలా మెచ్చుకొని పుట్టుపూర్వోత్తరాలు అడిగింది. అడిగిందే తడువుగా అంతా అమ్మదయ అని తాను జిల్లెళ్ళమూడిలో అమ్మవద్ద చదువుకున్నానని, ఇది అంతా అమ్మ పలికిస్తే తాను పలుకుతున్నానని చెప్పాడు. ఆవిడ తాను బ్యాంకు ఆఫీసర్‌నని చెప్పింది. దొరికిందే అవకాశమని తన ఇంటి సమస్యను గురించి చెప్పాడు. ఇక్కడ అమ్మ అనుగ్రహం వర్షించింది. ఆమె మర్నాడు ఉదయమే 8 గంటలకు బ్యాంకుకు రమ్మన్నారు. సూర్యనారాయణను కూర్చోబెట్టి 2 గంటలలో అన్ని డాక్యుమెంట్స్ తయారుచేయించి 4 లక్షల చెక్ చేతిలో పెట్టింది. సూర్యనారాయణకు మూర్ఛవచ్చినంతపని అయింది. సంతోషానికి అవధులు లేవు? ఇల్లు పూర్తి చేశాడు. చివరకి 1 లక్ష రూపాయిలు తక్కువ అయితే అది కూడా ఆమె ఏర్పాటు చేసింది.

19.6.11న గృహప్రవేశంకు అందరం వెళ్ళాము. అతని సహాధ్యాయులు వచ్చారు. ఇంకోవిచిత్రం ఏమిటంటే తను కట్టుకున్న ఇంటిప్రక్కనే ఒక కళ్యాణమండపం వుంది. వచ్చినవారందరికి వసతులతో, బాగుంది. 2రోజులకు బుక్‌చేసుకున్నాడు. అందరికీ వైభవంగా విందు ఏర్పాటు చేశాడు. తరించాడు. అమ్మ అనుగ్రహానికి ఇది ఇంకో నిదర్శనం. అమ్మ పాదాలు వదలకుండా గట్టిగా పట్టుకుందాం. అందరం తరిద్దాం.

జులై, 2011

33. రక్షణే అమ్మ

విశాఖ అమ్మ మందిరానికి ప్రతిరోజూ సాయంత్రం అనేక మంది వచ్చి అమ్మను దర్శించుకుంటారు. ఒక్కొక్కరికి ఒక్కో రకమైన అనుభూతి. అంతా అమ్మ అనుగ్రహం. పుట్టపర్తిలో విద్యాభ్యాసం చేసారు. వారికి బాబావారే సాయిరామ్ అని నామకరణం చేసారు. వారికి అమ్మ అనేక అనుభవాలు ప్రసాదించింది. మా మందిరంలో వున్న శ్రీ పూర్ణానందస్వామివారి ఫోటో వారిని ఆకర్షించింది. వారు తమిళులు. స్వామీజీఫోటో కావాలంటే కుసుమ వారికి ఇచ్చింది. దానిని వారు పూజామందిరంలో పెట్టుకొని ధ్యానం చేస్తుంటారు. వారు గాయత్రీ ఉపాసకులు. ఈ మధ్యన తెల్లవారుఝామున సరిగ్గా 3.30ని.లకు ఆ ఫోటోలో నుంచి ఓంకారం వెలువడడం మొదలైనది. వారికి పెన్షన్ పెరిగింది.

అమ్మ కళ్యాణం కోసం మే 4వ తారీకుర్రాత్రి అమ్మ మందిరం అలంకరణలో వున్నాము. 8 గంటలయింది. ఆయన వచ్చి అమ్మకు సాష్టాంగంగా పడిపోయారు. లేచి ఒక విచిత్ర సంఘటన చెప్పారు. వారు ఎ.టి.యమ్.లో 8 వేలు డ్రా చేసి డబ్బు కవర్లో పెట్టుకొని ఎ.టి.యమ్. కార్డును జేబులో పెట్టుకొని ఒక గంట తరువాత ఇంటికి చేరారు. వారి శ్రీమతి సరుకులకు డబ్బులిమ్మని అడిగింది. జేబులు వెతుక్కున్నారు. అప్పుడు గుర్తుకు వచ్చింది.కార్డు జేబులో పెట్టుకుంటూ డబ్బుల కవరు బ్యాంకులో ఎ.టి.యమ్. మీద పెట్టిన విషయం. ఆదరాబాదరా పరిగెత్తారు. అక్కడ ఎవరూ లేరు. డబ్బు లేదు. జేబులో వున్న అమ్మ ఫోటోను బయటకు తీసికొని "అమ్మా! అంతా నీ దయ, ఏం చేస్తావో అని ప్రార్థిస్తూ ఇంటికి తిరిగి వచ్చారు. వారి దురదృష్టానికి చింతించారు. ఏం చేస్తారు! వారం తర్వాత మళ్ళీ ఎ.టి.యమ్.కు వెళ్ళి కొంత డబ్బు తీసుకున్నారు. బయటకు వచ్చారు. అక్కడ వారికి. ముగ్గురు విద్యార్థులు కనిపించి సార్ అని పిలిచారు. వాళ్ళెవరో తెలియదు. ఎందుకు పిల్చారో అంతకంటే తెలియదు ఏమిటి? అని వారిని ప్రశ్నించగా కిందిటి వారం మీరు ఎ.టి.యమ్.కు వచ్చారు కదా ? డబ్బు ఏమైనా మర్చేపోయారా? అని అడిగారు. ఈయనకు ఆశ్చర్యంతో అవును అన్నారు. మరల వారి ప్రశ్న ఎంత మొత్తం ? 8 వేలు అని వీరి సమాధానం. సరిగ్గా చెప్పారంటూ ఆ విద్యార్థులు 8 వేల రూపాయలను తిరిగి ఇవ్వటం జరిగింది. ఆయనకు

మూర్ఛవచ్చినంత పని అయింది. ఎ.టి.యమ్. పక్క ఇంట్లోనే వాళ్ళు వుంటున్నారట. ఈయన్ని గుర్తుపెట్టుకొని మరీ డబ్బు ఇచ్చారు. ఈ కాలంలోని పిల్లలు డబ్బు దొరికితే వెతుక్కుని తెచ్చి ఇవ్వటం ఆశ్చర్యం కదా! ఇదంతా అమ్మ దయ అని ఆనందంతో, భక్తితో అమ్మకు సాష్టాంగ పడ్డారు.

సరిగా వారం గడిచిందో లేదో ఒరియా పిల్ల శారద వృద్ధాశ్రమంలో పనిచేసేది. పూర్వమే తండ్రి పోయారు. ఈ మధ్యనే తల్లికాలం చేసింది. కొంచెం తీరిక దొరికి నప్పుడల్లా అమ్మ మందిరానికి వచ్చి అమ్మ నామం చేసు కుంటుంది. ఎప్పుడూ అమ్మ ఫోటోను దగ్గరే వుంచు కుంటుంది. వృద్ధాశ్రమంలో నుంచీ బయటకు వచ్చేసిన వృద్ధదంపతులు ఈ అమ్మాయిని వారింట్లోనే వుంచుకొని హాయిగా వుంటున్నారు. వాళ్ళు ఇచ్చిన డబ్బు దాచుకొని శారద మొన్న లక్ష రూపాయలు ఫిక్సెడ్ డిపాజిట్ కాగితాలను నా చేతికి ఇచ్చి అమ్మ ఒళ్ళో పెట్టమంది. ఇది అంతా అమ్మ అనుగ్రహమని పులకించిపోయింది. నా ఆనందానికి అవధులు లేవు. సామాన్యమైన ఒక బీదపిల్ల లక్షరూపాయలు సమకూర్చుకోగలిగిందంటే ఎంత ఆశ్చర్యం. అంతా అమ్మ అనుగ్రహమే గదా!

రోజులు హాయిగా అమ్మసేవలో గడిచిపోతున్నాయి. ఉదయం రాజేష్, మధ్యాహ్నం కుసుమ, సాయంత్రం నేను అమ్మ మందిరంలో అమ్మ సేవలో తరిస్తున్నాం. సాయంత్రం నాకు సాయంగా కరుణ వస్తుంది. పని అమ్మాయి చేత దేముడి సామాను తోమించి మందిరం తడిగుడ్డ పెట్టి తుడిపించి, తనవంతు సేవ తానూ చేసుకుంటున్నది. మొన్న 2 రోజులు వర్షాలు పడ్డాయి. ఒక రోజు ప్రొద్దున్నే రాజేష్ అమ్మ మందిరానికి వెళ్ళాడు. మోటారు బైక్ మందిరం ముందు వున్న చెట్టు క్రింద స్టాండ్ వేసి పది అడుగులు వేసాడో లేదో ఫెళ్ళుఫెళ్లు మని చెట్టుకూకటి వేళ్ళతో సహా పెకలించబడి బైక్‌మీద వాలిపోయింది. చుట్టుపక్కల వాళ్ళు పదిమంది వచ్చి నెమ్మదిగా చెట్టు క్రింద నుంచీ బండీని బయటకు తీసారు. తీరా చూస్తే బండికి చిన్న దెబ్బకానీ, కనీసం గీతలు కూడా పడలేదు. అదే ఒక్క క్షణం ముందు అయితే ఆ చెట్టు కింద రాజేష్ నలిగిపోయేవాడే. అమ్మ మనల్ని ప్రతిక్షణం, మనతో వుండి రక్షిస్తోందని చెప్పటానికి నిదర్శనమే ఈ సంఘటన. మనం అమ్మను మరచినా అమ్మ మనల్ని మరువదు. మన అమ్మ అనసూయమ్మ.

ఆగష్టు - 2011

కుసుమపరాగం - కవితలు

1. అనురాగస్రవంతి

నామనఃకలశంలో జాలువారే సుధాంశు బిందువులా
నా హృదయాకాశంలో నర్తించే తారకలా
అమ్మ అనురాగం మలయమారుతంలా నన్ను తాకుతుంటే
నా మానసోల్లాసాన్ని ఏమని వర్ణింతును ॥

వినీలాకాశంలో పయనించే జలధరంలా
సుందర దరహాస జ్యోత్స్నలను ప్రసరించే రసదేవతలా
అమ్మ మోము ధవళకాంతులు విరజిమ్ముతుంటే
ఆ వెలుగు సోకిన నా మానస రాజహంసను ఎలా నిలువరింతును ॥

ఎదవీణియ మీటే రసరమ్య గీతంలా
మలయపవనాల మాటున కిలకిలారావంలా
అమ్మ పసిడి పలుకులు నా హృదయాన్ని తాకుతుంటే
ఆ మాటల సోయగాల వెల్లువకు ఎలా తట్టుకోను ॥

సాగర తీరంలోని అలల హోరును
కొండ కోనల నడుమ ఝుంఝూంమారుతాన్ని
సోదరుల అనుభవాలు చిందించే అమృతవర్షాన్ని
అమ్మ సన్నిధిలో అనుభవించిన ఆనందాన్ని ఎలా మరువగలను ॥

2. అమృత సింధువు

శీతల సుధాకరుడు అగ్నిశిఖలు విరజిమ్మినా
హిమాలయం అగ్నిపర్వతంలా బ్రద్దలయినా
మలయానిలం అనలమై జడిపించినా
శాంతమహాసముద్రంలా ప్రళయభీకర బడబాగ్ని ప్రజ్వరిల్లినా

విపంచీ మృదుస్వరంలో విలయనాదం వినిపించినా
నిశీథ గగనంలో అరుణారుణకాంతులు వ్యాపించినా
అమ్మ సన్నిధిలో, ఆ దివ్యమాతృత్వపు వెల్లువలో
నిర్వ్యాజము, నిస్వార్థము, నిరుపమాన అవ్యాజకరుణ ముందు
అవన్నీ నిస్తేజమై, నిర్లిప్తమై, నిర్వీర్యమై, నిస్తరంగమై నిశ్చలమై
అమృతసింధువై, ఆత్మబంధువై మనల్ని పలకరిస్తుంటాయి.
అవన్నీ అమ్మ రూపాలే కదా !

3. అనురాగమూర్తి ఆగమనం

పాలనతో కాక లాలనతో
అధికారంతో కాక అనురాగంతో
శిక్షతో కాక శిక్షణతో
మానవాళి మనస్తత్వంలో
మార్పు తీసుకు వచ్చే మహిమాన్విత
అన్నీ తెలిసి ఏమీ తెలియని స్థితిలా
కనిపించే విచిత్ర స్థితిలో
సృష్టికే రత్న ఖచితమకుటం
సృష్టే తానైన సమిష్టి నికటం
లోకానికి మణిదీపచిద్ఘనం
అనురాగమూర్తి అమ్మ ఆగమనం ॥

4. అమృత హస్తం

అమ్మ హస్తం అమృతహస్తం
ఆపదలో వున్నవారిని కాచి
అవసరాలలో వున్నవారిని ఆదుకొని
అధఃపాతాళంలో పడిపోయేవారిని చేరుకొని
పాపులనెందరినో పునీతులు గావించింది ॥

ఆ చేతిలో సంజీవని, చింతామణి
అమృత కలశం, అభయముద్ర
అనంతకోటి జీవుల అద్భుత చరిత్రలకు
ఆధారమైన, అనుపమ లేఖిని వున్నవి॥

5. పీయూష ప్రవాహం

ప్రేమస్వరూపిణి అవతారమూర్తి, మానవరూపం ధరించిన దైవం
అనంత అనురాగ క్షీరాంబుధిలో ఓలలాండించుచూ
అతిశీతల అవ్యాజకరుణాచంద్రికల ప్రసరిస్తున్న
అమ్మ విశ్వరూప సౌందర్యం వాత్సల్యపీయూష ప్రవాహం ॥

6. ఉషోదయం

జగషత్ కళ్యాణ సంధాయిని, పతితపావని
కళ్యాణకారిణి, కళ్యాణ స్వరూపిణి, కళ్యాణధాత్రి
మానవ మానస కమలం వేయిరేకులుగా విప్పారటానికి
సౌందర్యశోభల విరజిమ్మి సుగంధ వీచికలు వెదజల్లటానికి
అమ్మప్రేమ ఉషోదయంలా మనలను పలకరిస్తుంది ॥

7. ఆరాధన

రాముడో, కృష్ణుడో, క్రీస్తో,మహమ్మదో
ఎవరైతే నేమి ? మా అమ్మ మాకు దైవం
విశ్వ సృష్టి స్థితిలయాలకు, జనన మరణాలకు
జయాప జయాలకు సుఖదుఃఖాలకు
అభివృద్ధి పతనాలకు, సర్వానికీ అమ్మే కారణం ॥

తరంతరం, నిరంతరం అమ్మనే అర్చించి
కన్నుమూసినా తెరచినా, ఆరూపమే కనిపించి
ప్రతి శబ్దంలో ఆ నామమే వినిపించి
పంచేంద్రియాలు ఆ మూర్తికే ఉన్ముఖమై పోవాలి॥

అహరహము, రోమరోమమూ ఆస్మరణతో పులకెత్తి
శరీరంలోని, ప్రతి అణువణువూ ఆగానంతో పరవశించి
రక్తమాంసాలు, ఆధ్యానంతో ఉరకలెత్తి
సర్వకాల సర్వావస్థల్లో సర్వశక్తులూ అర్పించి
ఆ అర్పణ ఆరాధనగా పూర్ణాహుతినై పోవాలి॥

8. స్థితప్రజ్ఞ

దూషణ భూషణాలను ఒకటిగా స్వీకరిస్తూ
సుఖదుఃఖాలను గౌరవాగౌరవాలను
అధికులనీ, అల్పులనీ మంచి చెడుల భేదం లేక
పాపపుణ్యాలు, హెచ్చుతగ్గులు స్ఫురించక
శీతోష్ణాలను, కష్టసుఖాలను, తేజస్తిమిరాలను
మానవమానాల్లను, జయాపజయాలను సమముగా భరించే
అమ్మ స్థితప్రజ్ఞ అంటే ప్రజ్ఞేతానైన స్థితి
పుత్తడియు, మృత్తికయు, ఒకటిగాగోచరించే
అమ్మకు తాపసులు, తామసులు ఒకటే ॥

9. అమ్మ కనుదోయి

వాత్సల్యకారుణ్య కాంతిలహరులు
నితాంత ప్రశాంత నిస్తుల సౌందర్య తేజః పుంజములు
అమ్మ జీవితాంబరములో మెరిసే అద్భుత కాంతిరేఖలు
అమ్మ వదనేందు మండలం నుండీ జాలువారే అమృతకిరణాలు॥

దశల చంద్రికాదరహాస భాసురాలు
నిర్మల నిశ్చల తరంగిణీ మృదుమధుర విలాసాలు
అవ్యాజమైన కారుణ్య కిరణాలు
అమలినమైన అనురాగ దీపికలు
అలరారు అవనిజనులపై అమ్మచూపుల చల్లని వెన్నెలలో

10. మానవత్వం

భాస్కరునకు మహోజ్జ్వల కాంతిని
సుధాంశునకు శీతలజ్యోత్స్నను
శతకోటి నక్షత్రాలకు వెలుగును
ప్రసాదించిన అమ్మా ! మానవత్వం నింపి
మమ్ము దీవించుమమ్మా !

11. అమ్మ పలుకులు

బిడ్డల హృదయ కేదారాలను ప్రేమార్ద్రం చేసే జ్ఞానవీచికలు
రమణీయ దరహాస రోచిస్సుల చిందించే అనురాగ భాసురాలు
మధుర మధుర వాత్సల్య మహనీయమంజుల వీణానాదాలు
అమ్మ పలికిన పలుకులు విజ్ఞాన విలసితాలు,
రమణీయ వాక్యమధురిమలు
రస బంధురాలు, అనంతజ్ఞానసాగర వీచే విన్యాసాలు
కావ్యకళా లలిత పదలాస్యాలు మార్గదర్శిక మణిదీపాలు
మధురమై, మంజలమై, మలయసమీరమై
మనోజ్ఞమై గుండెలను పులకింపజేసే
అమ్మమాటలు విజ్ఞానపు మూటలు,
అవి ముక్తికి బాటలు ॥

12. సర్వజనారాధ్య

అమ్మ సూక్తులు ఆణిముత్యాలు
అపూర్వ సమన్వయ జ్ఞానదీప్తులు
అఖండాద్వైతబుద్ధిని ప్రసాదించే కరదీపికలు
అశేష జనీనతా విస్ఫురిత నిత్యనూతనాలు ॥అమ్మసూక్తులు॥
ధవళ చంద్రికా దరహాసభాసురాలు
మహితలలనాత్మకవిలసితాలు

నిర్మలతరంగిణీ మధుర గంభీరానాదాలు
నవ్యావలోకన దివ్యలోకి సందర్శనాలు ॥అమ్మసూక్తులు॥
వేద వేదాంగాల అభివర్ణిత తత్వసారాలు
అలతి అలతి పలుకుల మృదుమధుర సూక్తులు
"అందరికీ సుగతే, నా ఒడి విడిచి ఎవరూ లేరు"
నిర్ద్వంద్వంగా ప్రకటించిన అమ్మ సర్వజనారాధ్య ॥అమ్మసూక్తులు॥

13. అమ్మ

అం ఆ ధ్యాస అనవరతమున్న
అంటే ధ్యానమొదవునన్న
అంతరాంతరమున తృప్తివున్న
అంతర్ముఖమై ముక్తి పొందుదమన్న ॥

(ధ్యాసే ధ్యానం, తృప్తే ముక్తి అన్న అమ్మసూక్తులు. అష్టావధానంలో ధ్యాస, ధ్యానం, తృప్తి, ముక్తి దత్తపదికి ఇచ్చిన వాక్యాలు. పైది నేను రాసిన కవిత)

ధ్యాస కలిగిన వారినే అంబకాంచు
ధ్యానమున నిల్వప్రేమతో తరలివచ్చు
తృప్తి కలిగిన వారికే తీరుభవము
ముక్తి అనునది నిజముగా భువిని అదియె ॥

14. అమ్మ రూపము

సుందరము, సౌష్ఠవము, మనోరంజకము, ఆహ్లాదము
ఆపాదమస్తకము ప్రజ్వరిల్లే దివ్యరోచిస్సులు
నయనయుగళిలో తారసిల్లే కారుణ్యప్రభలు
పెదవులపై నిరంతరలాస్య దరహాసరేఖలు ॥
సువర్ణాభరణ దీప్తిని పరిహసించే దివ్యచరణాలు
ఆ పదపంకేరుహ సౌరభ రాజీవాలు
వివిధ వర్ణవిలసిత బహుకంకణ పరిశోభితహస్తాలు
అఖిలజనులకూ అభయ ప్రదానం చేసే కరకమలాలు

సకల అవయవాలలో జాలువారే సౌందర్య ప్రభావీచికలు
కంచిపట్టు చీరెతో జడల పూల సౌరభాలు
భృకుటిలో కుంకుమబొట్టు అమ్మ దివ్యరూపం
చెరగని ముద్రతో హృదయసింహాసనంపై ఆసీనమౌతుంది॥

15. విశాఖ లలితా పీఠం.(దేవి)

లాలిత్యం, లావణ్యం లాస్యం
కలబోసిన ప్రశాంత సుందరమూర్తి లలితాదేవి ॥

చిత్స్వరూపిణి ప్రశాంత తేజోరమణీయరమణి
హిమకరుని చల్లని చూపులతో తాపత్రయ నివారిణి
భయంకర కష్టముల దహించే జ్యోతిర్మయి
మొల్ల దంత శోభిత మాధురీ మంజరి॥

శ్రీ దక్షిణామూర్తి మహారాజ్ ప్రతిష్ఠించి
శ్రీ అవ్యక్తానందులలాలనలో పరిఢవిల్లి
ఉత్తర పీఠాధికారి శ్రీరామానందుల పూజలందుకొని
శ్రీ శివచిదానందుల హృదయపీఠమధిష్ఠించి
శ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి ప్రాచుర్యంతో
ముక్కోటి దేవతలు కొలువై విలసిల్లుతూ
అందరి హృదయాలలో అనుక్షణంబు నడయాడు
అమృతరసవాహిని, అవ్యాజకరుణామయి, ఆనందసంధాయిని ॥

16. అమ్మ సన్నిధి

అమ్మ సన్నిధిలోకోత్తర పరిమళాలు విరజిమ్ముతూ
మనలోని చింతనలు, వాసనలు, కామనలు అణిగి
కలవరపరిచే ప్రశ్నలు, బాధలు కరగి కరగి
మనస్సు, నిర్మలము, నిర్వికల్పమై శాంతి చేకూరుతుంది ॥

ఆ సాన్నిధ్యంలో బాహ్యస్మృతి వుండదు
పాపపుణ్యాలు, మంచిచెడులు, హెచ్చుతగ్గుల బేధం లేక
అందరం సమానమే అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళే
అంతా అమ్మ ఒడిలో పసిబాలురమే ॥

ఆ వాతావరణం వాత్సల్య రస సంభరితమై
మనిషికీ మనిషికీ మధ్య అనురాగం, ఆప్యాయత
అదృశ్యంగా పొంగలు వారుతూ
సౌమనస్యం, సౌభ్రాతృత్వం, సామరస్యం
వేయిరేకులుగా విప్పారి సుమసౌరభాల విరజిమ్ముంది ॥

17. ఆధ్యాత్మిక కేంద్రము

ఆధ్యాత్మిక కేంద్రంలో శిక్షితుడు
కొలిమిలోని బొగ్గులా కణకణలాడు
ప్రకాశించే దీపం పగిది దీపించు

శారీరక మానసిక క్రమశిక్షణ
సదాచార సత్‌శీలంతో వ్యక్తికి
సాధన బహుముఖ ప్రయోజనకారి ॥
ఏకాంతసాధన కాక
సమిష్టి సాధనలో సౌలభ్యం
మార్గప్రబోధానికి సద్గురువు నాశ్రయించాలి॥

18. అందరిల్లు

క్షీరాబ్ధి నుండీ ఆవిర్భూతమైన కల్పవృక్షము
సామ్యవాదానికి, సమతావాదానికి మకుటాయమానము
అపూర్వ పదకోశానికే మహోజ్వల మణిదీపం
అమ్మ విశ్వజనీనతకు ప్రతిబింబం అందరిల్లు ॥

19. జగజ్జనని

ఎండిపోయే జీవనలతకు నీరు పోసి
కొడిగొట్టిన జీవన జ్యోతులను జ్వలింపచేసి
స్తుపమానసాలను జాగృత మొనరించి
తీరని కోరికలను తనివితీర తీర్చి
మారని మనసులను మార్చి వారి
ప్రశ్నలకు తగినరీతి సమాధానమిచ్చి
సమస్యలకు పరిష్కార మార్గము చూపి
అతిమానుష శక్తిగా విలసిల్లిన
జగజ్జనని జిల్లెళ్ళమూడి అమ్మ॥

20. అమ్మ

మనసు ఎంత గంభీరమో హృదయమంత మార్దవము
ఆ రూపంలో దాగిన అనంతశక్తి, వాత్సల్యములు
ఆ కన్నులలో జ్వలించే సూర్యకోటి సమప్రభలు
అమ్మ చూపే ఆదరణకు, అనురాగానికి ప్రతీకలు ॥

21. మమతానురాగం

కష్టాల సుడిగుండంలో చిక్కి
బాధల ఎడారిలో వడగాడ్పులు తిన్నవారికి
చల్లని మాటతో, అతి చల్లని చూపుతో సేదతీర్చి
ఆదరించి మనస్సుకు శాంతిని, జీవితానికి
మార్గాన్ని నిర్దేశించే అమ్మ ప్రేమ మనలను
ఆకర్షించుకొని అత్యంత సన్నిహితుల చేసి
అపరిమిత మమతానురాగాలకి బందీలుగ చేసి
అమ్మలో విలీనమవ్వాలనే కాంక్ష బలీయమౌతుంది ॥

22. ప్రేమమూర్తి

అవ్యాజము, అపారము, అమలినమై
స్వపరబేధం లేని ప్రేమస్వరూపిణి
రాగద్వేషాలకు అతీతంగా నిష్కల్మష, నిర్లిప్తతతో
ప్రశాంత చిత్తంతో ప్రేమించే ప్రేమమూర్తి అమ్మ ॥

23. సామ్యవాదం

ఆధ్యాత్మిక రంగంలో సంపూర్ణత్వాన్ని సందర్శించి
సమభావం, సమచిత్తంతో సామ్యవాదాన్ని ప్రవేశపెట్టి
ప్రత్యేకశైలిలో సర్వజన హృద్యంగా ప్రవచించి
లోకాన్ని వాత్సల్య క్షీరాబ్ధిలో ముంచెత్తింది అమ్మ ॥

లోక సముద్ధరణ, సమాజశ్రేయస్సు, వ్యక్తి వికాసానికి
అన్నపూర్ణాలయంలో వర్గ, వర్ణ విభేదం లేక
ఏకపంక్తిన ఎల్లరకూ ప్రసాదమిడి
సమతావాద సిద్ధాంతాన్ని పాదుకొల్పింది అమ్మ॥

అమ్మ వాక్కు, స్పర్శ, దృష్టి, సంకల్పంతో అంతరంగం స్పందించి
నిష్కల్మషం, నిర్లిప్తం, నిర్వికారం, నిరాకారంగా
నిర్గుణత్వంతో సామ్యవాదాన్ని నిర్వచించింది అమ్మ॥

24. శ్రీ చరణ రాజీవాలు

అమృత కలశం, పరశువేది, సంజీవని
చింతామణి, కామధేనువు, కల్పవృక్షాలకు
ఆ పాదద్వయం ఆలవాలమై
పుణ్యజాహ్నవిలా తనువు, మనస్సు శుద్ధిచేస్తాయి॥

అదృష్టవశాత్తు ఆ పాదరాజీవాలను స్పర్శించితే
అమృతలహరి ఆ పాదాలనుండీ ప్రవహించి

మేను పులకరించి, ఆ చరణ సౌందర్యానికి
ఆ మార్దవానికి సమ్ముగ్ధులమవుతాము॥

25. అన్వేషణ

చీకటితో పోరాటమూ, వెలుగుకోసం ఆరాటమూ
అజ్ఞానం వల్ల వేదనా, జ్ఞానం కోసం సాధనా
బాధ అంటే భయమూ, సుఖమే ధ్యేయమూ
అశాంతిలో తేలని కదనమూ, శాంతిని చేరలేని గమనమూ
దుఃఖము గురించి మథనా, ఆనందం కోసం తపనా
మృత్యువుతో నిత్యసంఘర్షణ, అమృతత్వం వైపు ఆకర్షణా
అదే ఆదిమానవుని నుండి నేటి అణుమానవుని వరకూ అన్వేషణ॥

26. అనుగ్రహ వీక్షణ

అనంతజ్ఞాన సముపార్జనతో కలిగే అనుభూతిని
అనురాగ క్షీరజలధిలో ముంచెత్తి పరవశుల చేసి
వాత్సల్యామృత వృష్టిలో పునీతుల చేయుటకు
అమ్మ సంకల్పమాత్రానే అనుగ్రహవీక్షణ బరపుతుంది॥

పెనుతుఫాను కల్లోలిత సముద్ర తరంగాలలా
ఉత్తుంగ అలలతో సంక్షోభిత కాసారంలా
కకావికలమైన మనస్సు
సూర్యరశ్మికి మంచు కరిగినట్లు, ఉషోదయంతో చీకట్లు పారిపోయినట్లు
అమ్మ అనుగ్రహవీక్షణతో మన మనస్సు స్థిమితపడుతుంది॥

27. ఆదర్శ గృహిణి

గార్హస్థ్య జీవితంలో ఆదర్శగృహిణి
గగనతలంలో ధృవతార
కర్పూర కళికవలే తాను జ్వలిస్తూ
పరిసరాలను కాంతివెల్లువతో ముంచెత్తి

తృణకణాలు కూడా తాను తీసుకోక
కామధేనువువలె వాత్సల్య క్షీరధారలతో
సంతానానికి క్షుధాగ్నిని చల్లారుస్తుంది॥

కంటకావృతమైన మార్గగమనంలో
చిత్తశుద్ధివల్ల అవరోధాలను అతిక్రమించి
పతివ్రతగా, సాధ్వీగా, మాతృమూర్తిగా
మహోన్నతము, మహోజ్వలము, మనోహరమైన
మాతృత్వ శిఖరాన్ని అధిరోహించింది అమ్మ
జిల్లెళ్ళమూడి అమ్మ మాతృశ్రీ అనసూయా మహాదేవి॥

29. అమ్మ జీవితం

నవరస ప్రపూర్ణం, నవతారస ప్లావితం
పరిపూర్ణ మానవతా వికసితం
పరిపుల్ల మాధవత్వ పరిమళ భరితం
మానవతా మాధవత్వ సమ్మిళితం ॥
అమ్మ జీవిత కావ్యం రమణీయం
మంగళ మనోజ్ఞ మహితాచరితం
జన బాహళ్యానికి ప్రయోజనకరం
లోకానికి ప్రభోదాత్మకం
మానవాళికి మార్గదర్శకం ॥

29. అమ్మ

అమ్మ అంటే మనకు ఎంతో ఇష్టం
అమ్మను తలుచుకుంటే అమ్మ మనతోనే వుంటుంది
అమ్మకు దణ్ణం పెట్టుకుంటే రాత్రి మన దగ్గరకు వస్తుంది
అమ్మకు మనం పూజ చేస్తే మనని దీవిస్తుంది
అమ్మకు మనం చేసిన పదార్థాలు నివేదన చేస్తే అనుగ్రహిస్తుంది॥

లలితాచక్రవర్తి

౩౦. ఆకాంక్ష

నవ్యమానవతా వ్యవస్థాపన కోసం ఆకాంక్ష
అవధులు లేని వాత్సల్యం విశ్వాన్ని పునీతం గావిస్తూ
సర్వప్రాణికోటి జననియై, సర్వసమభావసముల్లసితమై
సదమలప్రేమ ప్రవాహంలో మునకలు వేయాలి॥

శాంతాన్ని, సహనాన్ని ప్రదర్శించే
అమ్మ వ్యక్తిత్వపు కోటి దీపాల వెలుగుల్లో
ప్రేమ సుధల్లో కరిగి వాత్సల్య వృష్టిలో తడిసి
అనురాగ శరచ్చంద్రికల్లో జలకాలాడాలి॥

31. విశ్వజనని

వివిధ రూపాలకు, విభిన్ననామాలకూ ఆధారమై
సకల జగదుత్పత్తి స్థితిలయాలకు హేతుభూతమై
సర్వవ్యాపకమూ, సర్వనియామకమూ, సర్వస్వతంత్రమై
మహాశక్తి విశ్వజననిగా మనసుల్లో స్ఫురిస్తుంది॥

అజ్ఞాన తిమిరాంధకారంలో కొట్టుకు పోకుండా
అభయమిస్తూ జ్ఞానాజ్ఞానాలు భగవత్స్వరూపాలేనని
దౌర్బల్యంతో కృంగవలసిన పనిలేదని
మాతృమూర్తియై మహనీయ వాత్సల్యంతో పొదుపుకుంది

౩౨. హైమాలయం

కాలువ నిండా నీరున్నా త్రాగటానికి రేవు కావాలి
దైవం సర్వవ్యాపకమైనా అర్చనకూ, ఆరాధనకు
ఒక మూర్తి, ఒక ఆలయం అవసరం
ఆ మూర్తి ఆదర్శమై ఆ ఆలయం పవిత్రక్షేత్రం కావాలి॥

అమ్మ గర్భసంజనితయే అర్చనామూర్తి, ఆమె నివాసమే హైమాలయం

మనిషి ఎంత నిర్మలంగా వుండవచ్చునో, ఉండగల్గునో
హైమ ద్వారా నిరూపించి, జీవితకాలం అనులినమూ
ఆదర్శవంత పథంలో నడపించింది అమ్మ॥

చరమాంకంలో జ్ఞానమూ, సాక్షాత్కారం
మృత్యుంజయత్వమును ప్రసాదించి
మానవిలో మాధవత్వాన్ని నింపి
లోకానికి ఆరాధ్యదేవతగా చేసింది అమ్మ॥.

కారుణ్యము, అనురాగము, వాత్సల్యపూరిత హైమ
ఆశ్రితులనూ, ఆర్తులను ఆదరిస్తున్న సర్వజనారాధ్య
హైమలాయం కల్పవృక్షమై, భక్తుల కోరికలు ఈడేరుతూ
ఆలయానికి చేరిన వారి మనస్సులను ఆనందప్లావితం చేస్తోంది॥

33. మహదాశయం

మంగళ మనోజ్ఞ పవిత్ర పరమశాంతమూర్తి
దయానిలయాల కమనీయ కనుదోయిలో
ప్రవహించే ఆశీ ర్లహరిలో మునకలు వేయాలి॥

ఆ అమృతహస్తం ప్రసాదించే అభయం
మనుగడలను మధుమయం చేసి ఆనందధామం చేర్చాలి॥

ఆ ప్రగాఢ మౌనంలో ప్రసారమయ్యే దివ్యసందేశం
మధుర మంజుల మనోజ్ఞ మలయ సమీరమై
మన జీవితాలకు నూతనోత్తేజమూ, నూతనోత్సాహమూ
సమకూరగలవన్న విశ్వాసం, మహదాశయం బిడ్డలందరిదీ ॥

ఆ కన్నులలో జ్వలించే సూర్యకోటి సమప్రభలు
మా హృదయాలను తాకి, ఉత్తేజపరిచి
మమ్ముల ఆనంద డోలికల ఊగించమ్మా ॥

34. అమ్మ ప్రసాదం

అమ్మ అనుగ్రహ ప్రసార విశేషముతో
అన్నపూర్ణాలయంలోని అన్నం ప్రకృష్టమై, ప్రసాదమై
అతిమధురము, మహిమాన్వితము, శక్తివంతమై
చీకటిబ్రతుకుల్లో శరశ్చంద్రికలను ప్రసరిస్తుంది॥

అమ్మ ఆశీస్సులతో అందుకున్న బట్టలు, కుంకుమ
మోడు వారిన ఎడారి జీవితాలను సస్యశ్యామలం చేస్తాయి
ప్రసారం వెయ్యి విధాలు కావచ్చు కాని ప్రసాదం ఒకటే॥

35. వజ్ర సంకల్పము

అమ్మ సూక్తులు అనవరతం ఆచరిస్తూ
అమ్మ దివ్యత్వాన్ని ప్రతిక్షణం అనుభవిస్తూ
ప్రతి నిత్యం మనం పొందే ప్రయత్న వైఫల్యాలను
ప్రజ్ఞా సాధనాలను గుర్తించి చిత్తశుద్ధితో
ప్రతికార్యమూ భగవత్సేవ అనే భావనతో
సర్వ విభేదాలను విస్మరించి వజ్రసంకల్పంతో
అమ్మ సేవాకార్యక్రమాలకు బద్ధకంకణం కావాలి॥

36. కాంతి కాంత

అమ్మ కన్నులు సూర్యచంద్ర దీపాలు
అమ్మ ముఖబింబం శాంతి సౌమనస్యాల కాలంబం
అమ్మ ఒక దేదీప్యమానమైన దీపశిఖ
అమ్మ చుట్టూ ఉన్న పిల్లలు దీపప్రమిదలు
అసలు దీపాలకు ఉద్దీపమైన కాంతి అమ్మ
కాంతి కాంత అమ్మే అయితే, వెలుగుకు వెలుగు అమ్మైతే
ఆ వెలుగులో ఆడుకునే పసిపిల్లలం మనం.
ఈ అమ్మాటలోని బొమ్మదీపాలం మనం.

37. జ్ఞానరోచిక

కవివర్యుడు గుణాఢ్యుడు, సిద్ధేశ్వరి ప్రియపుత్రుడు
ధర్మమార్గ, కర్మమార్గ, జ్ఞానమార్గ సుమసూత్రుడు ॥
మన సమస్యలెన్నిటికో పరిష్కార మార్గమిడి
గమ్యమునకు నడిపించెడి సౌమ్యుడు ఋషివర్యుడు ॥
వారి అడుగు జాడలలో జీవనమార్గము కాంచుడు
అభినవ మౌనస్వామికి అంజలి చేసి తరించుడు ॥
మనసుఖము, మన కష్టము మన చేతిలొ ఉన్నదంచు
మనను మనము జయించెడి మార్గము ఉపదేశించుచు ॥
శ్రీలలితా, జయలలితా సామ్రాజ్యమె మనసు గుడి
అమ్మ ఒడి, స్వామివారి ఏలుబడి మనకు బడి ॥
అతడె మలయమరీచిక, మంత్రతంత్రముల సూచిక
మమతావీచిక, మహాజ్ఞాన రోచిక అతడె ॥
"ఆ మహనీయునికిదె నమస్సు
అర్పించెద సుమనస్సు" ॥

38. అభివందన అక్షర కుసుమాంజలి

వందనం అభివందనం ॥
నన్నయార్యుని అక్షర రమ్యత
తిక్కన సోమయాజి రసాభ్యుచితబంధం
ఎఱ్ఱాప్రగడ సూక్తివైచిత్రి
బమ్మెరపోతనామాత్యుని భక్తి తత్పరత
శ్రీనాధుని ప్రౌఢకవిత
అల్లసానివారి అల్లికజిగిబిగి
రామలింగని పదగుంభనము
ముక్కు తిమ్మనార్యుని ముద్దుపలుకు
కలగలపి కవిత్వ మొనరించు శ్రీ సిద్ధేశ్వరానంద॥

ఇంద్రసభ, సరస్వతీసామ్రాజ్యాది రూపకశిల్పి
శ్రీనాథ పీఠాధ్యక్షులుగా "గర్తపురి" ఖ్యాతి వెదజల్లిన
కరుణశ్రీ పదలాలిత్యము
విశ్వనాథ వారి ఆత్మ విశ్వాసము
శ్రీకృష్ణదేవరాయల పరిపాలనాదక్షత
తమదిగా చేసుకొని శిష్యులపాలింప
అవతరించిన శ్రీ సిద్ధేశ్వరానంద ॥

బృందావనేశ్వరి రాధచే మంత్రంబు బడసి
స్వయంసిద్ధకాళి కోరి దరిచేర
పిలచి సిద్ధేశ్వరి పీఠమిచ్చె
మహామంత్ర తంత్ర వేత్త శ్రీ సిద్ధేశ్వరానంద ॥

శిష్యాభీష్టము మేరకు మంత్రమొసగి
దాని పరిసమాప్తి చేయు శక్తి నొసగి
వారి బాధల సర్వమూ హరింప చేసి
ఆధ్యాత్మికరంగాన ఆరితేరిన భంగి
పదిమంది కుపయోగపడు రీతి
శిష్యుల మలచు శ్రీ సిద్ధేశ్వరానంద ॥

జిల్లెళ్ళమూడి అమ్మ వాత్సల్యాంభోనిధిలో
మునకలు వేసి అన్నదాన మహిమ గుర్తెరింగి
దాని నిత్యారాధనము చేయు శ్రీ సిద్ధేశ్వరానంద ॥

మున్ను విద్యాదేవ కులపతిగా
నాడు ప్రసాదరాయ కులపతిగా
నేడు శ్రీ సిద్ధేశ్వరానంద యతీశ్వరులుగా
అలరారుతున్న శ్రీ భారతీస్వామి
మీ కివే మా హృదయపూర్వక నమస్సుమాంజలులు
అభివందన మందారాలు శ్రీ సిద్ధేశ్వరానంద ॥

39. ప్రార్థన

అమ్మా ! అమ్మా ! లోకపావనీ ! అమృతమూర్తీ !
తొలిచూపులో పొందాను ప్రేమ పాఠాల శిక్షణ
మలిచూపులో అయ్యాను నీపట్ల ఆకర్షణ
మరొక చూపులో ఇచ్చాను మనస్సునే దక్షిణ
కోటి చూపులతో నీ కోసమే నా నిరీక్షణ ॥

నా జీవితాన్నీ నీకు చేసాను అర్పణ
పలుమార్లు చేసాను నీ చుట్టూ ప్రదక్షిణ
నీ ప్రేమ కోసమై చేస్తున్నాను సాధన
నీ ఒడిలో కాస్తంత స్థానం కొరకే ఈ ప్రార్థన ॥

40. స్నేహము

జీవితం వడ్డించిన విస్తరి కావాలని
అందరం కోరుకుంటాము ॥
పరవళ్ళు తొక్కుతున్న జీవితంలో
స్నేహం ఒక దివ్యమైన అనుభూతి ॥
సృష్టిలో తీయనిది స్నేహం
స్నేహం ఒక అమృత భాండం
స్నేహంలో ఉండదు స్వార్థం
స్నేహంలోని మకరందం
స్నేహానికి వన్నె తెస్తుంటే
స్నేహాన్ని ఆస్వాదించే మనసు కావాలి॥
స్నేహం ఒక సుమసౌరభం
స్నేహం సుస్వరాల రాగాలనందిస్తుంటే
విని ఆనందించే వీనులు కావాలి॥
స్నేహంలో నాన్యతాధిక్యతలు లేవు
స్నేహంలో లాభనష్టాలు అంతకంటే లేవు

స్నేహం కోసమే అహరహం ఆరాటం ॥

స్నేహం బతుకు పండించే జలాశయం
స్నేహానికి కొలతలు తూనికలు లేవు
స్నేహం కొరకే బ్రతుకు పోరాటం ॥

స్నేహం ఒక ధృవతార
స్నేహం ఒక మలయమారుతం
దానిని స్పృశించే మేను కావాలి॥

స్నేహం కష్టాలలో కన్నీరు తుడిచే చేయి
స్నేహం ఆపన్నుల ఆదుకునే నేస్తం
స్నేహాన్ని అందిపుచ్చుకునే కరం కావాలి ॥

మైత్రిలో వుండదు దాపరికం
ఒకరికొకరు ప్రాణ సమానం
ఈ సత్యం సమాజానికొక ఆదర్శం

స్నేహం కొరకే జీవించు
స్నేహం కొరకే మరణించు
స్నేహం మరువరానిది, మరువలేనిది॥

41. ఆశ

ఇంద్రధనస్సు వన్నెలతో
సప్తస్వరాల మధురిమతో
తేనె లొలుకు తీయని పలుకులతో
పక్షుల కిలకిలారావములతో
ఆటపాటల కమ్మని తనువులతో
నదులకున్న వయ్యారాలతో
వెన్నెలవాగుల శీతల జ్యోత్స్నలతో
మంచులాంటి తెల్లని మనస్సులతో
భరతమాత వెలుగొందాలని నా ఆశ॥

పచ్చని పంటల శోభలతో
కమ్మని మల్లెల సువాసనలతో
నీ బిడ్డలు వెదజల్లు విద్యా సుగంధాలతో
అభ్యుదయ భావాల ఆలంబనతో
భరతమాత విలసిల్లాలని నా ఆశ॥

లౌకిక తత్వపు హారాల జిలుగులతో
మధ్యన అశోక చక్రపు జండాతో
కాశ్మీరు కొండల కిరీటముతో
నీ విశ్రాంతి పీఠం కన్యాకుమారిలో
భరతమాత ప్రభావించాలని నా ఆశ॥

42. ఆశయం

సామాన్యుని ఆశలు దురాశలు కాకున్నా
ఒక్కోసారి మిగిలేది మాత్రం నిరాశే ॥
ఆశల కెరటాల దూసుకుపోయి
కాలచక్రంలో నలిగిపోయి
జీవితంలో పోరాడి, పోరాడి అలసి
ఈ జీవిత చరమాంకంలో తెలుసుకున్న సత్యం ॥

జీవితాన్ని కొవ్వొత్తిలా కరిగించినా
బ్రతుకుని హారతిలా వెలిగించినా
అమూల్యమైన ఈ కాలచక్రంలో
చొక్కాని లేని జీవిత నావకు అంతా దరిలేదు ॥

మన లక్ష్యసాధనే మనకు తోడుగా
క్షణమైనా వృధా చేయక
ఏకాగ్రతతో సమాజానికి మేలు చేస్తూ
మనల్ని మనం సంస్కరించుకోవాలి ॥

విశ్వాసంతో కార్యసాధన చేసిన
విజయం తప్ప కవరిస్తుంది

నమ్మకమే శ్వాసగా కలిగినవాడు
అసాధ్యాలు సుసాధ్యాలే అవుతాయి ॥

క్రియాశీల కార్యక్రమాలతో
ధైర్యంగా ముందుకు నడుస్తూ
మానసిక అశాంతిని పారద్రోలి
పరమాత్మకే అంకితమవ్వాలి ॥

43.శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద జన్మదినమహోత్సవం

శుభోదయం, శుభోదయం, శుభోదయం
గణతంత్ర దినోత్సవ మహోదయం
శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద జన్మదిన మహోదయం ॥

అజ్ఞాన తిమిరాంధకారంతో నిండిన
మానవాళికి వెలుగుదారి చూపాలి॥

నూన్యత, హేయమైన దారిని ప్రజలను
మళ్ళించి సుగమమైన మార్గాన నడిపించాలి ॥

మనిషికి మనిషికి మధ్య అనురాగం, ఆప్యాయతలతో
వాతావరణం వాత్సల్య రసభరితం కావాలి॥

జాతి, మత, వర్గ, వర్ణ వివక్షత లేక
జనులందరూ కలసి మెలసి మెలగాలి ॥

పాశ్చాత్య దేశాల సంస్కృతిలోని మంచిని
గ్రహించి మన సంస్కృతికి నీరాజనం పట్టాలి॥

రాబోవుతరాలకు మన నాగరికతా విలువలకు
వారధులమై మన నాగరికత గొప్పతనాన్ని చాటాలి॥

మారుతున్న కాలంతో పాటు మనం మారుతున్నా
మన విలువలను విస్మరించక కాలానికి తగ్గట్లు నడుచుకోవాలి ॥

భావితరాలకు ఆదర్శ భవనాలు నిర్మించి
సామానస్యం వేయిరేకులుగా విప్పారి
సుమసౌరభాలను ప్రసరించాలి ॥

మంచి చెడ్డలు పాపపుణ్యాలనే హెచ్చు తగ్గులు లేక
అందరికీ మంచితోవ చూపే మహోనుభావులు కావాలి
వారే వారే వారే శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి ॥

44. ఆకాంక్ష

చీకట్లో మిణుకు మిణుకుమనే చుక్కలాకాక
సుప్రభాత గానం చేసే శుక్రతారలా వెలిగిపోవాలి॥
తూర్పున ఉదయించే సూర్యుడు అక్కడే వుండిపోతే అందమేమున్నది
భూమి తన చుట్టూ తాను తిరుగుతూ అనంతాన్ని క్షణాలుగా విభజిస్తోంది॥
నాడు –
మానవజాతి గర్వించే విధంగా
బిడ్డలను తీర్చిదిద్దే మాతృమూర్తిగా
వ్యక్తిత్వాలను మలిచే శిల్పిగా
తొలి గురువుగా శిశుప్రాయంలో
నేర్పిన నడవడి జీవితాలకే ఒరవడి అయ్యేది॥
వివేక విచక్షణా, క్రమశిక్షణలలో
సద్గుణ సౌరభాలందించేవిరులుగా
సుందర సుమధుర ఫలాలుగా మేధావులను
దేశభక్తులను అందించిన అమృతమూర్తులు॥
నేడు
పాత నమ్మకాలను చెరిపేసి
అభిజాత్యంతో అపనమ్మకంతో
కొత్తదారులను వెతుక్కుంటున్నారు॥
స్త్రీకి ప్రత్యేకంగా మాతృత్వాన్ని ప్రసాదించిన ప్రకృతి
దానికి సరియైన నిర్వచన మివ్వలేక

పుట్టిన బిడ్డలనే కబళిస్తున్న కాలనాగులు
ఈ సమాజంలో బడబాగ్నిలా పెరిగిపోతున్నారు ॥
లోక కళ్యాణం, మానవతావాదం
మహాత్ముల లెప్పుడూ ఆదర్శం
సమసమాజ నిర్మాణానికి పాటుపడుతూనే వున్నారు
అట్టివారే శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి॥

45. అన్నపూర్ణాలయం

అనురాగ క్షీరాబ్ధి అమ్మ అద్భుత హృదయానికి
బాహ్యాకృతి అన్నపూర్ణాలయము
పదార్థాలలో పొదగబడేది మధురాతి మధురమైన
అమ్మ అనురాగము, అపరిమిత వాత్సల్యము ॥
అవ్యాజ పూరిత అనురాగంతో పాటు, బాధానివారణ
జబ్బుకు ఔషధము, సమస్యకు పరిష్కారము
ప్రశ్నకు సమాధానము, అన్నపు ముద్దలో
నిక్షిప్తమై అభీష్ట సిద్ధి కలుగుతుంది ॥
సమదృష్టి, సమతా సిద్ధాంతాన్ని నిర్వచించి
అనుగ్రహాన్ని ప్రసాదించి, మహిమను ప్రకటించి
వేదాంతం ప్రబోధించి, లౌకిక సందేశాన్ని ప్రవచించి
సురాసురభేదరహితంగా సహస్రబాహువులతో అమృతం పంచుతోంది
పరమాద్వైత, పరమోత్కృష్ట, పరమోన్నత స్థితిని
ప్రవచించిన అమ్మకు ప్రతిరూపం అన్నపూర్ణాలయం ॥

46. దైవత్వము

అపరిమితత్వం పరిఢవిల్లి
వైకల్యం లేవి పూర్ణత్వం ప్రఫుల్లమయి
త్యాగం, కరుణ, ప్రేమ, సహనం
నాలుగు స్తంబాలుగా పరిపూర్ణ మానవత్వం

పందిరివేసి మూడు పూలు ఆరుకాయలుగా
వికాసం పొందేదే దైవత్వం ॥

47. కళాప్రపూర్ణ

కళాప్రపూర్ణ అమ్మలోని షోడశ కళలు ప్రఫుల్లమై
స్వరలాలిత్యంతో పాటు సర్వవిద్యల పారంగత్వము
మానవతా మాధవత్వాల రమణీయ సమ్మేళనములో
మధురానుభూతులనూ మహనీయసత్యాలను అవలోకిస్తాము

48. అమ్మ దృష్టి

అమ్మ దృష్టి లిప్తపాటు కాలం ప్రసరించిన
చకోరపక్షి వెన్నెలలో తడిసినట్లు
చాతకం వానజల్లుకు మురిసినట్లు
మన ఎదలో తేనజల్లు కురిసినట్లు
మన జీవితాలే ధన్యత చెందినట్లు పులకించిపోతాము ॥
ఆ దృక్కులు మనలోకి సూటిగా గుచ్చుకొని
ఎంతో పదునుగా, బలంగా అంతరాలమూలల్లో శోధించి
మన వ్యక్తిత్వం, నీటిలో పడ్డ మట్టిబెడ్డవలె కరిగి కరిగి
ఆ పాదాల చెంత సర్వసమర్పణ చేస్తాము ॥
అమ్మ అపాంగ వీక్షణం మనోరంగాన్ని మలిన రహితం చేసి
సమస్యలకు, సందేహాలకు పరిష్కారాలు, సమాధానాలు స్ఫురించి
ఆ శబ్దగీతికలో సప్తస్వర సహిత ఆనందరసానుభూతిని పొందుతాము॥

49. చల్లనితల్లి - జిల్లెళ్ళమూడి తల్లి

మమత, సమత, మానవత అన్నపుముద్దలో
కలగలిపి మననోటికి అందంచు అన్నపూర్ణ ॥
అనురాగం, ఆప్యాయత రంగరించి
మనలను ఆహ్లాదపరచు అనురాగవల్లి ॥
చందమామలో, చల్లగాలిలో పిల్లతెమ్మెరలు

చందాన మనమనస్సులకు హాయిగొలుపుచల్లని తల్లి॥
విరిసే జాబిల్లి చల్లదనాలు, హరివిల్లులోని అందాల
సొబగులను మనకు అందించు విరిబోణి ॥
అందానికి అర్థం, ఆనందానికి భాష్యంగా
మనస్సు అందంగా వుంటే చాలని తెలిపే ప్రేమమయి ॥
అంతులేని జీవనయానంలో ఎన్నో ప్రశ్నలు, ఎన్నెన్నో సమస్యలు
దారితెలియని పోరాటాలలో దారిచూపే మార్గదర్శి ॥
తేనెకన్న తీయనిపలుకులు, మంచుకన్న చల్లనిచూపులు
మల్లెకన్న తెల్లనిమనస్సు, కల్లాకపటం లేని కలభాషిణి ॥
నీ సహజస్వభావం, నీ నిర్మలప్రేమ భావనతో
తోటి సోదరులకు చేయూతనిమ్మనే స్నేహశీలి ॥
సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, మంచిని
మనలో పెంపొందించు కరుణామయి॥
చల్లనితల్లి – జిల్లెళ్ళమూడితల్లి.

50. క్షణక్షణం అనుక్షణం

మా మాటలో మా పాటలో
మాచేతలో మా రాతలో
మా కష్టాలలో నష్టాలలో
మా సుఖాలలో సంతోషాలలో
మా అడుగడుగులో క్షణక్షణం
మమ్మల్ని ముందుకు నడిపిస్తున్న
అమ్మపాదపద్మాలకు
వినమ్రతతో..
భక్తి ప్రపత్తులతో..
ఈ కుసుమపరాగం......



ఎ.యస్. చక్రవర్తి

కుసుమా చక్రవర్తి